# కథామంజరి

## పది కథల సమాహారం



మే 2024

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**



జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త



**మే 2024**

సంపుటి : 5 ♦ సంచిక : 5



ఈ నెల కథామంజరి సంచికకు

స్వర్గీయ వాడకట్టు వెంకట రమణారావు,
శ్రీమతి సీతారామం గార్ల

జాపకార్థం
ఆర్థిక సాయమందించిన
వారి కుమారుడు

శ్రీ వాడకట్టు వెంకట రమణమూర్తి గార్కి

మా ధన్యవాదాలు



కథామంజరి
నాల్గవ వార్షికోత్సవ సందర్భంగా
నిర్వహిస్తున్న కథల పోటీ

# పల్లెకు పోదాం,,!

కథ

కథామంజరి కథాప్రయాణంలో నాలుగు సంవత్సరాలు పూర్తిచేసుకుని, ఐదవ సంవత్సరంలో అడుగుపెడుతున్న సందర్భంగా ఈ కథల పోటీ నిర్వహిస్తున్నాం. పల్లెలే దేశానికి పట్టుగొమ్మలని అందరం నమ్ముతాం. ఆ పల్లెల్నే కథావస్తువుగా చేసుకొని అల్లిన కథలను పోటీకి ఆహ్వానిస్తున్నాం! ఆకట్టుకునే ఏ రసమైనా, ఏ అంశమైనా... మనసును కుదిపి రసవంతంగా సాగి పాఠకుడ్ని కట్టిపడేసే కథలను పోటీకి ఆహ్వానిస్తూ, క్రింద పొందుపరిచిన నిబంధనలను పాటించవలసిందిగా కోరుతున్నాం!

- 1200 పదాలు మించకుండా, కథను వర్డ్‌లో టైపు చేసి పంపవలెను.
- కథతో పాటుగా, కథ మీ స్వీయరచన అని, ఏ పత్రిక పరిశీలనలోను లేదని, సాంఘిక మాధ్యమాల్లో ప్రచురణ జరగలేదని.. సూచిస్తూ హామీపత్రం జత చేయాలి.
- కథలను “జన్మదిన కథల పోటీకి” అని వ్రాసి *submit@kathamanjari.in* కి మెయిల్ ద్వారా మాత్రమే పంపాలి.
- కథలు మాకు చేరడానికి ఆఖరు తేది 10.05.2024 రాత్రి 10.00 గంటల లోపు.
- ఈ కథల పోటీ విషయంలో కథామంజరి నిర్వాహకులదే తుది నిర్ణయం అని గమనించ ప్రార్థన!

ప్రథమ బహుమతి : ₹ 5000/-
ద్వితీయ బహుమతి : ₹ 3000/-
తృతీయ బహుమతి : ₹ 2000/-
10 ప్రోత్సాహక బహుమతులు: ₹ 1000/- చొప్పున

కాలమాన పరిస్థితులకు అనుగుణంగా కలం పదునుబెట్టే మన తెలుగు రచయితలూ .. వాటిని ఆదరించే పాఠకులూ ఉన్నంత కాలం, తెలుగుకథ వెలుగులు పంచగలదనే నమ్మకంతో .. కథామంజరి నిర్వహించే ఈ పోటీని విజయవంతం చేయగలరని ఆశిస్తున్నాం!

కథామంజరి బృందం





# బాలకథ

జులైనెలసంచికనుంచిప్రతీనెలాకథామంజరిలో,పిల్లలకథలురెండుప్రచురింపబడతాయి! ఈ కథల విషయమై చిన్న సూచనలు:

- 10-16 సంవత్సరాల మధ్య వయసులో ఉన్న పిల్లలు స్వయంగా ఆలోచించి, వారికున్న ఆలోచనలకి అక్షర రూపం ఇవ్వాలి. కథాంశం ఏదైనా వ్రాయవచ్చు. పిల్లలు ఇష్టపడే కథలు, పిల్లలు అర్థం చేసుకునే స్థాయిలో కథారచన ఉండాలి.
- 400 పదాలకు మించకుండా ఇలా వర్డ్ లో టైపు చేసి పంపాలి!
- కథ ఎలా వ్రాసినా సరే, ప్రచురణకు స్వీకరించే కథలను తగు రీతిలో మార్పులు, చేర్పులు చేసి ప్రచురణ చేయబడతాయి!
- పెద్దవారు కూడా పిల్లల కథలు వ్రాసి పంపవచ్చును. అవి కూడా ప్రచురణకు తీసుకోబడతాయి!
- పెద్దవారు వారి కథలను పిల్లల పేరుతో వ్రాసి పంపడం అనైతికమే కాకుండా, మా ఈ ప్రయత్నాలకు ఆశించిన ఫలితాలు దక్కకుండా చేస్తాయి!
- ప్రచురింపబడే కథలకు తగిన పారితోషికం కూడా ఉంటుంది!
- కథలు పంపవలసిన మా ఇమెయిల్: submit@kathamanjari.in

కథలు వ్రాయగలిగే పిల్లల్ని ప్రోత్సహిస్తూ, వాళ్ళల్లో సృజనాత్మకతకు పదును పెట్టే మా ఈ ప్రయత్నాలలో అందరి సహాయ సహకారాలను అందించ కోరుతున్నాం!

***

**కథామంజరి బృందం**







# మా జట్టు

సంపాదకుడు

**జయంతి ప్రకాశ శర్మ**

ప్రచురణ కర్త

**అవసరాల వెంకటరావు**

సంపాదక సహకారం

**ఎం.ఏ. పద్మనాభరావు**
**కృపాకర్ పోతుల**
**నందూరి సుందరీ నాగమణి**

ప్రచురణా సహకారం

**ఎం.ఎల్. కాంతారావు**

సాంకేతిక సహకారం

**Harbinger Publishing**

బొమ్మలు

**కొయిలాడ రామ్మోహనరావు**
**కొచ్చెర్ల వి.ఆర్.**
**సూరంపూడి చలపతిరావు**



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ/శ్రీమతి/కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు
- అవసరాల వెంకటరావు గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస

## శీర్షికలు


| | | |
|---|---|---|
| కథాకీయం | ... ... ... ... ... ... | i |
| విశిష్ట అతిథి | ... ... ... ... ... ... | ii |
| కథా మార్గదర్శి | ... ... ... ... ... ... | iv |
| వినదగునెవ్వరు చెప్పిన.. | ... ... ... ... ... ... | vi |
| కథాపుస్తక పరిచయం | ... ... ... ... ... ... | vii |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| మబ్బులో ఏముంది...!? | ... భమిడిపాటి గౌరీశంకర్ ... ... | 1 |
| రేపటి తీర్పు | ... పి. రాజేంద్రప్రసాద్ ... ... ... | 8 |
| వాడి గెలుపు నాదే! | ... కొత్తపల్లి ఉదయబాబు ... ... | 12 |
| ఆఫ్సోస | ... అనిల్ ప్రసాద్ లింగం ... ... | 17 |
| కాకతాళీయం | ... వల్లూరి విజయకుమార్ ... ... | 24 |
| పెద్ద దిక్కు | ... దాసు శ్రీహవిష ... ... ... | 30 |
| కీర్తి సువాసనల పరిమళం | ... నల్లబాటి రాఘవేంద్రరావు ... ... | 35 |
| ఊతకర్రలు | ... సుస్మితా రమణమూర్తి ... ... | 40 |
| ఒడి | ... వల్లూరి శివప్రసాద్ ... ... ... | 43 |
| సంతాప సభ | ... పోతుకూచి సాంబశివ రావు ... ... | 49 |


Cover Page Credit : Jobin Scaria, Calicut, IN

గడిచిన రెండు మూడు సంవత్సరాలలో తెలుగుసాహిత్యానికి, ముఖ్యంగా తెలుగు కథకి ప్రాచుర్యం పెరిగిందనే చెప్పాలి. కథలు వ్రాసేవారు విరివిగా వ్రాస్తుంటే, సాంఘిక మాధ్యమాలలో కథలను చదివి, వాటిని శ్రోతల్లోకి తీసుకెళ్తున్నారు. ఓ నలభై ఏభై సంవత్సరాల క్రితం, వీధి అరుగుల మీద కూర్చుని ఒకరు పత్రికల్లో వచ్చిన కథలను, ధారావాహికలను చదువుతుంటే, ఆ వీధిలో వాళ్ళంతా వచ్చి కూర్చుని సావధానంగా విని, కథాంశాలను చర్చించుకునేవారు. కాలమాన పరిస్థితులు మారిన తర్వాత, ముద్రణలో వచ్చే పత్రికల సంఖ్య బాగా తగ్గిపోవడం, అలాగే మనిషి జీవనవిధానంలో మార్పులతో వ్రాసేవారు, చదివేవారు గణనీయంగా తగ్గారు. ఈ పరిస్థితులలో సాంఘిక మాధ్యమాలు కొంతవరకు ఈ లోటును భర్తీ చేస్తున్నాయనే చెప్పాలి. ఈ మధ్య కాలంలో కథల వాసి మాట ఎలావున్నా, రాశి మాత్రం పెరిగింది. పాఠకులు, శ్రోతలు కూడా పెరిగారు. మంచి కథలు రావాలనే మంచి ఆలోచనతో, ముద్రణలో ఉన్న పత్రికలు, అంతర్జాల పత్రికలతో పాటు, చాలా సాహితీ సంస్థలు కూడా కథల పోటీలు నిర్వహిస్తున్నాయి. తెలుగు కథ మీద ఉన్న మమకారంతో, కొంతమంది దాతలు విరివిగా నగదు బహుమతులు అందిస్తున్నారు.

ఇక.. సాంఘిక మాధ్యమాల ద్వారా కథలు ఎక్కువమందికి చేరాలని, అటు రచయితలు, ఇటు ఆ కథలు శ్రావ్యంగా అందిస్తున్న గాత్రధారులు కృషి చేస్తున్నారు. ఇప్పుడు ఈ కథలు ఖండాంతర సరిహద్దులు దాటి, ఎక్కడెక్కడో ఉన్న తెలుగువారికి చేరుతున్నాయి. కథల మీద చర్చలు, విమర్శలు, విశ్లేషణలు, సూచనలు విరివిగా ఈ మాధ్యమాలలో కనబడుతున్నాయి, వినబడుతున్నాయి కూడా! ఈ నేపథ్యంలో, ప్రపంచ కథా దినోత్సవం సందర్భంగా, ఏప్రిల్ 23, 24 తేదిలలో అమెరికాలో ఉన్న శ్రీ రాయవరం భాస్కర్‌గారు ఆధ్వర్యంలో నడుస్తున్న బి+కథాకళ సంస్థ వారు ‘వంతెన కడదాం’ పేరిట యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారంలో కథోత్సవం నిర్వహించేరు. ఇరవైనాలుగు గంటలపాటు అవిరామంగా సాగిన ఈ కథాఝరిలో సుమారు పది పదిహేను దేశాల నుంచి నూటఇరవై కథలు చదివారు. కొందరు స్వీయ కథలు చదివితే, మరి కొంతమంది కథలు సేకరించి చదివారు. తెలుగు కథకి ఈ కార్యక్రమంలో అపూర్వమైన స్పందన వచ్చి, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారిని అబ్బురపరిచింది! ఇలా కథకి పట్టం కట్టి, పండగ చేసుకోవడం వినూత్నంగానూ, ఆనందంగానూ ఉంది.

ఇలా.. ఈ సాంకేతిక యుగంలో తెలుగుకథ ఓ అడుగు ముందుకు వేసింది. దేశవిదేశాలలో ఉన్న తెలుగువారికి కథ మీద మమకారం పుష్కలంగా ఉందనడంలో సందేహం లేదు. అయితే తెలుగు కథకి ‘అంతర్జాతీయంగా గుర్తింపు రావడం లేదు, ఆ స్థాయిలో కథలు లేవు, ‘గాలివాన’ తర్వాత మంచి కథ రానే రాలేదా’ అనే ఓ నిరుత్సాహం ఉంది. ఆ విషయం మాట ఎలావున్నా, ఈ సందర్భంగా ప్రవాసాంధ్రులకు, విదేశాంధ్రులకు ఓ విన్నపం. ఇప్పుడు వస్తున్న తెలుగు కథలలో మీకు నచ్చి, మీ హృదయాన్ని తాకిన కథలను మీ మీ ప్రాంతాలలో ఉండే భాషలోకి తర్జుమా చేసో, చేయించో, వాటిని అక్కడ ప్రచారంలోకి తీసుకు వెళ్ళండి! ఈ చిన్ని ప్రయత్నం, తెలుగు కథకి మరింత అంతర్జాతీయ గుర్తింపు రావడానికి దోహదపడుతుంది. అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో దేశాల్లో ఉన్న తెలుగువారు, వారి వారి రంగాల్లో నిష్ణాతులై గుర్తింపు పొందుతున్నట్టే, తెలుగు కథకి కూడా పట్టం కట్టడంలో మీ వంతు సహాయం అందించండి!

తప్పకుండా అందరం కలసి, తెలుగు కథ కొత్త తీరాల పరిమళించడానికి ‘వంతెన కడదాం’!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**శ్రీ వల్లూరి శివప్రసాద్**

కుటుంబ సభ్యులలో ఉండే సాహిత్యవేత్తల స్ఫూర్తినో లేదా, ప్రముఖుల రచనలు చదివి చైతన్యం కలిగో, లేదా తన చుట్టూ ఉన్న సమాజంలో ఉన్న పరిస్థితులను చూసి స్పందించో, లేదా ఇతరుల ప్రోత్సాహం వలననో, కలం చేతపట్టి రచనలు చేసినవారిని చూస్తూ ఉంటాం! కాని బాల్యంలో చూసిన బాలనాగమ్మ, సత్యహరిశ్చంద్ర, కృష్ణరాయబారం వంటి నాటకాల ప్రేరణతో, ఆ రంగం వైపు అడుగులు వేసి, చాలా ఇష్టంగా నటుడుగా, తర్వాత కలం చేతబట్టి రచయితగా ఎదిగిన వారు చాలా అరుదుగా కనబడతారు. అలా రచనా వ్యాసంగంలో అడుగుపెట్టి, ప్రయోజనాత్మక నాటక రచయితగా, అభ్యుదయ కథారచయితగా, తెలుగు సాహితీవేత్తగా ఎదిగిన ప్రముఖ రచయితలలో ఒకరు శ్రీ వల్లూరి శివప్రసాద్ గారు! మరో గొప్ప విషయం ఏమిటంటే.. ఉద్యమాలకు, తెలుగు సాహిత్య సాంస్కృతిక రంగాలకు ఉత్పత్తి కేంద్రం అనబడే గ్రామం కొలకనూరులో (గుంటూరు జిల్లా, తెనాలి తాలుకా), 1953 ఆగస్టు 27 న జన్మించారంటే, ఆ మట్టి మహిమ కూడా అటువంటిదే అని చెప్పాలి.

సంగీత, సాహిత్య, నాటక ప్రముఖలను అందించిన ఆ గ్రామంలో పుట్టి పెరిగి, పేరు ప్రఖ్యాతులు సంపాందించిన శ్రీయుతులు భావరాజు నరసింహారావు, నూతక్కి అబ్రహాం, తాళ్ళూరి నాగేశ్వరరావు, మోదుకూరి జాన్సన్, పి. సత్యవతి, వల్లూరి వెంకట్రామయ్య చౌదరి వంటి వారంతా శివప్రసాద్ గారికి ఆదర్శనీయులే. దానికితోడు శివప్రసాద్ గారి తండ్రిగారు ఆ ఊరు గ్రంథాలయాధికారిగా పనిచేసే రోజుల్లో, నిత్యం ఆయన వెంట గ్రంథాలయానికి వెళ్లడంతో పిల్లల పుస్తకాలు చదవడం అలవాటైంది. ఆ ఊరులో పండగలకి, పబ్బాలకి ప్రదర్శించే బాలనాగమ్మ నాటకం చూడటం, అందులో మాయలఫకీరు వేషంలో తన సమీప బంధువు వెంకట్రామచౌదరి గారిని చూసి, అంత గుర్తింపు పోందాలనే ఆలోచనతో, ఓసారి పాఠశాలలో మాయలఫకీరు ఏకపాత్రాభినయం చేసి బహుమతి పోందటం.. అలా నాటకరంగ ప్రవేశం బాల్యంలోనే జరిగిపోయాయి. తర్వాత కాలేజీలో చదువుతున్న రోజుల్లో, కాలేజీ మ్యాగజైన్ కోసం మొదటిసారి కథ వ్రాయడం, ఆ కథకు బహుమతి రావడం... అలా కథా రచనా అరంగేట్రం జరిగింది. ఆ రోజుల్లోనే 'ఎడారి బ్రతుకు' నాటిక వ్రాసి, కళాశాల వార్షికోత్సవంలో ప్రదర్శింప చేశారు. డిగ్రీ చదువుతున్నప్పుడే, నిన్ను నువ్వే దిద్దుకో, గడియారం, జైఆంధ్ర,

మొదలగు నాటికలు వ్రాసారు. శివప్రసాద్‌గారు చిన్నప్పట్నుంచీ అనర్గళంగా కథలు చెప్పుకుపోయేవారుట. అయితే ఆయనలో కథారచయిత పొంచియున్నాడనే విషయం వాళ్ళ అక్కయ్యగారు గ్రహించి, 'ఎప్పటికైనా నువ్వో మంచి రచయితవవుతావని' అనేవారుట. ఆ మాట నిజం చేసారు శివప్రసాద్‌గారు!

రచనలు చేయడం ఓ బాధ్యతగా స్వీకరించిన శివప్రసాద్‌గారు, కథ కోసం కథలు వ్రాయలేదు. జీవితానుభవాలు, అనుభూతులనే కథావస్తువుగా స్వీకరించి కథలు వ్రాస్తారు. "ప్రముఖ సాహితీవేత్త, రచయిత డాక్టర్ పరుచూరి రాజారామ్‌గారితో లభించిన సాన్నిహిత్యం, నా ఆలోచనలు, రచనల మీద ప్రభావం చూపెట్టింది" అని ఆనందంగా చెప్పే శివప్రసాద్‌గారి కథలలో మార్క్సిజం భావజాలం బాగా కనబడుతుంది. ఆ దృక్పథంతోనే కథలు వ్రాస్తున్నారు. దానికితోడు శరత్ సాహిత్యాన్ని బాగా ఇష్టపడి చదవడం వలన, కథ రచనలలో మెళుకువులు బాగా తెలిసాయి. కుటుంబం, బంధాలు, దేశభక్తి, మతసామరస్యం, రైతులు, పేదలు, వృద్ధులు, వలస వచ్చినవారు... ఇలా చైతన్యం కలిగించే అన్ని అంశాలను తన కథలలో సృజిస్తారు. 'సాహిత్య ప్రక్రియ ఏదైనా సరే, అది జీవితాలను ఆకళింపు చేసుకుని, చైతన్యం కలిగించి మనుషుల మధ్య అంతరాలను పోగొట్టి, సంబంధాలను పటిష్ఠ పరిచేదిగా ఉండాలి' అని గట్టిగా నమ్మే శివపసాద్‌గారి స్వప్నం సామ్యవాదం. ఆ దిశలోనే ఆయన రచనా వ్యాసంగం సాగుతుంది!

శివప్రసాద్‌గారు సుమారు తొంభై కథలు వ్రాస్తే, వాటిలో 35 కథలకు బహుమతులు వచ్చాయి. వాటితో తాజ్‌మహల్, కురిసిన మబ్బు, ముందే మేలుకో, నాగేటిచాలు, వల్లూరు శివప్రసాద్ కథలు.. వంటి కథాసంపుటాలు వెలువడ్డాయి. ఇవి కాక, ఆయన రచించిన నాటికలు, నాటకాలు, పిల్లల నాటికలు.. వీటితో సంపుటాలు వెలువడ్డాయి. శివప్రసాద్‌గారు రచించిన 'హింసధ్వని, ఇటు నుంచి అటు, రాజీ, ఏటిలోని కెరటం, ఇంటింటి భాగవతం, వెండి అంచులు, ఉచ్చు' మొదలైన నాటికలలో కొన్నింటికి రాష్ట్రప్రభుత్వ నంది అవార్డులు, మరికొన్నింటికి పోటీలలో బహుమతులు వచ్చాయి. శివప్రసాద్‌గారి సంపాదకత్వంలో ప్రసిద్ధ తెలుగు నాటికలు, ప్రసిద్ధ తెలుగు హాస్య నాటికలు, పిల్లల నాటికలు, నాటకరంగ ప్రముఖులు, వంటి ఎన్నో సంకలనాలు వెలువడ్డాయి. తెలుగు బుల్లితెర మీద బాగా ప్రాచుర్యం పొందిన 'మట్టిమనిషి' టీవి సీరియల్‌తో పాటు మరికొన్ని టీవి ఫిల్మ్‌లకు, చలనచిత్రాలకు రచనా సహకారం అందించారు. శివప్రసాద్‌గారి సాహితీ సేవలకు లభించిన పురస్కారాలు, సత్కారాలు ఓ పాతికపైగానే ఉన్నాయి! శివప్రసాద్‌గారి "తాజ్‌మహల్" కథాసంపుటిని మైసూరు విశ్వవిద్యాలయం బి.ఎడ్. విద్యార్థులకు పాఠ్యగ్రంథంగా నిర్ణయించడం మరింత గొప్ప విషయం అని చెప్పాలి!

అభ్యుదయ రచయితల సంఘం, రాష్ట్ర కార్యదర్శిగా, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడుగా తెలుగు సాహిత్యరంగానికి ఎనలేని సేవలు అందిస్తున్న శ్రీ వల్లూరి శివప్రసాద్‌గారు, డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసరుగా పదవీవిరమణ చేసి, అప్పుడు ఇప్పుడు కూడా, అటు సాహిత్య రంగానికి, ఇటు సామాజిక సేవారంగానికి తన సమయాన్ని పూర్తిగా వెచ్చిస్తూ, వారి స్వగ్రామంలోనే నివసిస్తున్నారు. దేవదాసు, లవకుశ, పాతాళభైరవి సినిమాలంటే బాగా ఇష్టపడే శివప్రసాద్‌గారు, ఈ సంచిక విశిష్ట అతిథిగా విచ్చేసినందులకు వారికి కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ, వారు మరిన్ని కథలను తెలుగు పాఠకులకు అందించగలరని ఆశిస్తున్నాం!

**కథామంజరి బృందం**

# కథా మార్గదర్శి



**కీ.శే. పోతుకూచి సాంబశివరావు**

అది మన దేశ స్వాతంత్ర్య ఉద్యమం నడుస్తున్న రోజులు! దేశం నలుమూలలా వివిధ రీతుల్లో ఉద్యమం ఉధృతంగా నడుస్తోంది. ఆ ఉద్యమానికి ఆకర్షితులై, తన వంతు బాధ్యతగా పాటలు వ్రాయడం, పాడటం చేస్తున్న సమయంలో గాంధీజీ విజయవాడ వస్తున్నారని తెలిసి, కాకినాడ నుంచి విజయవాడకి నానా కష్టాలు పడి, చేరుకుని సభాప్రాంగణం చేరుకున్నాడు ఓ పద్దెనిమిదేళ్ళ యువకుడు! గాంధీజీని దగ్గర నుండి చూడాలని ప్రయత్నించి విఫలుడై, చివరికి "నేను మిమ్మల్ని కలవడానికి వచ్చాను. అనుమతించండి" అంటూ ఆ జనసమూహంలో నుంచి బిగ్గరగా అరిచాడు. గాంధీజీ ఆ కేక విని, ఆ కుర్రాడిని తన సమీపానికి రప్పించుకున్నారు. ఆ యువకుడు గాంధీజీ ముందు ఓ దేశభక్తి గీతం ఆలపించారు. గాంధీజీ స్పర్శతో ఆ యువకుడికి అమితమైన ఉత్సాహం వచ్చింది. ఇక ఏం ఆలోచించుకోలేదు, బానిస బ్రతుకుల విముక్తి కోసం అక్షరాన్ని ఆయుధంగా ఎంచుకుని, ముందుకు నడిచి, తెలుగు సాహితీరంగంలో సుస్థిర స్థానాన్ని పొందారు. ఆయనే ప్రముఖ సాహితీవేత్త, ఆధ్యాత్మికవేత్త, కళాప్రపూర్ణ డా. పోతుకూచి సాంబశివరావు గారు!

సాహితీ ప్రక్రియలన్నింటిలోనూ అందెవేసిన కలం సాంబశివరావు గారిది! కథలు, నవలలు, నాటికలు, పద్యాలు, వచన కవిత్వం, వ్యాసరచన, అనువాదం.. వంటి అన్ని ప్రక్రియలలో వీరు కలం ఝులిపించారు. సాహితీ సంస్థ నిర్వాహకుడిగా, నటుడుగా, లాయరుగా, జర్నలిస్టుగా, సంపాదకుడిగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సభ్యుడిగా, లలితకళా అకాడమీ సభ్యుడిగా, ఆకాశవాణి సలహా సంఘ సభ్యుడిగా, సవ్యసాచి అనిపించుకున్నారు. ఇన్ని ప్రక్రియలలో కూడా చాలా ప్రాచుర్యం సాధించారంటే.. దానికి ఆయనకి లభించిన అవార్డులు, బిరుదులే తార్కాణం!

ఇక, సాంబశివరావు గారి కథల గురించి చెప్పాలంటే... సహజమైన ప్రత్యేకమైన శైలి ఆయనది. నాటక రచన, నటనలో కూడా సిద్ధహస్తులే కనుక, సాంబశివరావు కథనాల్లో దృశ్యం కనబడుతుంది. ఆనాటి సమాజంలో కనబడే సమస్యల మీద, మూఢ విశ్వాసాలు, స్త్రీల సమస్యలు, రాజకీయ దుస్థితి, విద్యా వ్యవస్థల మీద తన కథలలో ధ్వజమెత్తారు. సున్నితంగా, సూటిగానే కాకుండా, అవసరం మేర ఘాటుగా కూడా వీరి కథారచనలు ఉంటాయి. సమస్యను ఎత్తి చూపెట్టడమే కాదు, పరిష్కారం కూడా కథల్లో చూపించే కలం బలం సాంబశివరావు గారిది. ఏదో ఒక సందేశం ఆయన ప్రతి రచనలలో

కనబడుతుంది. "స్వాతంత్ర్య దీపం వెలుగుతోంది గుడ్డిగా, నిజాయితీ చమురు ఇంకిపోతోంది పూర్తిగా!". ఈ మాట చదివితే, మన దేశ భవిష్యత్తుని సాంబశివరావుగారు, ఆ రోజుల్లోనే ఎంత ఆవేదనతో నిర్వచించారో అర్థం అవుతుంది! సమకాలీన రచయితల గురించి అభిప్రాయం అడిగితే, సాంబశివరావు గారు "ఏ రచయితైనా సరే, తన అక్షర సృష్టి, ప్రజలను చైతన్యవంతం చేయగలగాలి" అనేవారు. సమాజంలో తన చుట్టూ ఉన్న మంచి చెడులకు స్పందించి, పదునైన భావంతో సులువుగా పామరులను సైతం ఆకట్టుకునేలా అక్షర సేద్యం చేసారు. ఆయన రచనలు చదువుతుంటే, ఎవరికైనా సరే, సమకాలీన సమాజం మీద అవగాహన ఇట్టే వస్తుంది. అభ్యుదయ ఆలోచనలు, సిద్ధాంతాలతో ఆయన 1960లో నవ్య సాహితీ సమితి, ఆంధ్ర విశ్వసాహితి అనే సంస్థలను స్థాపించి, సాహితీ కార్యక్రమాలతో పాటు, ఎందరో కొత్తవారికి రచనలు చేయడం మీద మక్కువ కలిగించి, వారికి మెలకువలు నేర్పించారు. 350 పైగా కథలు, ఐదు నవలలు, నాటికలు, వందల్లో పద్యాలు, కవితలు, గేయాలు రచించిన సాంబశివరావు గారు, ఆంగ్ల, కన్నడ, కొంకణి, ఒరియా, మరాఠీ, హిందీ, నేపాలీ భాషల కవితలను తెలుగులోకి అనువదించారు. అలా అనువాదకుడిగా కూడా ఆయనని కేంద్రప్రభుత్వం గుర్తించి ఉచితరీతిని సత్కరించింది. తెలుగు సంస్కృతి సాహిత్యాల పైన, మన దేశ చట్టాల పైన, నాట్యకళ పైన, సభలు సమావేశాల పైన అనేకమైన వ్యాసాలు వ్రాసారు.

వీరి కథలలో 'అంతర్భావాలు, మాతృమూర్తి, కాలిన ప్రేగు, గాలిబుడగలు, దారి తప్పిన ప్రేమ, పంజరంలో పక్షి' వంటి కథలు చాలా ప్రాచుర్యం పొందాయి. ఆ రోజుల్లో వెలువడే అన్ని ప్రత్యేక సంచికలలో సాంబశివరావుగారి కథ తప్పనిసరిగా ఉండేది. వీరి కలం నుండి జాలువారిన, 'హంతకులు, పల్లె కదిలింది, దొంగ దొర, ఇదీ తంతు, చుట్టాల రభస, అంత్యక్రియలు' వంటి నాటకాలు బహుళ ప్రజాదరణ పొంది బహుమతులు పొందాయి. ఆంధ్ర విశ్వవిద్యాలయం వారి "కళాప్రపూర్ణ" బిరుదుతో పాటు, మరెన్నో అవార్డులు, పురస్కారాలు, బిరుదులు పొందిన సాంబశివరావుగారిని తెలుగు సాహితీ ప్రపంచంలో ఓ ఆణిముత్యంగా వర్ణించేవారు. వీరి రచనలపై పలువురు పరిశోధనలు చేసి, పలు విశ్వవిద్యాలయాల నుంచి డాక్టరేట్ లు పొందారు.

1927 జనవరి 27 వ తేదిన తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు గ్రామంలో జన్మించిన డా. పోతుకూచి సాంబశివరావు గారు, ప్రాథమిక విద్య ఆలమూరు, కోటిపల్లి గ్రామాల్లో, హైస్కూలు విద్య రామచంద్రపురంలో, డిగ్రీ కాకినాడలో చేసిన తర్వాత, హైదరాబాదు వెళ్ళి అక్కడే చాలా కష్టపడి ఎల్.ఎల్‌బి. చేసారు. కొంతకాలం లేబర్ డిపార్ట్మెంట్‌లో పనిచేసి, తర్వాత హైకోర్టులో న్యాయవాదిగా పనిచేశారు. సాహిత్య రంగ ప్రవేశం చేసిన తొలి రోజుల్లో గిడుగు, చలం మొదలైన వారి సాహిత్య ప్రభావం వీరి రచనల మీద కొంత కనబడినా, తర్వాత కాలంలో తనదైన శైలిలో అజరామరంగా నిలిచిపోయే రచనలు అందిస్తూ, జీవిత ఆఖరి రోజున కూడా ఓ సాహితీ సభలో ప్రసంగించారు. బ్రహ్మచారిగానే జీవితం సాగించిన సాంబశివరావుగారు 2017, ఆగస్టు 6 వ తేదిన పరమపదించారు.

సాహిత్యాభివృద్ధికే జీవితాన్ని అంకితం చేసిన మహనీయులు, మానవతావాది డా. పోతుకూచి సాంబశివరావు గారిని పరిచయం చేయడానికి విలువైన సమాచారాన్ని అందించిన, వారి సమీప బంధువు డా. దేవులపల్లి పద్మజ గారికి ధన్యవాదాలు తెలియచేసుకుంటూ, సాంబశివరావు గారికి ఘనమైన నివాళులు అర్పించుకుంటున్నాం!

**కథామంజరి బృందం**

ఈ పారితోషికం అమూల్యం... ప్రారంభించిన అనతికాలంలోనే ఒక స్టాండర్డ్ యేర్పరచుకుని మంచి ఒరవడి సృష్టించుకున్నారు. మనం కోల్పోతున్న పుస్తకం, మళ్ళీ రూపుఁ దిద్దుకుంటుందా... "కథామంజరి" సెలలెక్టెడ్ వర్షన్.. ఓన్లీ ఫర్ మెంబర్స్ సర్క్యులేషన్.

ఏమైనా యీ యజ్ఞం.. పుత్రకామేష్టిలాంటిది. కథామంజరి అనే యజ్ఞపురుషుడు అందిస్తున్నాడు మంచి కథలు.. అవే పదివేలు.

సంపాదక వర్గానికి శుభాకాంక్షలు...

**వల్లూరి విజయకుమార్**
*8885511950*


---

కథామంజరి చాలా చక్కగా. విలక్షణంగా నడుపుతున్నందులకు ముందుగా మొత్తం బృందానికి అభినందనలు. కథామంజరి అంతర్జాల పత్రికే అయినా, సాహిత్య మొగ్గు ఉన్న పత్రిక. అంతేకాక, దానితో పాటుగా శ్రావ్యసంచిక తేవటం సామాన్య శ్రమ కాదు. ఇలా పత్రికతో పాటు, శ్రావ్యసంచిక తేవటం అతి నవ్య ప్రయత్నం.

రచయితలను ఆదరిస్తూ, క్రమశిక్షణతో పారితోషికం అందించటం గొప్ప విశేషం. చిన్న పత్రికలలో పెద్ద మనసు తీసుకున్న పత్రిక మీది.

**వి. రాజారామమోహన రావు**
*9394738805*

---




## అయ్యకోనేరు గట్టు కథలు

శ్రీ జయంతి ప్రకాశ శర్మ వ్రాసిన స్వచ్ఛమైన తెలుగు లోగిళ్ళ కథలు. జూన్ 2020లో ప్రథమ ముద్రణ. ఇప్పుడు ఏప్రిల్ 2024 లో మూడో ముద్రణ కూడా వెలువడింది. వెల రు.150/-

ప్రతులకు

అచ్చంగా తెలుగు,
శ్రీమతి భావరాజు పద్మిని
✆ 8558899478

శ్రీ జయంతి ప్రకాశ శర్మ
✆ 9848629151

## ఆల్పనా


అర్ధశతాబ్దం కిందట భారతి వంటి పత్రికలలో ప్రచురింపబడిన శ్రీ వాడపల్లి లక్ష్మీనారాయణాచార్యులు గారి కథలు, వ్యాసాలను రచయిత కుమారుడు శ్రీ వాడపల్లి శ్రీనాథ్ భద్రపరిచి నేటి తరానికి అందించిన ఈ సంకలనము వెల రు.250/-

ప్రతులకు

అమెరికాలో నున్నవారికి
*vangurifoundation@gmail.com*

ఇండియాలోని వారికి
శ్రీ వంశీ రామరాజు, ✆ 9849023852,
JV పబ్లికేషన్స్, ✆ 8096310140,
అచ్చంగా తెలుగు, ✆ 8558899478







## లౌక్యం

వేరు వేరు ఇతివృత్తాలతో ఉన్నా, నేటి కాలం, విలువలు, ధ్వంసం అవుతున్న మూలాలు, మారుతున్న నిర్వచనాలని సూటిగా చెప్పే డా. లక్ష్మీ రాఘవ 26 కథల సమాహారం ఫిబ్రవరి 2024 లో విడుదలైన ఈ పుస్తకం వెల రు.100/–

ప్రతులకు

డా. లక్ష్మీ రాఘవ
✆ 9440124700

జ్యోతి వల్లబోజు
✆ 8096310140




## నాన్నారం కథలు

చిన్నపిల్లలని అబ్బురపరిచి, వారి మానసిక పరిపక్వతకు దోహదపడి, వారిలో ఉన్న సృజనాత్మకతను తట్టిలేపే కథలు. పిల్లల కథలలో ఆరితేరిన శ్రీ ఆర్. సి. కృష్ణ స్వామి రాజు కలం నుండి జాలువారిన ఈ కథల సంపుటి వెల రు.140/–

ప్రతులకు

ఆర్. సి. కృష్ణ స్వామి రాజు
✆ 9393662821



# మబ్బులో ఏముంది...!?

**భమిడిపాటి గౌరీశంకర్**
✆ 9492858395

> ***"మా అయ్య లక్షలు ఖర్చు చేసి ఓ ఆఫీసరని చెప్పుకునే దొంగను తెచ్చి నాకు పెళ్ళి చేశారు. వాడు నాకో బిడ్డనిచ్చి, ఎక్కడికో పోయాడు. అప్పులకు ఆస్తి కరిగిపోయింది. నాన్న ప్రాణం పోయింది." ఆమె కళ్ళలో నీరు తుడుచుకుంది. "నేను అనాథగా మిగిలాను. ఎన్నెన్నో పనులు చేశాను బాబు కోసం! వాడిని అనాథను చేయదలుచుకోలేదు. నేను ఒళ్ళు దాచుకోకుండా పనిచేశాను... ఒళ్ళమ్ముకుని మాత్రం కాదు!"***

"అవమానం, ఆకలి, వేదన, నిస్సహాయత, దుఃఖం పతనానికి ఇవన్నీ సోపానాలు. దిగితే క్రిందకు వెళతాం! ఎక్కితే పైకి వెళతాం... చిత్రం ఏమిటంటే దిగేవాళ్లే ఎక్కువవుతున్నారు..." అన్నాను నేను మిత్రుడు విశ్వనాథంతో...

"ఎవరి గురించి నీవు చెప్పేది... నీవు గవర్నమెంట్ కాలేజీ లెక్చరర్‌వి! తాత, తండ్రులు సంపాదించిన ఆస్తి ఉంది. మా చెల్లి కూడా ఎం.ఎస్సీ, బీఈడీ చేసింది. టీచర్ ఉద్యోగం వచ్చినా కుటుంబం కోసం కాదనుకుంది... ఒక్కర్తే కూతురు... పెళ్లి చేసేసావు... ఎక్కడో అమెరికాలో ఉంది... కనుక పైకి, దిగువకు అనేది నీకు తెలియదు... జాలి తప్ప!" అన్నాడు విశ్వనాథం నవ్వుతూ.

"నీకేమైంది... నీది కూడా నాలాంటి జీవితమే కదా! మన మధ్య స్నేహానికి నాలుగు దశాబ్దాల కాలముంది... అమ్మ పుట్టిల్లు మేనమామకు తెలియదా!" అన్నాను.

ఈరోజు మా కాలేజీలో అకడమిక్ ఆడిట్ ఉంది... తొందరగా వెళ్ళాలి! అన్నీ సర్దుకునే ఉన్నాను.. ఈలోగా ఇదిగో మిత్రుడు విశ్వనాథం వాడి మనవరాలు గురించి మాట్లాడడానికి వచ్చాడు. వాచీ చూసుకున్నాను... ఉదయం ఎనిమిదయింది... ఫర్వాలేదు... మరో గంటన్నర సమయముంది.

"ఇంతకీ... ఈ అవమానం, ఆకలి డైలాగ్ ఎవరి కోసం నాయనా... మీ కాలేజీలో మధుమిత కోసమేనా? మగాడు ప్రక్కన లేకపోతే, పూట గడవదట కదా!" అన్నాడు విశ్వనాథం... 'ప్రక్క' అనే పదం మీద ఒత్తి పలుకుతూ.

"ఆమెది కాంట్రాక్ట్ పోస్ట్, షోకులెక్కువ... ఆదాయం తక్కువ! భర్త చనిపోయాడు. చంపేసిందనే అనుకుంటారు. ఒక్కగానొక్క కొడుకు డిగ్రీ చదువుతున్నాడు. కులమేమిటో నాకు తెలియదులే, తెల్లగా ఉంటుంది! ఇంకా..." ఇంతలో మా ఆవిడ క్యారేజ్‌తో వచ్చింది.

బయలుదేరదామనుకున్నాము... ఇద్దరం...

ఒక పాపను ఎత్తుకొని, ఓ మధ్యవయసు స్త్రీ "శంకరం మాష్టారిల్లు ఇదేనా?" అని అడుగుతున్నది గుమ్మంలో నుంచి.

"ఇదేనమ్మా... నేనే ఆ శంకరం మాష్టారిని! నువ్వెవరమ్మా... దామ్మా లోపలికి వచ్చి చెప్పు ఏం కావాలో.." మళ్లీ ఇద్దరం కూర్చున్నాం. సమయం తొమ్మిది కావస్తున్నది.

"నీవు... రామనాథం మేస్త్రి దగ్గర పనిచేసేదానవు కదా!" అన్నాడు విశ్వనాథం. అతని మాటల్లో నీ గురించి 'నాకు తెలుసులే' అనే సూచనుంది. ఆమె మౌనంగా నిలుచుంది. చంకలో రెండేళ్ళ బాబు! ఆమె వయసు నాలుగు పదులు దాటి ఉండవచ్చు. చామనఛాయ, చర్మ సంరక్షణ లేక శరీరం శుష్కించి ఉన్నా, కళ్ళల్లో కాంతి ఉంది. ముఖం కళగా ఉంది. నిద్రలేమి, భయం వలన కళ్ళ కింద నల్లని చారలు... జీవితానుభవ పాఠాల సారాంశాన్ని చెబుతున్న నుదుటి మీద గీతలు... వెలిసిన వాయిల్ చీర... లోతుకుపోయిన బుగ్గలు... చంకలో బాబుతో... కళ్ళలో భయంతో... ఆమె అలా నిలుచుండిపోయింది!



ఇంతలో... నా భార్య వస్తూ... "ఏమండీ... ఆ పనిమనిషికి ఫోన్ చేయండి. రెండు రోజులుగా రాలేదు. పండగ వస్తున్నది... పాప అల్లుడు రావచ్చు. చేయవలసిన పనులు చాలా ఉన్నాయి!" అని వచ్చి, ఆమెను చూసి ఆగి... 'ఎవరీమె?' అన్నట్టుగా చూసింది!

నేనేమీ చెప్పలేదు. నాకు తెలియదుగా! వాచి చూసుకున్నాను... సమయం తొమ్మిదింపావు. అమ్మో!

"ఆమె ఎవరో తెలియదు... నాకోసం వచ్చిందట... కాస్త కనుక్కో!" అని చెప్పి ఆమె వైపు తిరిగి "అమ్మా... ఈమె నా ఇంటి హోమ్ మినిస్టర్! నా గురించి ఏమైనా నీకు కావాలంటే ఆమెను అడుగు... నాకు కాలేజీలో పని ఉంది... పదరా..." అని ఇద్దరం బయటకు బయలుదేరాం.

ఇతరుల నుంచి తమకు కావాల్సింది అధికారంతో, ఆత్మవిశ్వాసంతో తీసుకోగలిగిన వారే... అంత నిస్వార్థంతో అంతే సంతోషంతో ఇతరులకివ్వగలరు. ఇందుకు నా భార్య మినహాయింపు కాదు!

★★★

సాయంత్రం ఆరైంది... మా కాలేజీలో ఆడిట్ ముగిసింది! ఇది ప్రతి సంవత్సరం రొటీన్‌గా జరిగే తంతే! నా ముందు ఆటో ఆగింది. నేను, విశ్వనాథం ఎక్కాం, ఆటో డ్రైవర్ చక్రవర్తి నాకు బాగా తెలుసు. అతని తండ్రి ఇదే ఆటోలో మా పాపను బడి

దశ నుండి కాలేజీ దశ వరకు తీసుకువెళ్లాడు. ఆక్సిడెంట్ లో చనిపోయాడు. ఇద్దరు కొడుకుల్లో ఒకడికి బ్యాంకు జాబ్ వచ్చి, ప్రేమించిన అమ్మాయిని పెళ్లి చేసుకుని, రెండు గదుల ఇంట్లో ఉండలేక తన దారి తాను చూసుకున్నాడు!

“పిల్లల్ని ప్రేమించే ప్రయత్నం తప్పు కాదు... వారు తిరిగి ఆ ప్రేమను ఇవ్వాలనే నిబంధన మహాపాపం!” అనే ఖలీల్ జిబ్రాన్ మాటలు ఎంతవరకు నిజమో తెలుసుకునే తండ్రి లేడు... తల్లికి చదువు లేదు... ఉన్న ఒక తమ్ముడు తల్లిని ఎలా బ్రతికిస్తాడు అనే ప్రేమ ఆ పెద్ద కొడుకుకు రాలేదు! ఇంజనీరింగ్ చదువుకున్న చక్రవర్తి, నాకోసం ఆటో డ్రైవరయాడు. నన్ను ఉదయం కాలేజీలో దింపేసి, తను అదే ఆటో వేసుకొని సాయంత్రం వరకు సర్వీస్ చేసుకొని, నాకోసం మళ్ళీ వస్తాడు. అతనికి మూడు పదులు దాటాయి... తోడు అవసరం! కానీ ఎవరు పిల్లనిస్తారు? వ్యసనాలు లేవు, ఆటోకి డబ్బులు నేనే ఇచ్చాను. అప్పు తీర్చేసాడు. సొంత ఆటో యజమాని, కానీ ఎవరికి కావాలి ఇవన్నీ! ఇప్పటి ఆడపిల్లలకు ‘ఏం కావాలో’ వారికే తెలియదు.

మేమిద్దరం మౌనంగా ఉన్నాము... ఆమె ఎవరు? నాకోసం ఎందుకు వచ్చింది. ఇంటికి వెళ్తే అన్ని విషయాలు తెలుస్తాయి. నన్ను ఇంటి దగ్గర దింపేసి, విశ్వనాథాన్ని తీసుకుని చక్రవర్తి ఆటో వెళ్ళిపోయింది. నేను ఇంట్లోకి వెళ్లాను.

నన్ను చూడగానే... ఉదయం నా కోసం వచ్చినామె ప్రక్కకు వెళ్ళిపోయింది. మా ఆవిడ తనకున్న పాతచీరల్లో ఒకటిచ్చినట్టుంది. చీరలో ఆమె కడిగిన ముత్యంలా ఉంది. నేను నా గదిలోకి వెళ్ళిపోయాను.

అరగంట తర్వాత, నా భార్య టీ గ్లాస్‌తో వచ్చింది.

“ఇంతకీ ఎవరామె... ఎందుకొచ్చింది?” అడిగాను టీ తాగుతూ! వేసవి, సాయంత్రం ఆరున్నర కావస్తున్నది.

నా భార్య చాలా రిలాక్స్డ్‌గా ఉంది... “పనులన్నీ తనకి అప్పగించేసాను. మరి పనిమనిషి అవసరం లేదు. తను ఇక్కడే ఉంటుంది!”

గదిలో ఏ.సీ... చల్లగా ఉంది... ఆమె హృదయం కూడా! కానీ నా భార్య అంత అమాయకురాలు అయితే కాదని నాకు తెలుసు. బహుశా వచ్చినామె గురించి పూర్తిగా ఎంక్వయిరీ చేసి ఉంటుంది. “ఇంతకీ ఏమిటామె కథ?” అన్నాను ఆసక్తితో!

ఆమె మెల్లగా చెప్పడం ప్రారంభించింది...

★★★

“ఏమే... రాజి... నా దగ్గర జాయినయ్యి రెండు నెలలు కావస్తున్నది. ప్రతిరోజూ నీకు పనిస్తున్నాను. ఎందుకో తెలుసా... నీ బాబుని చూసి... నీ లేచిపోయిన మొగుడిని చూసి కాదు. నిన్ను చూసి!” ఆమెను ఎగాదిగా చూస్తూ అన్నాడు పెద్ద మేస్త్రి రామనాథం.

“అది కాదు బాబూ! నువ్వు దేవుడివే, నేను కాదనను. అయినా నీ దగ్గరకు, ఎందరో వస్తున్నారు... నేను చూస్తున్నాను. నేను కూడా ఎందుకని! కొద్దికాలం ఓపికపట్టయ్యా... ఈ పని కాక... నీ దగ్గరకు రాక ఎక్కడికి పోతాను?” రాజేశ్వరి మాటలు ఆమె గుండెలో మంటలు. కళ్ళలో ఇంకిన కన్నీళ్లు దూరంగా... ఉయ్యాల్లో బాబు... భవిష్యత్తు లేని ప్రశ్నార్థకమైన జీవితం... ఎలా... ఏం చేయాలి! ఈ మేస్త్రీకి పెళ్ళాం పిల్లలు ఉన్నారు. ‘అందరూ కావాలి...’ నాతో కూడా, ఏదో పని మిషతో నా దగ్గరకు వచ్చి, శరీరాన్ని తాకుతూ, అప్పుడప్పుడు భోజనం ప్యాకెట్స్, బాబుకు పాల ప్యాకెట్స్ కొంటాడు. వాటి అర్థం తనకు తెలుసు!

ఒకరోజు రాత్రి... మేస్త్రి బాగా తాగి ఆమె ఉంటున్న పూరింట్లోకి వచ్చేసాడు...

ఆమె బాబుతో బయటకు వచ్చేసింది. కానీ ఆ రాత్రివేళ, ఎంతమంది... ఆ తరహా 'మేస్త్రీ'ల నుంచి తనను తానుగా కాపాడుకొందో!?

నా భార్య చెప్పటం ఆపింది. మా మధ్య క్షణం... మౌనం...

'మనసు ఆర్ద్రమైనప్పుడు మౌనమే మాట్లాడుతుందని' ఎక్కడో చదివిన వాక్యం గుర్తుకు వచ్చింది.

"అవును... మనమెంత కాలం... ఆమెను... " అన్నాను.

"మనకో పనిమనిషి కావాలి. ఆమెకు తాత్కాలిక ఆసరా కావాలి. రానున్నది పండుగ... పిల్లలు వస్తారు! నాకు తోడు కావాలి! రాజేశ్వరి చక్కగా అల్లుకుపోతున్నది. పిల్లాడు కూడా మంచివాడే, అల్లరి చేయకుండా ఆడుకుంటున్నాడు. ప్రస్తుతం అవనియ్యండి... తర్వాత చూద్దాం!" అంది. ఆమెకు రాజేశ్వరి నచ్చినట్టుంది.

"ఇంతకీ ఆమె ఎక్కడ ఉంటుంది?" అన్నాను ప్రశ్నార్థకంగా.

"పాప గదిలో... క్రింద పడుకుంటానని చెప్పింది. పాప వస్తే... మెయిన్ హాల్లో పడుకుంటానంది. తనను పంపవద్దని ఏడ్చింది!" చెబుతున్న నా భార్య గొంతు ఆర్ద్రమవటం నేను గుర్తించాను.

"సరే... నీ ఇష్టం! అదేదో నువ్వే చూసుకో! ఓకేనా... " అన్నాను.

"గుడ్ బోయ్..." అని లేచి, టీ గ్లాస్ తీసుకుని, నా బుగ్గ మీద ముద్దు పెట్టి, నవ్వుతూ వెళ్ళింది. అంటే ఆమె చెప్పలేని ఆనందంలో ఉందన్నమాట!

పండగ వెళ్లిపోయింది. పాప కూడా రాజేశ్వరితోను, బాబుతోను తిరగటం, అక్క అక్క అని మా పాప ఆమెను పిలవడం నాకర్థమయ్యాయి. నాతోనూ... ఎంతవరకో అంతవరకే ఉంటున్నది. బాబు మెల్లగా నడుస్తున్నాడు. పాప, అల్లుడు వెళ్లిపోయే ముందు ఆమె చేతిలో చీర, జాకెట్టు, కొంత డబ్బు పెట్టారు. వారి మధ్య స్నేహం నాకు అర్థమైంది.

రాజేశ్వరి... మునుపటికన్నా బాగా తయారయింది. గౌరవంగా ఉంటుంది. నా భార్య ఆమెకు కొన్ని మేనర్స్ నేర్పింది. ఆరు నెలలు సజావుగా గడిచాయి. ఓ రోజు బయలుదేరుతుంటే నా భార్య నా దగ్గరకు వచ్చింది...

"ఆమె, ఈరోజు వరకు నయాపైసా తీసుకోలేదు. పాప, అల్లుడు ఇచ్చిన డబ్బులు కూడా నా దగ్గరే ఉంచేసింది. అడిగితే 'అన్నీ మీరే ఇస్తున్నారు. నాకెందుకు డబ్బులు?' అంటుంది. ఆమె మనసులో ఏముందో అడగండి!" అంది.

"సరే... రేపు ఆదివారం... ఇంటి దగ్గరే ఉంటాను కదా... అడుగుదాం!" అని బయలుదేరాను.

ఆరోజు క్యాంటీన్లో విశ్వనాథం, మధుమిత నా దగ్గరకు వచ్చారు.

"మాస్టారు... ఎవరో ఒకామె ఆరు నెలలుగా, మీ ఇంట్లోనే ఉంటుందట. ఏమిటో... ఎందుకో... ?" అంది వ్యంగ్యంగా మధుమిత.

స్త్రీలు ద్రవపదార్థంలా ఏ పాత్రలో పోస్తే ఆ ఆకారం ధరించడం వింతేమీ కాదు. మధుమిత అటువంటిదే! ఆమె కథలు నాకు తెలియనివి కాదు.

“రేపు ఆదివారం మీ ఇద్దరూ మా ఇంటికి రండి, మా ఆవిడ కూడా ఉంటుంది. ఆమె చెబుతుంది .. ఏమిటో, ఎందుకో!” అన్నాను, ఆమె అన్న ధోరణిలోనే. మధుమిత విసవిసా వెళ్ళిపోయింది.

నేను విశ్వనాథంతో టీ తాగుతూ… “మధుమిత ఎటువంటిదో నీకు తెలుసు. పిల్లాడ్ని హాస్టల్లో పడేసి, ఇక్కడెవరో కలెక్టరేట్లో పని చేస్తున్నవాడితో తిరుగుతున్నదని అందరికీ తెలుసు! నువ్వు కూడా ఆమెతో కలిసి తిరిగితే, ఎలా? నీకో విషయం చెప్పనా… మన స్త్రీల మీద మనకి ఎంతో చిన్నచూపు. మధుమిత గురించి మనం ఇలా మాట్లాడుకోవడం కూడా తప్పే! రేపు ఆదివారం ఆమెను తీసుకువచ్చే బాధ్యత నీదే సుమా! తనకి చెబుతాను మీరిద్దరూ వస్తారని!” అన్నాను.

ఇద్దరం లేచాం! నాలుగడుగులు వేశాక… “బహుశా ఆమె రాకపోవచ్చు…” అన్నాడు విశ్వనాథం, సాలోచనగా నా వైపు చూస్తూ!

“అవునా… సరే… “ అన్నాను ముక్తసరిగా!

★★★

ఆ రాత్రి పదిగంటల సమయంలో

“ఈ మధ్య అన్ని పనులు… అంటే బజారు పనులు కూడా రాజేశ్వరి మీదనే పడేస్తున్నావు. ఒళ్ళు పెరిగి, వంద కేజీలు అయిపోగలవు చూడు!” అన్నాను నా భార్యతో సరదాగా.

“ఆ ఇబ్బంది లేదులెండి! ‘అమ్మా… నేను వచ్చి దాదాపు ఆరేడు నెలలు కావస్తున్నది. ఇంకెన్నాళ్లు మీ ఇంట్లో! అయినా… నాకు మీరు దేవుళ్ళు. మిమ్మల్ని వదులుకోను… వదలను! కానీ ఇలా… మీ ఇంట్లో ఉండటం వలన… పదిమంది, పది రకాలుగా… ముఖ్యంగా బాబుగారి గురించి… నాకు ఏడుపు వస్తున్నది’ అని ఏడ్చింది ఏం చెప్పమంటారు?” అంది నెమ్మదిగా.

“అవును! మా కాలేజీలో విశ్వనాథం, మధుమిత అని ఓ లెక్చరర్… క్యాంటీన్లో ఇదే ప్రశ్న వేశారు!” అన్నాను.

“ఏంటి విశ్వనాథం అన్నయ్య అలాగన్నాడా?” అంది ఆశ్చర్యంగా.

“అతడనలేదు. ధైర్యం కోసం… అతనిని మధుమిత వెంట తెచ్చుకుంది. ఆమె అన్నది! అతడు విని ఊ… రు… కు… న్నా… డు!”

ఆమె ఏదో అడగబోయింది. “వదిలేయ్! ఎవరినీ తప్పు పట్టవద్దు. ఆమె కూడా అడుగుతున్నది కదా… చూద్దాం! కాలం చాలావాటికి సమాధానాలు ఇస్తుంది. రిలాక్స్… లైటార్పి పడుకో!” అన్నాను.

కాలం నాకో చక్కని పరిష్కారం రేపటి ఆదివారం నాడు సూచిస్తుందని నేనూహించలేదు…

★★★

ఆదివారం ఉదయం పదిగంటల సమయం...

ఆకాశం మబ్బులు పట్టి ఉంది. బహుశా వాన రావచ్చు! వేసవిలో వర్షం... నేను కిటికీ తలుపులన్నీ తీసేసాను... కమ్మని మట్టి వాసనతో కూడిన పరిమళం... బాగుంది!

విశ్వనాథం, నేను, నా భార్య సోఫాలలో కూర్చున్నాం!

"అన్నయ్యా... మీ స్నేహితుడి గురించి మీకు తెలియదా... చెప్పండి!" అంది.

"తెలుసమ్మా. కానీ, నీ గురించి కూడా బయట అనుకుంటున్నారు. మన సంగతి మనకు తెలుసు. ఆమె సంగతి కూడా... " అని ఆగిపోయాడు.

రాజేశ్వరి మా ముగ్గురికి కాఫీలు తెచ్చింది. ఇంతలో 'అధ్యయనం చేయాలంటే మనిషి జీవితం కన్నా గొప్ప వేదం లేదు!' ఇది కూడా నా భావన కాదు.

రాజేశ్వరిని ఆగమన్నాను. ఎదురు సోఫాలో కూర్చోమన్నాను. ఆమె నిలబడే ఉంది. కాస్త దూరంలో ఉయ్యాలలో బాబు నిద్రపోతున్నాడు. బయట మబ్బులు పెరుగుతున్నాయి. దూరంగా మెరుపులు... దట్టమైన నల్లని మబ్బులు... నగరం పైన మబ్బులు... వర్షిస్తాయా... ఏమో... !!

ఆమె నిలబడే ఉంది.

మా ఆవిడ అనునయంగా... "రాజేశ్వరీ... నీవు మా ఇంట్లో మనిషివే! ఏనాడు నిన్ను పనిమనిషిలా చూడలేదు. ఫర్వాలేదు కూర్చో!" అంది.

నా భార్య మాటలు విన్నా సరే, ఆమె నిలబడే ఉంది.

"సరే... నీ గురించి చెప్పగలవా... ఇబ్బంది లేకుంటే సుమా!" నా భార్య మరో ప్రశ్న.

"ఏముందమ్మా చెప్పడానికి... మాది కాకినాడ దగ్గర సర్పవరం. మా నాన్న వ్యవసాయదారుడు. అక్కడ ఐదు ఎకరాల పొలం ఉంది. మేము ఇద్దరం ఆడపిల్లలమే. నేను పదవ తరగతి తప్పాను. నాకు చదువు మీద కంటే వ్యవసాయమంటేనే ఇష్టం. కానీ అక్క బాగా చదువుకుంది. ఎక్కడో టీచరుగా ఉందని విన్నాను. కాకినాడలో చదువుకుంటున్నప్పుడే మంచి డబ్బున్నవాడిని చూసి ప్రేమించి పెళ్లి చేసుకుంది... " ఆమె మాటల్లో ఇది అని చెప్పలేని బాధ ఉన్నా పిసరంత 'హేళన' కూడా ఉంది.

ఇంతలో ఉయ్యాల కదిలింది. బాబు లేస్తాడేమోనని ఊపి వచ్చింది. నిశ్శబ్దం! బయట జోరుగా వాన పడుతున్న శబ్దం... ఇంకా మబ్బులు వీడలేదు. ఆమె తిరిగి "మా అయ్య లక్షలు ఖర్చు చేసి, ఓ ఆఫీసరని చెప్పుకునే దొంగను తెచ్చి నాకు పెళ్ళి చేశాడు. వాడు నాకో బిడ్డనిచ్చి, ఎక్కడికో పోయాడు. అప్పులకు ఆస్తి కరిగిపోయింది. నాన్న ప్రాణం పోయింది." ఆమె కళ్ళలో నీరు తుడుచుకుంది. "నేను అనాథగా మిగిలాను. ఎన్నెన్నో పనులు చేశాను బాబు కోసం! వాడిని అనాథను చేయదలుచుకోలేదు. నేను ఒళ్ళు దాచుకోకుండా పనిచేశాను... ఒళ్ళమ్ముకొని మాత్రం కాదు!" ఆమె మాట్లాడలేక, క్రింద కూర్చుండిపోయింది...

గబగబా నా భార్య వెళ్ళి భుజం పైన చేయి వేసి... "వద్దులే మరి చెప్పకు..." అని ఓదార్చింది.

"లేదమ్మా... మీ ఇంట్లో నాకు లభించిన ధైర్యం, ఆదరణ... నేనేనాడూ నా ఇంట్లో కూడా చూడలేదు!" అని చెబుతుండగా చక్రవర్తి వచ్చాడు. ఈ మధ్యనే అతనికున్న ఒక్క తల్లి చనిపోయింది. నేను విశ్వనాథం సహాయం చేసాం. ఆటో మీద వచ్చే డబ్బుతో నెలవారీ వద్దన్నా సరే...

చక్రవర్తి రాగానే రాజేశ్వరిలో మార్పు!

చక్రవర్తి మెల్లగా... "అయ్యా మీ దగ్గర ఏమీ దాచకూడదు. నేను, రాజేశ్వరి... " అని ఆగాడు.

మా అందరికీ అర్థమైంది. రాజేశ్వరి బయటకు వెళ్ళినప్పుడు... ఆమె, చక్రవర్తి...

ఇక నేను, నా భార్య 'ఆమె' కోసం ఇబ్బంది పడనవసరం లేదు. చక్రవర్తి, రాజేశ్వరి... మా దగ్గరే ఉంటారు. వారింట్లో వారు ఉంటారు. బయట వర్షం ఆగింది... మబ్బుల్లో ఏముందో... తెలిసింది.

నా దినచర్యలో మార్పు లేదు!

చక్రవర్తి, రాజేశ్వరిల వయసులో తేడా ఉంది కానీ, వారి జీవితాల్లో లేదు... కనుకనే కొత్త జీవితం ప్రారంభించారు!

చీకట్లో ఉన్నామని దిగులు పడుతూ కూర్చుంటే, జీవితం చివరి వరకు అగ్గిపెట్టె గూట్లోనే ఉండిపోతుంది. అఫ్‌కోర్స్ ఇది కూడా నాది కాదండోయ్...

ఒకరోజు విశ్వనాథం... క్యాంటీన్లో టీ తాగుతున్న నా దగ్గరకు వచ్చి... "నీకు తన అక్క ఎవరో రాజేశ్వరి చెప్పిందా?" అని మెల్లగా అడిగాడు.

"లేదు... ఎవరుట?" అన్నాను.

దూరంగా... మధుమిత... రావటం చూసి విశ్వనాథం ఆ.. గి.. పో.. యా.. డు.. !

# రేపటి తీర్పు

## పి. రాజేంద్రప్రసాద్
✆ 9492525607

> ***భార్యాభర్తలలో ఒకరు బాధింపబడి విడాకులు మంజూరైన సందర్భంలో రెండవ వ్యక్తి, ముఖ్యంగా మగవారు ఇంకొక వివాహం చేసుకోవడానికి అనర్హుడిగా ప్రకటించబడాలి. అంటే ప్రతి మగవాడికీ ప్రభుత్వ క్లియరెన్స్ ఉంటేనే వివాహం అయ్యేటట్టుగా చట్టం తీసుకు రావడానికి కృషి చెయ్యమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఈ కోర్టు ఆదేశిస్తున్నది.***

కోర్టు హాలు కిక్కిరిసిపోయి ఉన్నది. మామూలు జనమూ, పత్రికా విలేఖరులూ మాత్రమే కాక మీడియా వారు కూడా ఒక ప్రత్యేక కేసు సందర్భంగా కోర్టు హాలు లోపలికి అనుమతించబడ్డారు. సుదీర్ఘ వాదోపవాదాలూ, సాక్షుల విచారణా తర్వాత ఈ రోజు తుదితీర్పు ఇవ్వబడుతోంది. తీర్పుదశ కొచ్చిన ఆ కేసు ఆద్యంతమూ ఎంత ఆసక్తికరంగా ఉందో తెలుసుకోవాలంటే... ఈ రోజు పూర్తిగా నిండిన కోర్టు హాలే సాక్ష్యం!

సమయం ఉదయం పది గంటలు అవ్వడానికి ఒక్క నిమిషమే బాకీ ఉన్నది. హడావుడిగా గందరగోళంగా ఉన్న కోర్టు హాలు, ఠంగ్ ఠంగ్ మంటూ దవాలీ బంట్రోతు గంటను మోగించగానే మొత్తం నిశ్శబ్దమైపోయింది. జడ్జీగారు ప్రవేశించగా, హాలులో ఉన్నవాళ్ళంతా లేచి నిలబడ్డారు.

అందర్నీ కూర్చోమని సైగ చేసి కుర్చీలో కూర్చున్న జడ్జిగారికి, కోర్టు గుమస్తా ఆ రోజు జరగవలసిన కేసు పేపర్లు అందించారు. మొదటి కేసు నంబర్ చదివిన తరువాత వాది, ప్రతివాదులిద్దరినీ లోపలికి పిలవడం జరిగింది. జడ్జీగారు గొంతు సవరించుకొని, ఎదురుగా నిలబడ్డ ఇద్దరినీ చూసి మొదలు పెట్టారు.

"అనుదీప్తీ, ప్రఫుల్లకుమార్! ఈ కోర్టులో మీ ఇద్దరి మధ్యా నడిచిన కేసు వాదనలు ఇంతకు పూర్వమే ముగిశాయి. ఈ విషయాన్ని మీకిద్దరకూ తెలియచేస్తూ, ఈ రోజున తీర్పు వెలువరిస్తామని పదిహేనురోజుల క్రితమే తెలియచేయబడింది. మీకు ఏ విధమైన అభ్యంతరాలున్నా తెలియచేయమని మీకిచ్చిన గడువును మీరు ఉపయోగించుకోలేదు. అయినప్పటికీ మీరు ఈ కేసు విషయమై చివరిసారిగా ఏమైనా చెప్పదలచుకుంటే చెప్పవచ్చును" ఆయన చెప్పదలచుకున్నది చెప్పి, ఇరువురివైపూ సాభిప్రాయంగా చూశారు.

వాళ్లిద్దరూ ఏమీ లేదన్నట్టు తలలూపగానే జడ్జి గారు ఒక్క నిమిషం తలపంకించి, ఆయన ఇవ్వబోయే తుదితీర్పు తాలూకు పేపర్లు బయటికి తీశారు. కుర్చీలో కూర్చున్న జడ్జిగారూ, ఆయన ఎదురుగా నిలబడ్డ భార్యాభర్తలైన అనుదీప్తీ, ప్రఫుల్లకుమార్‌లు తప్ప, హాలులో ఉన్న లాయర్లూ, పత్రికా ప్రతినిధులూ, మీడియా వారూ విపరీతమైన టెన్షన్ తో ఉన్నారు.

జడ్జీగారు తీర్పు చదవడం మొదలు పెట్టారు. ఎవరూ చెప్పకుండానే, హెచ్చరించకుండానే హాలు మొత్తం సూదిమొన మోపితే వినిపించేంత నిశ్శబ్దంగా తయారైంది.

నిశ్శబ్దంగా ఉన్న కోర్టు హాలులో జడ్జీగారి గొంతు ఖంగున మోగింది. కోర్టు హాలులో చివరి వరుసలో కూర్చున్న వ్యక్తికి కూడా అంతా వినిపిస్తోంది. “అనుదీప్తీ, ప్రఫుల్ల కుమార్ అనే భార్యాభర్తలు వాది, ప్రతివాదులుగా ఉన్న ఈ కేసులో వాది అయిన శ్రీమతి అనుదీప్తి, ప్రతివాది అయిన తన భర్త ప్రఫుల్లకుమార్ మీద కొన్ని ఆరోపణలు చేసి, వాటికి సరియైన సాక్ష్యాధారాలు సమర్పించడంలో సఫలీకృతురాలైంది. చిత్రమేమిటంటే ప్రతివాది ఆ ఆరోపణలు ఖండించకపోగా, వాటిని తప్పులు కావని కొట్టిపడవేసి ఉన్నారు. ఈ సందర్భంలో ఒక్కటొక్కటిగా వాది శ్రీమతి అనుదీప్తి చేసిన ఆరోపణలూ, వాటి మీద కోర్టు అభిప్రాయమూ వివరించిన తరువాత, తుదితీర్పుకి వెళ్లాలని ఈ కోర్టు భావిస్తున్నది. చట్టము, న్యాయము అనే రెండు పదాలు, విడి విడి అర్థాలు కలవిగా అందరికీ తెలుసు. ఈ చట్టబద్ధమైన సంస్థకు ప్రస్తుత అధిపతిగా నేను దీనిని ‘న్యాయ స్థానం’ అనలేక పదే పదే ‘కోర్టు’ అనడం జరిగింది. అది ఎందువల్లనో మీకు, ఈ తీర్పు చివరలో తెలుస్తుంది.



ఇక కేసు విషయం... వాది శ్రీమతి అనుదీప్తి చేసిన మొదటి ఆరోపణ... తనను తన పుట్టింటికి వెళ్ళడానికి భర్త నిరాకరిస్తున్నారని! ఈ విషయంలో ఎవరిది తప్పు అనే సమస్యే లేదు. పెళ్ళైన ఆడవారికి పుట్టిల్లు, మెట్టినిల్లు రెండూ ఉంటాయి. మగవారికి ఈ సున్నితమైన విషయం తొందరగా అర్థం కాదు. పెళ్ళైన ఆడవారు తమ బాధ్యతలను మరచిపోకుండా బాలన్సు చేసుకుంటూ అపుడపుడూ పుట్టింటికి వెళ్ళి రావటం కాని, భార్యాభర్తలిద్దరూ ప్లాన్ చేసుకోవడం కాని, తన తల్లిదండ్రులను చూడడానికి ఆహ్వానించడం గాని అందరికీ ఆమోదయోగ్యమైన పద్ధతిలో చెయ్యాలి. ఇందులో ఒకరికే అధికారం ఉన్నదని భావించరాదు. అలా అని కోర్టు ఈ విషయంలో ఎలాంటి ఆదేశాలూ ఇవ్వదలచుకోలేదు!

రెండవ ఆరోపణ... తనకు మూడ్ లేనప్పుడు, లేదా, శారీరకంగా అస్వస్థురాలై ఉన్నప్పుడు, తనను అతనితో సెక్స్‌లో పాల్గొనమని ఆమె భర్తయైన శ్రీ ప్రఫుల్లకుమార్ మాటిమాటికీ ఇబ్బందిపెడుతూ, బలవంతముగా తన కోరిక తీర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నారని!

భారత సుప్రీంకోర్టు ఇదివరలో ఇచ్చిన తీర్పు ప్రకారం, కేవలం భర్త అయినందువల్ల సెక్స్ విషయంలో స్వంత భార్యను కూడా బలవంతం చేయడం తగదనీ, అది ‘రేప్’ అనే నిర్వచనంలోకి వస్తుందనీ చెప్పబడింది! ఈ కోర్టు కూడా అదే

విషయాన్ని ధృవీకరిస్తూ ఉన్నది. అయితే ఆ విధంగా ప్రఫుల్లకుమార్, తన భార్యను బలవంత పెట్టిన ప్రతిసారీ, తరువాత ఎవరికి అనుకూల పరిణామం జరిగినదో శ్రీమతి అనుదీప్తి వివరించి చెప్పలేకపోయారు. కాబట్టి, ఈ ఆరోపణపై ఆమె భర్తయైన శ్రీ ప్రఫుల్లకుమార్‌ను 'బెనిఫిట్ ఆఫ్ డౌట్' కింద నిర్దోషిగా భావిస్తున్నాను. అయినప్పటికీ ఆ విధంగా భార్యను బలవంతం చేయడం 'మానసిక హింస' పరిధిలోకి వస్తుంది కాబట్టి, అతనిని తీవ్రంగా హెచ్చరించడమైనది.

మూడవ ఆరోపణ... తన అత్త మామలూ, భర్తా తనను ఇంట్లో ఉన్నప్పుడు సాంప్రదాయ దుస్తులు మాత్రమే ధరించమని బలవంతపెడుతున్నారని శ్రీమతి అనుదీప్తి ఆరోపిస్తున్నారు. ఈ విధంగా తన వ్యక్తిగతస్వేచ్ఛను హరిస్తున్నారనీ, ఇది తనకు రాజ్యాంగం ఇచ్చిన ప్రాథమిక హక్కును భంగపరచడమేనని ఆరోపించారు.

ఈ కోర్టు, పైన చెప్పిన విషయాన్ని అత్యంత తీవ్రంగా భావిస్తూ ఉన్నది. శ్రీమతి అనుదీప్తి, శ్రీ ప్రఫుల్లకుమార్‌ను హిందూ సాంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. వివాహ సమయంలో పూజలు నిర్వహించేటప్పుడు, పురోహితుని సూచనల మేరకు సాంప్రదాయ దుస్తులు మాత్రమే ధరించారు. వివాహం విషయంలో సంప్రదాయం అవసరమైన శ్రీమతి అనుదీప్తికి, ఆ తరువాత ఎందుకు తన ప్రాథమిక హక్కుకు భంగకరం అని భావించారో ఈ కోర్టుకు అర్థం కావటంలేదు. వివాహం అనేది తనకు రక్షణ కల్పిస్తుంది కాబట్టి, అక్కడ ఆ నియమాలు పాటించి, ఆ రక్షణ దొరికి, తన వివాహబంధం స్థిరపడ్డ తరువాత, అటువంటి వస్త్రధారణకు వ్యతిరేకంగా మాట్లాడటం 'ద్వంద్వ ప్రవృత్తి' గా భావించబడుతుందని ఈ కోర్టు శ్రీమతి అనుదీప్తికి తెలియచేస్తోంది. చిన్నపాటి విషయాలూ, భార్యాభర్తలు పరస్పరం పరిష్కరించుకోవాల్సిన విషయాలనూ కోర్టు దాకా తీసుకొని రావద్దని శ్రీమతి అనుదీప్తిని హెచ్చరిస్తున్నాము.

ఇక నాల్గవదీ... అతి ముఖ్యమైనదీ అయిన ఆరోపణ! తన భర్త శ్రీ ప్రఫుల్లకుమార్ వేరొక స్త్రీతో అక్రమసంబంధం పెట్టుకున్నారని శ్రీమతి అనుదీప్తి సాక్ష్యాధారాలతో సహా ఈ కోర్టుకు సమర్పించారు. చిత్రమైన విషయమేమిటంటే ప్రతివాది కూడా ఈ ఆరోపణను ఒప్పుకోవడమే కాకుండా, ఇందుకు రెండవ ఆరోపణను కారణంగా చూపిస్తున్నారు. శ్రీ ప్రఫుల్ల కుమార్ చెప్పిన కారణం, భార్య యొక్క అనారోగ్యకారణంగానో, మరే చిన్న కారణంగానో తాత్కాలికంగా సంసారం చేయకపోతే, అది శాశ్వతమనే అని అర్థం వచ్చేటట్టుగా ఉంది. కోర్టు ఈ వాదనను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోలేదు!

ఈ సాధారణమైన కేసు అసాధారణమైనది ఎందుకు అయ్యిందో వివరిస్తాను. ఈ నాల్గవ ఆరోపణను నిరూపించడంతో శ్రీమతి అనుదీప్తి తన విడాకులకు మార్గం సుగమం చేసుకున్నారు. కానీ విచిత్రంగా వాది ప్రతివాది నుండి విడాకులు ససేమిరా వద్దు అనీ, ఒక వేళ శ్రీ ప్రఫుల్లకుమార్ అటువంటి విజ్ఞప్తి చేసినా, నూటికి నూరు శాతమూ తిరస్కరిస్తాననీ వ్రాతపూర్వకంగా అఫిడవిట్ ఇచ్చారు. దీనికి ఆమె పేర్కొన్న కారణాలు ఇవి.

వీరిద్దరి వివాహమూ రద్దైనట్లైతే ప్రస్తుత సామాజిక పరిస్థితులలో శ్రీమతి అనుదీప్తికి మరొక వివాహం కాదు కాని, శ్రీ ప్రఫుల్లకుమార్ సర్వ స్వతంత్రతను పొంది, ఇప్పుడు అక్రమ సంబంధం సాగిస్తున్న మహిళనో మరొక అమాయక మహిళనో వివాహం చేసుకోవడానికి కోర్టూ, సమాజమూ రెండూ ఒప్పుకుంటాయి. అప్పుడు నేరస్థుడు సంతోషంగా ఉండి, బాధితురాలు ఇంకా బాధింపబడుతుంది.

మొదట నేను ఈ సంస్థను 'న్యాయస్థానం' అనకుండా కోర్టు అని మాత్రమే ఎందుకు అనవలసివచ్చిందో ఇప్పుడు అందరికీ తేటతెల్లమై ఉంటుంది. ఈ కేసులో ఈ కోర్టు చేయగలిగినది చాలా కొంచెం మాత్రమే. వాది, తనకు తన భర్తతో విడాకులు

కాకుండా భర్తను శిక్షించమన్నారు. తనకు న్యాయం చేయమన్నారు. ఈ రెండూ ఈ కోర్టు పరిధిలో లేనివి! కానీ శ్రీ ప్రఫుల్లకుమార్ అక్రమసంబంధం తాలూకు వ్యవహారాన్ని మరొక ప్రత్యేక కేసుగా పరిగణిస్తూ, ఆ దిశగా ఏమి చేయగలరో ఒక వారం రోజుల్లోగా చర్యలు తీసుకోవడానికి ప్రయత్నించాలని ఈ కోర్టు పోలీసు శాఖను ఆదేశిస్తోంది. ఈ తీర్పు ప్రకారం పైన ఆదేశించినట్టు, పోలీసుశాఖ అతనిని ప్రశ్నించడానికి వీలుగా. ఒక వారం పాటు సదరు శ్రీ ప్రఫుల్ల కుమార్‌ను న్యాయవ్యవస్థ కస్టడీలో ఉంచాలి. ఈ వారం తరువాత సదరు ప్రఫుల్లకుమార్ మీద ఏ విధమైన కేసూ మోపడానికి వీలు లేకపోతే అతనిని విడుదల చేయవచ్చును.

కోర్టుపరిధిలోనుండి బయటకు వచ్చి, మానవీయ దృక్పథంతో ఆలోచించిన ఈ కోర్టు తుదితీర్పును వెలువరిస్తోంది.

భార్యాభర్తలలో ఒకరు బాధింపబడి విడాకులు మంజూరైన సందర్భంలో రెండవ వ్యక్తి, ముఖ్యంగా మగవారు ఇంకొక వివాహం చేసుకోవడానికి అనర్హుడిగా ప్రకటించబడాలి. అంటే ప్రతి మగవాడికీ ప్రభుత్వ క్లియరెన్స్ ఉంటేనే వివాహం అయ్యేటట్టుగా చట్టం తీసుకురావడానికి కృషి చెయ్యమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఈ కోర్టు ఆదేశిస్తున్నది.

ఈ కేసు ద్వారా ఇంకొక రెండు విషయాలు వెలుగులోకి వచ్చాయి. అక్రమ సంబంధము విషయములో మగవారికి శిక్ష వేయడానికి సరియైన చట్టాలు లేని క్రమంలో ఆ దిశగా ఆలోచించాలి. రెండవది.. రేప్ కేసులలో చిట్టచివరి శిక్షగా ఉరిశిక్ష కాకుండా ప్రభుత్వమూ, ప్రతినిధులూ... ఆ మగవాడు తదుపరి జీవితాంతం సెక్స్‌కు పనికి రాకుండా లింగ మార్పిడి చెయ్యడం వంటి ఆలోచనలు చెయ్యాలి! ఇటువంటి లింగ మార్పిడి జరిగినప్పుడు, స్త్రీలు సమాజంలో ఎటువంటి కష్టాలు ఎదుర్కొంటున్నారో ఆ మగవాడికి అనుభవపూర్వకంగా తెలుస్తుంది!

ఈ సాధారణ కేసును, విడాకులు తిరస్కరించి అసాధారణ కేసుగా మార్చి మాచేత చారిత్రాత్మకమైన తీర్పు ఇప్పించినందుకు శ్రీమతి అనుదీప్తిని అభినందిస్తున్నాము!

# వాడి గెలుపు నాదే!

**కొత్తపల్లి ఉదయబాబు**
✆ 9441860161

> ***నీ పెన్షన్ అంతా ఇచ్చినా, కేవలం నీసుఖంకోసం బతికే నిన్ను, ఇంకొకరు అయితే ఏ మాత్రం ఆదరించరు. నీకు సిగ్గు, శరం, మానం, అభిమానం ఏమాత్రం ఉన్న, తక్షణం ఇంట్లోంచి వెళ్లిపోయి ఏదైనా వృద్ధాశ్రమంలో చేరి, నీపిల్లలు సుఖంగా బ్రతికే బతుకు కల్పించు. వాళ్ళ మానాన వాళ్ళని బ్రతకనివ్వు. అది చేతకాకపోతే చచ్చిపో!"***

నేను సరిగ్గా లోపలికి అడుగు పెట్టేసరికి, ధన్వంతరి కోపంగా కోడలిని డైనింగ్ టేబుల్ దగ్గర ఏదో అంటున్నాడు. తెరవేసి ఉండడంవల్ల నా రాక వాళ్ళు గమనించలేదు. నేను నిశ్శబ్దంగా సోఫాలో కూర్చున్నాను.

"నా ఖర్మకాలి మీ అత్తగారు చచ్చిపోయిందిగాని... డెబ్బై సంవత్సరాలు నా అడుగులకు మడుగులొత్తి, నా నీడలా బ్రతికి చాకిరీ చేసిపెట్టిందమ్మా! ఈవేళ మీ పంచనపడి ఉండి, బతకడంకోసం తినాల్సివస్తోంది. ఏ జన్మలో ఏ మహాపాపం చేసుకున్నానో... జీవితపు చివరిదశలో ఇటు స్వంతఇల్లులేకుండా, అటు భార్యలేకుండా బతుకుతున్నాను! ఆనపకాయ పెసరపప్పు వండావు బానే ఉంది. కమ్మని కూరలోకి, పుల్లటి వంకాయ పచ్చిపులుసు కాంబినేషన్ లేకపోతే నేను తినలేను అని కూడా నీకు తెలుసు! తెలిసీ మెంతి మజ్జిగ పెట్టావ్. సరే. పెరుగు పోసేయ్!" అన్నాడు ధన్వంతరి.

నాకు వాళ్ళిద్దరూ డైనింగ్ టేబుల్ దగ్గర కనిపిస్తూనే ఉన్నారు. ధన్వంతరి మాటలకి కోడలు కళ్లనీళ్ల పర్యంతమై, మౌనంగా కళ్ళు తుడుచుకుని, "ఆ మెంతిమజ్జిగ పోసుకోండి మావయ్యగారు... కడుపు నిండాలి కదా!" అంది రుద్ధమైన కంఠంతో.

"అక్కర్లేదమ్మ! కడుపు నిండిపోయింది. పెరుగు పోసేయ్!" అన్నాడు శాసిస్తున్నట్టుగా. మరోమార్గంలేక పెరుగు పోసేసి, ఆమె వంటింట్లోకి వెళ్లిపోయింది కొంగుతో కళ్ళుతుడుచుకుని.

ధన్వంతరి భోజనంచేసి వాష్‌బేసిన్ దగ్గర చేతులుకడుక్కుని హాల్లోకి వస్తూనే నన్నుచూసి, "ఎంతసేపయిందిరా గన్నయ్యా... నువ్వు వచ్చి?" అని అడిగాడు సోఫాలో నా పక్కన కూర్చుంటూ.

"నీకు అభ్యంతరం లేకపోతే నీతో పది నిమిషాలు మాట్లాడాలి. కింద సెల్లార్లోకి వెళ్లి అక్కడ కూర్చుని మాట్లాడుకుందాం... వస్తావా?" అన్నాను.

"అదేమిటో ఇక్కడే చెప్పొచ్చుగా?" అన్నాడు ధన్వంతరి.

"నీకు ఇష్టం లేకపోతే అవసరం లేదు. నేను వెళ్ళొస్తాను!" లేవబోయాను.

"సరే వెళ్దాం పద!" అన్నాడు అయిష్టంగా! ఇద్దరం లిఫ్ట్‌లో సెల్లార్ లోకి వచ్చాము.

మాలాంటి వృద్ధులు అక్కడ విశ్రాంతి తీసుకోవడంకోసం వేయబడి ఉన్న ఫైబర్ కుర్చీల్లో స్థిరంగా కూర్చున్నాం.

“చెప్పరా ఏం చెప్పదలుచుకున్నావో?” అడిగాడు ధన్వంతరి. నేను మొదలు పెట్టాను.

★★★

దాదాపు రెండునెలల తర్వాత నేను సురభి వృద్ధాశ్రమంలో తొలిసారి అడుగుపెట్టాను.

కేవలం ఇరవైఐదు మంది వృద్ధులతో దాదాపు సంవత్సరం క్రితం ప్రారంభించబడిన ఆ వృద్ధాశ్రమం, నేను గతంలో వచ్చినపుడు ఎండిపోయిన బీడులా ఉండేది.




గేటుదాటి లోపలికి అడుగుపెడుతూనే కనిపిస్తున్న పచ్చని, చక్కని వాతావరణానికి మనసు పులకించిపోయింది. ఒకపక్క చిన్న, చిన్న అందమైన మడుల్లో ఎదుగుతున్న ఆకుకూరల మొక్కలన్నీ, గలగల కబుర్లు చెప్పుకుంటూ నన్ను ఆహ్వానిస్తున్నట్టుగా అనిపించింది.

మరోపక్క పాదులన్నీ పందిళ్ళ పైకి ఎగబాకి, పువ్వులతో పిందెలతో కాయలతో అలరాడుతున్నాయి. ప్రహరీగేటుకి రెండు పక్కల దైవపూజకు పనికివచ్చే పూలమొక్కలన్నీ కూడా చక్కగా కుదుళ్ళలో కుదురుగా నిలబడి, రేపటికి విరబూయడంకోసం అన్నట్టు మొగ్గలతో నిండి ఉన్నాయి.

ఆ ఆశ్రమ వాతావరణం ఈరోజు ఇంత కళకళలాడుతోంది అంటే ఖచ్చితంగా వాడి పనే.

ఎందుకంటే... వాడు ఉద్యోగం చేసే రోజుల్లో కూడా, ఆఫీసునుంచి ఇంటికి వచ్చాకా, ఒక్క క్షణం ఖాళీగా కూర్చునేవాడు కాదు. బట్టలు మార్చుకుని ఆ తోటలో తోటమాలి అవతారమెత్తేసేవాడు. దాదాపు ఎనిమిదివందల గజాల స్థలంలో వాడి సొంతఇల్లు ఉండేది. గేటు తీసి లోపలికి అడుగు పెడితే చాలు... ఇంటి లోపల గోడల చుట్టూ రకరకాల పూలమొక్కలు. మధ్యలో దారిపొడవునా, ఇంటి ముంగిట్లో నీడనిస్తూ పెద్ద పెద్ద పళ్ళమొక్కలు, మధ్య మధ్యలో రకరకాల సువాసనలను వెదజల్లే ఆయుర్వేద మొక్కలు. ఆ మొక్కలనుంచి వచ్చే పరిమళంతో... వాడి ఇల్లు ఇంద్రలోకపు ఉద్యానవనాన్ని తలపించేది.

వాడి భార్య నన్ను చూస్తూనే “వచ్చారా అన్నయ్యగారు. ఆయన ఆ మొక్కల మధ్య పుణుక్కుంటూ ఉంటారు. అరచి అరచి నా గొంతు పడిపోతోంది. టీ చల్లారిపోతే, వేడి సరిపోలేదని గొడవ! కొంచెం ఆయనకి ఇచ్చేద్దురు. మీరు తాగుతానంటే

వెంటనే పెడతాను.'' అనేది నడుంపట్టుకుని లౌక్యంగా!

''నేను తాగి వచ్చానమ్మా. ఇలా ఇవ్వు. నేను వాడికి ఇస్తాను.'' అని వాడికోసం వెతుకుతూ వెళ్తే… వాడు ఇంటి చుట్టూ ఉన్న ఆ తోటలో ఎక్కడో ఒక చోట మొక్కలకు పాదులు చేస్తూనో, నీరు పెడుతూనో, చీడకు పిచికారీ కొడుతోనో కనిపించేవాడు.

"ఈ వయసులో విశ్రాంతి తీసుకోకుండా ఇదేం పనిరా?'' అని అడిగితే… "మొక్క వేసేస్తేనే సరికాదురా… నారుపోసినవాడే నీరు పోయాలి. కన్న బిడ్డల్ని ఒకలాగా, మొక్కల్ని మరోలాగా చూడటం నాకు చేతకాదు. అయినా ఇది నాకు తెలియని వ్యాయామంరా! వెళ్ళటప్పుడు నీకు ఏ చెట్టు కాయ తినాలని ఉందో అడుగు… అది కోసి ఇస్తాను!" అనేవాడు.

★★★

అదంతా గుర్తుకు వచ్చి మనసు దూదిపింజ అయిపోయింది.

నేను ఆఫీసు రూములోకి అడుగుపెడుతూనే, "ఎవరు కావాలండి?"అన్న ప్రశ్నకు తలెత్తాను. అడిగింది ఎవరో కాదు ధన్వంతరి.

"ఓర్నీ నువ్వా …ఇన్నాళ్ళకి కనిపించావేమిట్రా? "అడిగాడు ధన్వంతరి నిష్ఠూరంగా.

''అయితే నామీద నీకు కోపం గట్టిగానే వచ్చిందన్నమాట. ముందు నువ్వు నన్ను మనస్ఫూర్తిగా క్షమించాను అని చెప్పరా!" అన్నాను ధన్వంతరి చేతులు పట్టుకొని.

"ఇలాంటి పిచ్చి మాటలు మాట్లాడదలచుకుంటే ఒక్క క్షణం ఇక్కడ ఉండొద్దు. వెళ్ళిపో! నన్ను నిష్ఠూరంగా మాట్లాడి, నా కొడుకు ఇంట్లోంచి ఇక్కడికి వచ్చేసేలా చేసింది నువ్వు. ఇక్కడ నా బ్రతుకు నేను ప్రశాంతంగా బతుకుతుంటే, వచ్చి క్షమాపణ అడుగుతున్నావా… సిగ్గులేదు? అలాంటి మాటలు మాట్లాడను అంటే ఇక్కడ ఉండు, కాసేపు కబుర్లు చెప్పుకుందాం. లేదా నీ దారిన వెళ్లిపోవచ్చు!" అన్నాడు నా చేతులు విదిలించుకొని.

వాడి కోపం, నిటారుతనం, ముక్కుసూటితనం తెలిసిన నేను మాట్లాడకుండా, వాడి ముందు కుర్చీలో కూలబడ్డాను.

"రెండో మనవడు మంచి ఉద్యోగంలో స్థిరపడలేదురా! చాలీచాలని జీతంతో లాక్కొస్తున్నాడు. పైగా ప్రేమపెళ్లి చేసుకున్నాడు. మొదట ఒక అమ్మాయి పుట్టింది, ఇప్పుడు మళ్లీ రెండోసారి అమ్మాయికి నెలలు నిండాయి. అమ్మాయికి కొంచెం పొదుపు తక్కువ. వాడికి నేనంటే చాలా అభిమానం. దాంతో వాడి దగ్గర ఉండి, వాడికి డబ్బు సాయం చేసినట్టు ఉంటుందని వెళ్లాను. ఈసారి అబ్బాయి పుట్టాడు. పురిటి నీళ్లయ్యాక నిన్ననే తిరిగి వచ్చేసాను!"

దానికి ధన్వంతరి చాలా తేలిగ్గా నవ్వేస్తూ.."ఒరేయ్… ఒక తెలియని మూర్ఖత్వంలో బ్రతుకుతున్న నాకు, నా బాధ్యత తెలిసివచ్చేలా చేసిన నీకు సర్వదా కృతజ్ఞుడినిరా! నాలో నిద్రపోయిన నా వ్యాపకాలన్నీ, మళ్ళీ నీవల్ల ఉత్తేజం పుంజుకుని నాకు మరింత పని కల్పించాయిరా! వచ్చేనెలలో మా ఆశ్రమం ప్రథమ వార్షికోత్సవంరా! దానికి చక్కటి నాటికను వేయిస్తున్నాను మా వాళ్ళ చేత! రిహార్సల్స్ చేస్తున్నాం. వీలైతే సరదాగా వచ్చి చూడు!"అంటూ, నా చేయి పట్టుకుని విశాలమైన హాల్లోకి నడిచాడు ధన్వంతరి.

"ఏంటి ఇక్కడ కూడా మొదలెట్టేసావా? ఈ వయసులో వాళ్ళని సుఖంగా ఉండనివ్వకుండా, నీ పైత్యాలన్నీ వాళ్ళమీద

రుద్దితే, వాళ్లు భరించగలరా?"

"ఆ ప్రశ్న నన్ను అడగాల్సింది కాదు. వాళ్ళని అడిగి సమాధానం తెలుసుకో!" అంటూ, ధన్వంతరి "డియర్ ఫ్రెండ్స్! అంతా సిద్ధంగా ఉన్నారా?" అని ఆ హాలు చుట్టూ ఉన్న గదులలోకి వినిపించేలా అరిచాడు. అక్కడ ఉన్న ఒక కుర్చీలో కూలబడ్డాను నేను.

వెంటనే ఇద్దరు స్త్రీమూర్తులు, నలుగురు మగవాళ్ళు... మొత్తం పదిమంది దాకా తమ తమ గదుల్లోంచి, నాటకం తాలూకు తమ పోర్షన్ల పేపర్లతో కాబోలు... బయటికి వచ్చారు.

"మేమంతా రెడీ అన్నయ్యగారు!" అన్నారు.

"చెల్లెళ్ళూ... తమ్ముళ్లూ! అందరికీ పోర్షన్లు వచ్చేసాయి కదా. అందరమూ కూర్చుని సిటింగ్ రిహార్సల్స్ వేద్దాము. ఆ తర్వాత ఓపిక ఉంటే నిలబడి మొదటి భాగం నటిద్దాం. సరేనా?" అన్నాడు ధన్వంతరి.

పనిచేసే అమ్మాయిచేత కుర్చీలు చుట్టూరా వేయించి, వాటిలో వారందరినీ కూర్చోమని చెప్పి, నాటకంలోని మొదటి దృశ్యంలోని సంభాషణల్ని వారందరి చేత స్పష్టంగా, భావయుక్తంగా పలికించాడు ధన్వంతరి.

డెబ్బై, ఎనభై వయసుల మధ్యఉన్నఆరుగురు పాత్రధారులు... అతను ఏ విధంగా శిక్షణ ఇచ్చాడో అలాగే, ఏమాత్రం అలసటకు లోనుకాకుండా పలికిన తీరు, నన్ను ఆశ్చర్యంలో ముంచెత్తింది.

ధన్వంతరి ప్రదర్శిస్తున్న అంకితభావం చూస్తే, నాకు ఒళ్ళు గగుర్పొడిచింది. కళ్ళు అక్కడ జరిగే దృశ్యాన్ని యాదృచ్ఛికంగా చూస్తున్నా నా ఆలోచనలు ఒక్కసారి గతంలోకి మళ్లాయి.

★★★

ధన్వంతరి, నేను ఆంధ్రాలోని రాజోలు అనే ఒక ఊరికి చెందిన వాళ్ళం. నేను ఉదయంపూట పుడితే, అదే రోజున సాయంత్రం వాడు పుట్టాడు. పైగా మా ఇద్దరిమధ్య తాత ముత్తాతల సంబంధాలు ఉన్నాయి. ఆ విధంగా మేమిద్దరం బంధువులం. డిగ్రీవరకు కలిసి చదువుకున్నాం. వాడు పోస్ట్మాస్టర్‌గా, నేను తెలుగు ఉపాధ్యాయుడిగా సర్వీసులు పూర్తిచేసి రిటైర్ అయిపోయాం!

ధన్వంతరి భార్య పద్మ... మా తాతగారి మనవరాలే. చదువుకున్నది ఐదో తరగతి అయినా నిజమైన భారతీయ గృహిణికి ప్రతిరూపంగా ఉండేది ఆమె. ధన్వంతరి నానమ్మది నిప్పు కడిగే ఆచారం. అదే ఆచారపు బాటలో ధన్వంతరి తల్లి, భార్య కూడా నడిచారు. బామ్మ పెంపకంలో పెరిగిన ధన్వంతరి క్రమశిక్షణకు మారుపేరు. ఏ విషయంలోనూ ముప్పై సెకండ్ల మించి ఆలస్యం కావడం అతనికి ఇష్టం ఉండేది కాదు. దాంతో చేతిలో ఏ వస్తువు ఉంటే ఆ వస్తువుని, ఆ మనిషి మీదకు విసిరేసేవాడు అని చెప్పుకునేవారు. అటువంటి భర్తతో డెబ్బై సంవత్సరాలు కాపురం చేయగలిగిందంటే ఆమె ఎంతటి ఉత్తమ భారత స్త్రీయో మనకు అర్థం అవుతుంది.

మునిమనవలను కూడా ఎత్తిన ఆమె, గుండెపోటుతో ఎనభై నాలుగు ఏళ్ళ వయసులో మరణించింది. అతని ఇద్దరు కొడుకులు, కోడళ్ళు అదే క్రమశిక్షణని అతనిపట్ల పాటిస్తూ సేవచేస్తున్నారు. నిజం చెప్పాలంటే ఇతనికోసం తమ జీవితంలో

సుఖసంతోషాలని వాళ్ళు కోల్పోయారనే చెప్పాలి.

ఒక తీర్థయాత్ర కానీ, పుణ్యక్షేత్ర దర్శనంగానీ, కనీసం పండుగనాడు గుడికి కూడా వెళ్లలేనంత అదుపులో పెట్టాడు ధన్వంతరి కోడళ్ళని.

నేను వాళ్ళ ఇళ్ళకి వెళ్ళినప్పుడు, ఒకట్రెండుసార్లు వాళ్ళు తమ బాధ నాతో మొరపెట్టుకున్నారు. భోజనంలో పదార్థాలన్నీ కాంబినేషన్స్‌తో ఉండాలి. ఏమాత్రం పదార్థాల రుచి, అన్నం పదును తగ్గకూడదు. పండుగనాడు పిండి వంటల్లో రకరకాలు ఉండాలి. గారెలు వండితే వాటితోపాటు పెరుగు ఆవడలు, కొత్తిమీర గారె, అల్లం గారె, కారం గారె, వాటిలోకి మళ్ళీ బెల్లంపొడుము... వేడివేడి బూరెల్లోకి, కరిగించిన నెయ్యి... ఇలా...

ఆనపకాయ పెసరపప్పులోకి మ్యాచింగ్ పులుసు చేయలేదని కోడల్ని విసుక్కున్ననాడు –

కింద సెల్లార్ లోకి తీసుకువెళ్లి 'నేనేం మాట్లాడినా వినాలి తప్ప ఒక్క సమాధానం కూడా చెప్పకూడదు' అని ముందుగా మాట తీసుకుని కొడుకు కోడళ్ళ పట్ల అతని ప్రవర్తనని కడిగి పారేసాను.

"ఒరేయ్... ధన! ఎనభై నాలుగేళ్లు వచ్చినా, నీ సుఖం కోసం నువ్వు బతకడం కాదురా... నీ కొడుకుల్ని కోడళ్ళని వాళ్ళకోసం, వాళ్ళని స్వేచ్ఛగా బ్రతకనీ! నీకు ఓపిక ఉంటే వాళ్లకి అలా బ్రతికే శ్రమ నీవల్ల తప్పించు. అంతేగాని, క్రమశిక్షణ పేరుతో వాళ్లని నరకయాతనపెట్టి, వాళ్ళ జీవితానందాన్ని నాశనం చేసే హక్కు నీకు లేదు! 'పెన్షన్ వాళ్లకి ఇచ్చే తింటున్నానుగా' అని నువ్వు అనొచ్చు. నీ పెన్షన్ అంతా ఇచ్చినా, కేవలం నీ సుఖంకోసం బతికే నిన్ను, ఇంకొకరు అయితే ఏ మాత్రం ఆదరించరు. నీకు సిగ్గు, శరం, మానం, అభిమానం ఏమాత్రం ఉన్నా, తక్షణం ఇంట్లోంచి వెళ్లిపోయి ఏదైనా వృద్ధాశ్రమంలో చేరి, నీ పిల్లలు సుఖంగా బ్రతికే వీలు కల్పించు. వాళ్ళమానాన వాళ్ళని బ్రతకనివ్వు. అది చేతకాకపోతే చచ్చిపో!" అని వెనుతిరిగి చూడకుండా వెళ్ళిపోయాను నేను!

ఆ మాటలు ధన్వంతరి మీద ఎలా పనిచేసాయోగానీ ఇవాళ వృద్ధాశ్రమంలో బ్రతుకుతున్నాడు... అదీ తాను బ్రతుకుతూ తనకిష్టమైన కళతో పదిమందిని బతికిస్తూ!

★★★

చుట్టుపక్కల మిగతా వృద్ధుల కరతాళధ్వనులతో ఈ లోకంలోకి వచ్చాను. అక్కడే ఉన్న ఆ రోజు దినపత్రిక మీద నా దృష్టి పడింది. మధ్య పేజీలో ఉన్న, ఆ వార్త చూస్తూనే ఆశ్చర్యపోయాను.

"ఎనభై ఆరేళ్ళ వయసులో... తాను నివసిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులందరికి మార్గదర్శిగా, పెద్దదిక్కుగా వ్యవహరిస్తున్న ధన్వంతరి మాస్టారు" అన్న మకుటంతో ధన్వంతరి ఉంటున్న వృద్ధాశ్రమం యొక్క కార్యకలాపాలు, విధి విధానాలు రాష్ట్రంలోని ప్రతి వృద్ధాశ్రమానికి ఆదర్శమని, అందుకు కారణభూతుడైన ధన్వంతరిగారికి రాజకీయ నాయకులు, సాంఘిక సేవాతత్పరులు, పలు స్వచ్ఛంద సంస్థలు... ప్రశంసల వర్షం కురిపించిన వార్తాపత్రిక మీద రాలిన నా ఆనంద బాష్పాలను చేత్తో తడుముతూ... "నీ గెలుపు నాదేరా ధనా!" సగర్వంగా అనుకుంటూ, నిశ్శబ్దంగా బయటికి వచ్చేసాను!

# ఆఘోసన

## అనిల్ ప్రసాద్ లింగం

✆ 8185949365

***ఎదురుగా వచ్చినాయన్ని పట్టుకుని, "బాబాయి" అని ఏడ్చేసింది. "ఊరుకోమ్మా. నాయనమ్మకు వయసైపోయింది కదా, మేమంతా లేమా? పిచ్చి పిల్లా. మా అమ్మకు బాగా అలవాటండీ!" తానూ ఏడుస్తూ వెనకొచ్చిన నాకు చెప్పాడాయన.***

***"ప్రయాణంలో ఫోను పోయిందండీ" ఎందుకేడుస్తుందో చెప్పేశాను నేను.***

"ఎక్స్‌క్యూజ్ మీ" మంచి ఆంగ్ల ఉచ్చారణతో పలకరించి, "విండో సీట్ నాకిస్తారా?" నవ్వుతూ అడిగింది అప్పుడే బస్సు ఎక్కిన అమ్మాయి.

"నాకు బస్సు పడదమ్మా, వాంతులవుతాయి!" నిజమే చెప్పింది పెద్దావిడ, చేతిలోని నిమ్మకాయని చూపిస్తూ!

మొహం మాడ్చుకొని వెనక్కి నడిచిందామ్మాయి. ఇంతలోనే అంతటి వైరుధ్యం తనను ఆశ్చర్యపరిచింది. బస్సు కొన్ని స్టేజీలు దాటాకా మళ్ళీ ఆమే వచ్చి పక్కన కూర్చుంది.

"పక్క సీటులో మగాళ్ళు వచ్చి కూర్చుంటున్నారు... ఇబ్బందిగా ఉంది. అసలు నా సీటు ఇదే, అందుకే మిమ్మల్ని అడిగాను." వివరణ ఇచ్చుకుంది.

"అయ్యో నిజంగా నాకు ఇబ్బందేనమ్మా, అందుకే.." తానూ చెప్పింది.

"నేను మిమ్మల్నేమనడం లేదండీ! అయినా నేను డాక్టర్ని, మీకో టాబ్లెట్ చెప్తాను. ఇకనుంచీ మీరు ప్రయాణంలో అది వేసుకుంటే సరిపోతుంది..." అని అంటుండగానే ఫోను మోగింది.

"హే బేబీ... మీ టూ... వాట్ టు డూ పాపా ఇన్స్టెడ్. నో... నో... వోంట్ స్టే లాంగర్..."

తాను చెప్తానన్న మందు బిళ్ళ గురించి చూస్తుందామె, కానీ ఆ అమ్మాయి మాత్రం లోకం మరిచిపోయింది. ఇక తప్పదని కిటికీ నుంచి బయటకి చూపు మళ్ళించింది తను.

★★★

'అవసరమా అమ్మా?' అనడిగాడు కొడుకు... 'తప్పదు' అన్నది తను.

తోడికోడలి తండ్రి పోయాడని కబురొచ్చింది. తాను వెళ్తానన్నది, మనకెందుకని కొడుకు వారించాడు. నేనాగలేనని బయలుదేరింది. బస్సు స్టేషన్ కొచ్చి దొరికిన బస్సు ఎక్కి కూర్చుంది. మరిదిని పెళ్ళిచేసుకొచ్చిన లక్ష్మి, తానంటే ఎంతో ఆప్యాయత కనబరిచేది. వాళ్ళ పెళ్ళికి తనకు మూడేళ్ళ కొడుకు. ఆమె ఎప్పుడూ వాడినెత్తుకొని ఆడిస్తుండేది. అప్పటికి ఇంట్లో వీడే చిన్నవాడవడంతో... అందరూ ఎంతో ముద్దు చేస్తుండేవారు. ఆ సంవత్సరం పిల్లాడి పుట్టినరోజు చేస్తే లక్ష్మి

వాళ్ళ అమ్మానాన్నా కూడా వచ్చి బంగారపు ఉంగరం పెట్టారు. కూతురికి పిల్లలు పుట్టడం కాస్త ఆలస్యమవడం వల్ల, వచ్చినప్పుడల్లా వాడితో ఆడుకుంటూ కొంత ఆపేక్ష పెంచుకున్నారు ఆ పెద్దవాళ్ళు. వీడూ 'తాతా, మామ్మా' అంటూ వాళ్ళ చుట్టూ తిరిగేవాడు.

కొన్నాళ్లకి లక్ష్మి తల్లయ్యింది, మావాడూ పెద్దవాడయ్యాడు. కానీ వాళ్ళ నాన్న ఎప్పుడు వచ్చినా, వీడికీ ఏదో ఒకటికొని తెచ్చేవాడు. అసలు... లక్ష్మి కొడుక్కి వచ్చిన బొమ్మలన్నింటితో వీడే ఎక్కువ ఆడేవాడు. లక్ష్మి తమ్ముడు మేనల్లుడికి చిన్న సైకిలు కొనిచ్చాడు. అది వేసుకొని మా వాడు తిరిగేవాడు. పిల్లలు దాని గురించి గొడవ పడుతుంటే, లక్ష్మి వాళ్ళ నాన్న కొత్త సైకిలు కొని తెచ్చి మావాడికిచ్చాడు. పదివరకూ దానిమీదే స్కూలుకు వెళ్ళేవాడు. మావారు డబ్బులిస్తాననడం, 'ఏం నా మనవడు కాదా? నేనివ్వకూడదా?' అని లక్ష్మి తండ్రి అనడం నాకింకా గుర్తుంది. అప్పట్లో వీడు... లక్ష్మీ, వాళ్ళ అమ్మానాన్నలంటే ఎంతో అభిమానంగా ఉండేవాడు.



ఇప్పుడు పెద్దయ్యాక తన సంసారం, దగ్గరి బంధుమిత్రులైతేనే పలకరింపులు! మొదటి ఆవృతంలోని వాళ్ళతోనే మాటలు, ఆ తర్వాతి వరుసలో వాళ్ళనసలు పట్టించుకోని సంకుచిత మనస్కుడైపోయాడు. అంటే తన బావమరిదికి దెబ్బ తగిలిందంటే వెళ్తాడుగానీ, బావమరిది మామగారికి ఏదైనా అయ్యిందంటే, కనీసం పలకరించాలన్న విచక్షణ కూడా ఉండదు. అదేమంటే... 'నాకు నా బావమరిది వరకే సంబంధం వాడి బంధుజనంతో కాదంటాడు.' పూర్వం ఇలా ఉండేది కాదు. దూరపు బంధమైనా ఎంతో విలువనిచ్చేవాళ్ళు. పుట్టింటి తరపూ, అత్తింటి తరపూ కొన్ని తరాల వరకూ సంబంధ బాంధవ్యాలు నెరపేవాళ్ళు! కానీ నేటి పిల్లలేంటో, ఆప్తులను అసలు పట్టించుకోరు. ఇంటర్నెట్టులోనూ, ఫోనులోనూ ముక్కూమొహం తెలీనివారి మీద కూడా తెగ అభిమానం ఒలకపోస్తారుగానీ, అయినవాళ్ళ అజాపజా పట్టించుకోరు!

మరిదికి ఉద్యోగం వచ్చాక వాళ్ళు వేరే ఊరిలో కాపురం పెట్టారు. కాలం వేగంగా పరిగెత్తింది. భర్త పోయాక పట్టణంలో ఉంటున్న కొడుకు పంచన చేరింది తను. అప్పుడప్పుడు ఏదో వంకన ఊరు వెళ్ళి ఇల్లు చూసుకొని, అయినవాళ్ళని

పలకరించి రావడం తనకలవాటుగానీ, కొడుకు మాత్రం అసలు దేన్నీ పట్టించుకున్నది లేదు.

“నీకు మొదటి సైకిలు ఆ తాతే కొనిచ్చాడ్రా.” ఆవేదనతో చెప్పింది తను.

“దాని ధర పిన్నికి పంపించేద్దాంలేమ్మా.” చాలా నింపాదిగా చెప్పాడు అబ్బాయి.

“ఒరేయ్! నేను వెళ్ళి వస్తాను.” గట్టిగా చెప్పి, “నువ్వు ఒక్కసారి ఫోను చేసన్నా పిన్నిని పలకరించు. ఈ సైకిలు విషయం మాత్రం ఎత్తబాకు.” హెచ్చరించింది తల్లి అతని ప్రవర్తనకు భయపడి.

“తమ్ముడు ఏదో సామాజిక మాధ్యమంలో శ్రద్ధాంజలి ఘటిస్తాడుగా, నేనుకూడా ఆ ఫోటో కింద RIP అని రాస్తాన్లే.” కొడుకు నిర్లక్ష్యపు వైఖరికి నెత్తి కొట్టుకుంటూ వచ్చేసింది తను.

★★★

“బయదేరాను నాన్నా. నన్ను విసిగించకండి. అలాగే... దగ్గరికొచ్చాక కాల్ చేస్తాను.” చిరాకు పడుతూ విసురుగా ఫోన్ పెట్టేసింది అమ్మాయి. అప్పుడే నిద్రపడుతుండగా పక్కన అలికిడికి కళ్ళు తెరిచింది తను.

“ఈ పెద్దవాళ్ళ చాదస్తంతో చచ్చిపోతున్నామాంటీ. మా నాయనమ్మ చావుబ్రతుకుల్లో ఉందంట. నన్ను రమ్మని డాడీ గోల. కాలేజీలో ప్రాక్టికల్స్, తర్వాత వస్తానంటే... లేదు ఇప్పుడే వచ్చి చూసెళ్ళమని ఒకటే గొడవ. పెద్ద వయసు, నేనెళ్ళడం మానడం వల్ల జరిగేది మారదు కదా. ఇంత చిన్న విషయం అర్థం చేసుకోరు!” ఆమె అలా అంటుంటే నవ్వాలో, ఏడవాలో పాలుపోలేదు తనకు.

“అదేంటమ్మా! పెద్దవాళ్ళకి పిల్లలమీద ఆపేక్ష ఉంటుంది. అసలుకంటే వడ్డీ ముద్దన్నట్టు, సొంత బిడ్డలకన్నా మనుమలు, మనుమరాళ్ళమీద ఎక్కువ మక్కువ ఉంటుంది. నీ చిన్నప్పుడు నువ్వా ఆమె చుట్టూ తిరిగుంటావు, ఇప్పుడు పెద్దదానివైపోయావు కదా, ఆమె ప్రేమ నీకు చాదస్తం అనిపిస్తుంది. మీరూ పెద్దవాళ్ళు అయ్యాకగానీ అర్థం కాదులేమ్మా!” అని నిట్టూర్చింది.

“చిన్నప్పటి సంగతేమోగానాంటీ, ఇప్పుడు మాత్రం నన్ను వేధించుకు తింటుంది మా ముసల్ది!” మొహం ఒకలా పెట్టి దెప్పిపొడిచింది అమ్మాయి.

“అవేం మాటలమ్మాయ్?” గద్దించింది తను.

“లేకపోతే ఏంటాంటీ. ఇప్పుడు నేనెళ్ళగానే లేచి కూర్చునేదీ లేదు, నిజంగానే పోయేదైతే ఆగేదీ లేదు. తరవాతెలాగూ తప్పదు కదా, ముందునుంచే ఈ హడావుడెందుకు?” అంటూ మరింత రెచ్చిపోయింది ఆ అమ్మాయి. ఇంతలో మళ్ళీ ఆమె ఫోను మోగింది.

“హా... మిస్ యూ టూ బేబీ. బోరింగ్ జర్నీరా, టీవీ ఉందిగానీ సినిమా పెట్టలేదు. హూ... పక్కన ఒక ఆంటీ ఉందిలే కాలక్షేపం. ఇంటికెళ్ళాక వీడియో కాల్ చేస్తాన్రా. ఓ షూర్.. లవ్ యూ బేబీ!” అంటూ లోకం మరిచి తన్మయత్వంతో మైమరచి మాట్లాడుతుంటే, ఆ పసి మొహం తెగ వెలిగిపోతుంది.

బస్సు ఒక ధాబా దగ్గర ఆగింది. భోజనసమయం దాటింది కానీ పొద్దునెప్పుడో టిఫిన్ చెయ్యడం వల్ల ఆకలనిపిస్తున్నది తనకు. అదీకాక మళ్ళీ రెండుమూడు గంటలవరకూ మధ్యలో ఆపరు. తను తోడికోడలి ఇల్లు చేరేసరికి రాత్రైపోతుంది. అక్కడ పరిస్థితి ఎలా ఉంటుందో తెలియదు. అన్నీ ఆలోచించి కిందకు దిగడానికి లేచింది.

“లంచ్ చేశావా? ఏమైనా తిందువుగాని, రా” అని పిలిచింది అమ్మాయిని.

“వద్దాంటీ, మీరెళ్ళండి. లేదురా బస్సాగింది తినడానికి రమ్మంటుంటే వద్దంటున్నా. యూ నో ఐ డోంట్ లైక్ ఈటింగ్ ఎట్ సచ్ ప్లేసెస్.” తనకీ, ఫోనులో అవతలివాళ్ళకీ కలిపి సమాధానం చెప్తూ, లేచి దారిచ్చింది చిన్నది.

లోపల కూర్చొని ఇడ్లీ తింటున్న తనను వెదుక్కుంటూ వచ్చింది కుర్ర పిల్ల.

“ఇక్కడున్నారా? ఏం చెప్పారూ? ఇడ్లీనా? OMG. బయటకొచ్చి కూడా ఎప్పుడూ ఇంట్లో తినేదేనా? ఏదైనా వెరైటీగా తినాలాంటీ... ఉండండి నేను కనుక్కొస్తాను!” అని లేచి, తన సమాధానంకోసం కూడా చూడకుండా కౌంటర్ వద్దకెళ్ళి, రెండు నిమిషాల్లో వచ్చి, “ఆ ప్లేటు పక్కన పెట్టండి. ఇప్పుడు మనకోసం స్పెషల్ వస్తుంది చూడండి.” అని చెప్పింది.

“అయ్యో నాకీ వయసులో అరగదమ్మా. అదీ కాక బస్సు ప్రయాణం, ఇబ్బందయిపోతుంది.” మొత్తుకుంది తను.

“అవును కదా మర్చేపోయాను, ఇదిగో మీకు రాస్తానన్న టాబ్లెట్టు.” పర్సులోనుంచి చిన్న కాగితం తీసి పెన్నుతో బరికి ఇచ్చింది. “చాలా లైటుగానే చెప్పానులెండి. నేనూ ఇలాటి చోట తినను కానీ, హైవే మీద త్వరగా వెళ్ళినా సిటీలో ట్రాఫిక్ కదా ఇల్లు చేరేటప్పటికి ఎంత టైమవుతుందో తెలియదు, ఏమైనా తినమని మా వాడు గోల!” అంటుండగానే రెండు చేతుల్లో ప్లేట్లు పట్టుకొని వెయిటర్ వచ్చాడు.

తను తింటున్న ఇడ్లీ ప్లేటు పక్కకి తోసి, ఇంకో ప్లేటు పెట్టి, వడ్డించసాగింది కుర్ర డాక్టరమ్మ. వెజ్ మంచూరియా... ఎర్రగా వేగినా, స్పూనుతో ఒత్తితే మెత్తగా విడివడి ఉల్లీ, కొత్తిమీరితో కలిసి మంచి రుచిగా ఉన్నాయి. ఇంకోటి పిజ్జా... ఆ పేర్లు తనకర్థం కావు. రెండు ముక్కలు ఇస్తే ‘వద్దని’ వారించి ఒక్కటి రుచి చూడటం కోసం తీసుకుంది. వెనుక రెండు గ్లాసుల సపోటా జ్యూసు తెచ్చాడు అబ్బాయి, టేబుల్ నిండిపోవడంతో మా పర్సులు పక్కకి తోసి వాటికి చోటిచ్చాము.

“బస్సు మధ్యలో ఆగదు, చూసుకో” హెచ్చరించింది తను.

“ఫర్లేదాంటీ, మీకు నచ్చాయా లేదా ఐటమ్స్ చెప్పండి.” మంచూరియా ఉండ నోట్లో పెట్టుకొని, కొంచెం జ్యూసు సిప్ చేస్తూ ఉత్సాహంగా అడిగింది ఆ పిల్ల.

“నిజంగా చాలా బావున్నాయి. కడుపు నిండిపోయింది. ఇవి ఇక్కడ కూడా దొరుకుతాయని తెలీదు. చాలా థాంక్స్ అమ్మా!” మనస్ఫూర్తిగా చెప్పింది తను.

“భలేవారాంటీ మీరు. పదండి బస్సు ఎక్కుదాం” అని దారితీసి, “ఇప్పుడు అన్నీ రెడీ మేడ్‌గా దొరికేస్తున్నాయి. మంచూరియా ఉండలు, పిజ్జా రొట్టెలూ... మనం వాటిని ఇంటికి తెచ్చుకొని బాండీలో వేయించుకొని, ఓవెన్లో వేడి చేసుకొని పైన మనకు నచ్చిన టాపింగ్స్ అంటే ఉప్పు, కారం, సాస్, కారట్, టమోటా వంటివి జత చేసుకొంటే ఓహో... పెద్ద రెస్టారెంట్లో చేసినంత బాగుంటాయి తెల్సా?” సీట్లో కూర్చొని చెప్పుకుపోతోంది. బస్సు కదిలింది.

“అవునా... మాకివేమీ తెలీదమ్మా దిబ్బరొట్టే, చద్దన్నం, గార్లూ, బూర్లూ ఇవే చిరుతిళ్ళు. ఇప్పుడేమో నా కోడలు మాటిమాటికీ అలిసిపోయాను, నేనిప్పుడు వండలేను అనగానే, మా మనవడే ఆర్డర్ పెట్టేస్తాడు. వందలు, వేలు తగలేసి ఈ పిజ్జాలు, అదేంటో మోమోలు, బిర్యానీలు ఎంతసేపూ ఇవే! నువ్వు చెప్పినట్టే, ఆ రొట్టెలు దొరికితే నేనే నేర్చుకొని వేయించి పెట్టేస్తాను. అన్నట్టు ఎంతయ్యిందమ్మాయ్?” అడిగింది తను.

“ఫర్లేదాంటీ. మళ్లెప్పుడన్నా మీరిద్దరుగానీ, మీ కోడలు వర్కింగా?” ఇలా వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటుండగా, బస్సు వేగంగా దూసుకుపోతోంది.

కొంతసేపయ్యాక, “లక్షణంగా విజయ భాస్కర్ అని మేము పెరెడితే నా కోడలెంతసేపు ‘హబ్బీ, బేబీ’, నేను పక్కన లేకపోతే ఏరా, ఒరేయ్ అని కూడా పిలుస్తుంటది.” ఆ మాటలు విని ఆ అమ్మాయి పగలబడి నవ్వింది.

“సర్లే మీ బేబీ కూడా తిన్నాడో లేదో కనుక్కో పాపం.” అంటూ చిలిపిగా భుజం తట్టి చెప్పి, ఫోను తీసి కొడుక్కు చేసింది తను.

పక్కన ఆ అమ్మాయి సీటులో అటూ ఇటూ ఒరుగుతూ, ముందుకు వంగి కాళ్ళ దగ్గరా వెదుకుతూ, “ఫోను కనపడటంలేదాంటీ. జారిపోయిందేమో...” అంది ఆందోళనగా.

తనూ లేచి సీటు కిందా, ముందూ వెనుకా అంతా వెదికారు. పక్క సీట్ల వాళ్ళు కూడా చూసారు కానీ ఏమీ కనపడలేదు. పెద్దావిడ ఫోను తీసుకొని తన నెంబరుకి కాల్ చేసింది అమ్మాయి. రింగ్ అవుతుంది కానీ ఆ ధ్వని తమకు దగ్గర్లో ఎక్కడా వినపడటం లేదు.

“ఆఖర్న ఎప్పుడు చూసావో గుర్తుచేసుకో, పర్సులో వేసావేమో చూసుకో!” అన్నారు కొందరు.

“చివరగా ఇందాక ధాబాలో స్కాన్ చేసి బిల్ కట్టాను. ఆ తరవాత టేబుల్ మీద పెట్టి తిన్నాము. వాడు ఒకేసారి ప్లేట్లూ, జ్యూస్‌గ్లాసులూ తీసుకొస్తే నా పర్సుతోబాటు పక్కకి నెట్టాను. తిన్నాక లేచి బ్యాగు పట్టుకునొచ్చేసాము. ఆ ప్లేట్ల మధ్యన ఉండిపోయిందనుకుంటా!” అంటూ మళ్ళీ తన నెంబరుకి కాల్ చేసింది. ఈసారెవరో ఎత్తారు.

“హలో ఆ ఫోను నాదండీ. ఎక్కడుంది? మీరెవరూ?” అంటుండగానే స్విచ్ ఆఫ్ చేసేసారు అవతలివాళ్ళు.

డ్రైవర్‌కి విషయం తెలిసి, బస్సు పక్కనాపి లోపలికొచ్చాడు.

“ఒక్కసారి వెళ్ళి చూద్దాంమంకుల్.” అడిగింది అమ్మాయి.

“ఎనక్కా? తీసినోడు ఇంకా అక్కడెందుకుంటాడమ్మా? అయినా చాలా దూరమొచ్చేసాము. బస్సెనక్కి తీసుకెళ్ళడం కుదర్దు. కావాలంటే నిన్ను ఆ పక్కెళ్ళే బండెక్కిస్తాను. నువెళ్ళి చూసుకో.” నిర్ద్వందంగా చెప్పాడు డ్రైవర్.

ముందు చిన్న చిరాకులా తోచిన సమస్య, ఇప్పుడు పెద్ద ఆందోళనగా మారేసరికి అమ్మాయి మొహం తదనుగుణంగా మారింది. కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి, చెక్కిళ్ళు ఎరుపెక్కాయి, చేతులు చున్నీలో చుట్టుకుపోతున్నాయి. అందరివైపూ దీనంగా చూస్తోంది.

“నువ్వెళ్ళినా అనవసరమమ్మా, టైము వేస్టు. పోయిన దాన్ని బ్లాక్ చేసి, ఎక్కడుందో తెలుసుకోడానికి కొన్ని యాప్స్

ఉన్నాయికదా వాటి ద్వారా ట్రై చెయ్యి!" సలహా ఇచ్చారెవరో.

డ్రైవర్ వెళ్ళి బస్సు ముందుకు కదిలించాడు, ఎరుపెక్కిన కళ్ళతో పక్కనామె వైపు చూసింది అమ్మాయి.

"పోనీలే మళ్ళీ కొనుక్కోవచ్చు, బాధ పడకు." అంటూ కళ్ళు తుడిచి, "అసలంతా నావల్లే! ముందు రానన్నావు కదా, అనవసరంగా దిగావు నా గురించి!" అంటూ ఓదార్చింది.

"ఇల్లుచేరేసరికి లేటవుతుంది, ఏదోకటి తినమని మా వాడు గొడవ చేస్తే వచ్చాను. మీ తప్పేమీ లేదు. నా బ్యాడ్ లక్. పోయిన నెల్లోనే లాంచ్ చేసిన కొత్త మోడల్, నాకూ తనకీ ఇద్దరికీ ఒకే రంగుకొన్నాడు. చాలా ఫోటోలు, కాంటాక్ట్స్ ఉన్నాయి. పోయిందని తెలిస్తే ఏమంటాడోనని భయంగా ఉంది." బిక్కమొహం వేసింది అమ్మాయి.

"ఏమనడులే, ఫోనే కదా! ముందు అతనికీ, మీ నాన్నకు చెప్పు!" అని తన ఫోనిచ్చింది.

గబగబా నెంబర్లు నొక్కి, "బేబీ నేను. హా... థాబాలో ఫోను పోయింది. స్విచ్ ఆఫ్ అయిపోయింది. సారీ రా. " కళ్ళంట కారుతున్న నీటిని చున్నీతో తుడుచుకుంటూ ఓ ఐదు నిమిషాలు మాట్లాడింది.

"డాడీ నేనే, ఫోను ఎక్కడో పడిపోయింది. జాగ్రత్తగానే ఉంచుకున్నా... అరె... చెప్పేది వినవా? తినడానికి కిందకి దిగితే... ఎన్ని పోగొట్టాను? అయ్యో, తిడతావేంటి?" అంటూ వెంటనే పెట్టేసింది. ఇక అటునుంచి ఆయన చేస్తున్నాడు, ఈ పిల్ల ఎత్తదు... ఒకటే ఏడుపు!

"అరె... ఈమాత్రానికే ఏడుస్తారా? పెద్దవాళ్ళు ఒక మాట అంటే ఇంతలా బాధపడాలా?" సముదాయించింది తను.

బస్సు గమ్యస్థానానికి దగ్గరవుతోంది, పక్కన పిల్ల మాత్రం తలచుకుని తలచుకుని ఏడుస్తూనే ఉంది. ఆమె మొహం పాలిపోయింది, దుఃఖం తన్నుకొస్తోంది, శరీరం మొత్తం నీరసంగా వేలాడిపోతోంది. కాసేపయ్యాక ఫోను ఎత్తి, బస్సు స్టాండ్‌కి రమ్మని వాళ్ళ నాన్నకి చెప్పింది.

ఊర్లో బస్సు ఆగిన తర్వాత, బస్సు దిగేవరకూ ఆగి, కింద కూర్చొని మా వైపు రెండు మూడు వరసల సీట్లు కింద చూసి నిట్టూర్చి, దిగింది ఆ అమ్మాయి. ఎదురుగా వచ్చినాయన్ని పట్టుకుని, "బాబాయి" అని ఏడ్చేసింది. "ఊరుకోమ్మా. నాయనమ్మకు వయసైపోయింది కదా, మేమంతా లేమా? పిచ్చి పిల్లా. మా అమ్మకు బాగా అలవాటండీ!" తానూ ఏడుస్తూ వెనకొచ్చిన నాకు చెప్పాడాయన.

"ప్రయాణంలో ఫోను పోయిందండీ" ఎందుకేడుస్తోందో చెప్పేశాను నేను.

"ఫర్లేదులేమ్మా మళ్ళీ కొనుక్కోవచ్చు. ఇక్కడా అన్ని మోడల్సూ దొరుకుతాయి. లేకపోతే ఆన్‌లైన్లో ఆర్డర్ చేస్తే తెల్లారేసరికి వచ్చేస్తది. ప్రతిదానికీ బెంగెట్టుకుంటే ఎట్లా చెప్పూ? నువ్వు డాక్టర్ చదువుతున్నావు, ముందు ముందు ఇలాటివి ఎన్నో చూడాలి. నీ పెళ్లికూడా చూసి పోతే బాగుండేది." అన్నీ కలియపెట్టి మాట్లాడేస్తూ, తానూ ఏడుస్తూ, ఆ పిల్లని ఓదారుస్తూ ఏదేదో అంటున్నాడు ఆయన.

"నేనొచ్చే వరకూ ఉంటుందనుకున్నా బాబాయ్. నిన్న నాన్న వీడియో కాల్లో చూపించినప్పుడు, నన్ను చూసి నవ్వింది. ఇంత

త్వరగా ఇలా వెళ్లిపోతుందనుకోలేదు" భోరున ఏడ్చేసింది కుర్రది.

"ఏడవకమ్మా, నా తల్లి కదూ. ఇలాంటప్పుడే ధైర్యంగా ఉండాలి, నువ్వే డీలా పడిపోతే మీ నాన్న ఇంకా నిరాశపడిపోతాడు. నువ్వే ఆయన్ని ఓదార్చాలి!" పెద్దాయన భుజం తట్టి చెప్తున్నాడు. ముక్కు చీది చున్నీతో తుడుచుకుంటూ, గోల గోలగా ఏడ్చుకుంటూ ముందుకెళుతోంది డాక్టరమ్మ.

ఆ దృశ్యం నాకెందుకో ఉపశమనం కలిగించింది, తెలీని ఆనందం కమ్ముకొచ్చింది. 'అయ్యో... ఇతరుల కష్టాలను చూసి సంతోషించే శాడిస్టును కాదండీ నేను. ఇప్పుడే పోవాలా, ఇక్కడ ఇన్ని రోజులుండాలా, ఈ తంతులన్నీ దేనికీ?' అని మొహం ఒకలా పెట్టి సణగకుండా, కారణమేదైనా ముసలమ్మ మరణానికి కంట నీరు పెట్టి, అయినవాళ్ళతో ఆ కష్టాన్ని పంచుకోవడం నన్ను మెప్పించింది... అంతే!

# కాకతాళీయం

## వల్లూరి విజయకుమార్
✆ 8885511950

> ***"తాతయ్యా... రా తాతయ్యా... నీకు నేను దగ్గరుండి తినిపిస్తాను సరేనా! నాన్నలా వదిలెయ్యను... రా తాతయ్యా!"***
> ***మనసు కొట్టుకుంటున్నది.***
> ***ఆ కల్మషం లేని పిలుపుకి, దేవుడే వస్తాడు... తాతయ్య రాడా!***

పెరట్లో నూతిగట్టు పక్కనే జామచెట్టు నీడలో వాలుకుర్చీలో ఒక తాతయ్య. అమ్మ ఇచ్చిన చేగోడీలు గౌనులో వేసుకుని, ఒక్కోటి తింటూ... తాతయ్య పక్కనే మనవరాలు శాలిని!

తాతయ్య పెరట్లో కూర్చుంటే చాలు ఎక్కడలేని చల్లగాలీ పిలవకుండానే వచ్చేస్తుంది. తాతయ్య కబుర్లు వినటానికి కాబోలు, జామిచెట్టు మీద ఒకటో రెండో ఉడతలు కిచకిచలాడతాయి!

పెరట్లో కూర్చుని తాతయ్య ఎన్ని కథలు చెబుతాడో... రాముడు ఉడతల్ని ప్రేమగా నిమరడం, మాయలేడి కోసం సీత పంతం పట్టడం, గుహుడు రాముణ్ణి పడవలో నది దాటించడం...

శాలినికి తాతయ్యంటే ప్రాణం. "ఇంద తాతయ్య, నువ్వూ రెండు తిను... బావుంటాయి!" తింటున్నచేగోడీలు తాతయ్యకి ఇస్తుంది.

"అమ్మడూ, నువ్వు తినమ్మా, నువ్వు తింటే నేను తిన్నట్టే..." ఈలోగా చెట్టుమీదొక కాకివాలింది. దానికి శాలిని ఏం తింటున్నదో అని కుతుహలం కాబోలు.

తింటున్న చేగోడీ ముక్క గాల్లోకి విసిరింది శాలిని. హాశ్చర్యం! కింద పడకుండానే, ముక్కని కాకి ఇలా ఎగిరొచ్చేసి పట్టేసుకుంది.

మరొకటి, మరొకటి, మరొకటి, అక్కడితో ఆగిందా ఆ కాకి! కావుకావుమంటూ అరుపులు! అది విని మరిన్ని వచ్చి చేరాయి. 'రండర్రా, అందరం టిఫిన్ చేద్దాం' అన్నట్టు గోలగా అరచుకుంటూ.

అమ్మనడిగి శాలిని ఇంకొన్ని తెచ్చి పెడదామనుకుంటే, తుఫానులా అమ్మే వచ్చేసింది పెరట్లోకి.

'ఏమే శాలీ, ఈ కాకులేంటి... గోలేంటి? ఫో, లోపలికి! కాకి నెత్తిమీద తంతే ఏడేళ్ల శని కూడాను! ఏమయ్యా పెద్దాయనా, మీరైనా చెప్పొద్దుటండీ పిల్లకి... అలా చిదానందంగా చూస్తూ కూర్చున్నారు. బావుంది వరస!"

"అమ్మా... కాకులకి చేగోడీలు నచ్చాయే, వాటి ఫ్రెండ్స్ కూడా వచ్చేసాయి తింటానికి. నువ్వే చేసావని చెబుతాలే!" శాలిని సముదాయించబోయింది అమ్మని.

శాలిని వీపుమీద పడిన దెబ్బకి, పాపం కాకులు భయపడి ఎగిరిపోయాయి అమ్మని తిట్టుకుంటూ!

"ఫో లోపలికి... చదువులేదు, సంధ్యా లేదు. మామయ్యగారూ! అలా చలిగాల్లో కూర్చోడం, మళ్లీ ఖళ్ళు ఖళ్ళు దగ్గడం. రండి లోపలికి!"

జీవకారుణ్యం అప్పటికి అలా ఆగిపోయింది.

★★★



శాలిని తల్లి సుగుణమ్మ... 'అదేంటో మరి రోజూ ఏదో సాకుతో తాతయ్యని దెప్పిపొడవడం.

'ఈ పెద్దాయనకి చెయ్యలేక ఛస్తున్నాబాబూ.'

'రోజూ చదవడానికి అర్ధరూపాయ పేపరు. చదివి ఎవరిని ఉద్ధరిస్తాడో!'

'నిక్షేపంలాంటి అత్తగారిని మింగేసాడు... ఆవిడే ఉంటే ఎంతోకొంత సాయం'

'ఈయన్ని యింట్లో వదిలి ఒక ఊరెళ్లడమా, సరదాగా తిరిగి రావడమా... నా బతుక్కి'

తాతయ్యని అంటున్నప్పుడల్లా శాలినికి ఎందుకో బాధ... తాతయ్య మంచితనం అమ్మకేం తెలుసు! అసలు ఇప్పుడంటే నాన్నమ్మని మెచ్చుకుంటోంది అమ్మ, నానమ్మ బతికుండగా రోజూ రచ్చే!

ఇంకా అమ్మ ఫ్రెండ్స్ సంగతి సరేసరి.

అమ్మ చెప్పింది వింటూ "అవునా?", "అలాగా?", "పాపం" అని బుగ్గలు నొక్కేసుకోడం... వెళ్లేప్పుడు ఏ గిన్నెడు నెయ్యో, కందిపప్పో... ఏదీ లేకుంటే, ఇంత చింతపండో... చేబదులు పట్టుకుపోయేవారు. వాళ్లకి, అమ్మ 'జానకి...' తాతయ్య 'మారీచుడు!'

★★★

తాతయ్య పగలంతా ఎక్కువసేపు పెరట్లోనే చెట్టునీ, పుట్టనీ పలకరిస్తూ గడిపేవాడు.

ఒకరోజు శాలిని బడినుండి వచ్చేసరికి అమ్మ పెరట్లో ఎవరినో తిడుతున్నాది. ఏమిటా అని వెళ్లి చూస్తే... 'కాకుల్ని!'

"వెధవ కాకులు, దండెం మీది బట్టలు ఆరనివ్వవు... రెట్టలు వేసీడం! ఒడియాలు ఎండబెట్టాలంటే భయం. పిలవకుండా తయారు... మామయ్యగారూ అలా పెరట్లోనే ఉన్నారు కదా, బట్టలమీద కాకి వాలితే తోలచ్చుకదా, అదీ చెప్పాలా... లేపోతే అవేమన్నా అనుకుంటాయనా?" దండకం ఆగట్లేదు...

"అయ్యో తల్లీ, చల్లగాలికి కాస్త కునుకు పట్టేసిందమ్మా. ఇప్పుడే నీ మాటలకి మెళకువ వచ్చిందంతే!" తాతయ్య జవాబు!

"అంటే నేను కాకుల్లా కేకలుపెట్టి, మీ నిద్ర చెడగొట్టాననే కదా మామయ్యగారూ! అసుర సంధ్య వేళ నిద్ర కొంపకరిష్టం!"

కోడలి మాటలు చీరతో పాటు ఇంట్లోకి వెళ్లిపోయాయి!

★★★

ఆదివారం పెరట్లో వడియాలకి శాలిని కాపలా! జాంచెట్టు కింద యథాస్థానంలో, పడక కుర్చీలో తాతయ్య!

"తాతయ్యా, నీకు కాకులంటే ఇష్టమా?" ఉన్నట్టుండి అడిగింది శాలిని.

తాతయ్య వింతగా చూసాడు మనవరాలిని. "ఎందుకమ్మా అలా అడిగావు?"

"అవును మరి, ఆరోజు అమ్మ కాకులని తిడుతుంటే నువ్వు ఒక్క మాట కూడా అనలేదు. నువ్వు కాకులని తిట్టడం ఎప్పుడూ విన్లేదు మరి! నువ్వు తింటున్న అన్నం మొదటి ముద్ద పెరటి గోడమీద పెట్టి అవి తినేదాకా తినవు. ఎందుకు తాతయ్యా అలా?"

తాతయ్య క్షణం మాట్లాడలేదు. శాలినికి ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నట్టుంది.

“శాలినీ, కాకులు కూడా మనలాగే సంఘజీవులు తల్లీ! మనుషులు వద్దని... వీధిలో పారేసిన తిండిని తింటాయి. మన చుట్టూ ఉన్న మురికిని తింటూ, తమ వంతుగా శుభ్రతని కాపాడతాయి కాకులు!”

“అదేంటి తాతయ్యా?”

“అవునమ్మా, రోడ్డువార చెత్త కుండీల దగ్గర, ఎంగిలాకుల దగ్గర కాకులు మూగడం చూసావు కదా!”

“అవును తాతయ్యా”

“మరి అక్కడ అవి ఏం చేస్తున్నట్టు?”

శాలిని ‘అర్థమైంది’ అన్నట్టు తలూపింది.

“నేను రోజూ భోజనం చేసే ముందు కాకులకి పెట్టే ముద్ద మన పితృదేవతలు తిన్నట్టు... పితృదేవతలంటే... నా అమ్మ, నాన్న... చనిపోయిన పెద్దలూ, మీ బామ్మా! వాళ్లెవరు ఇప్పుడు మనతో లేరు కదా. వాళ్లు బతికుండగా మన మంచి కోరినవాళ్లేనా మరి!”

“అవును తాతయ్యా! నాకూ బామ్మంటే చాలా ఇష్టం. తను పోయినప్పుడు నాకెంత ఏడుపొచ్చిందో!” శాలిని తల్చుకుంది.

“ఔనా మరి? మనం వాళ్ళని మర్చిపోతే ఎలా? ఆ పితృదేవతలని తల్చుకుంటూ కాకులకింతపెడితే, వాళ్ళ ఆత్మలు సంతోషిస్తాయి తల్లీ!”

శాలిని కళ్లు విచ్చుకున్నాయి, ఆశ్చర్యంగా!

“మనకి ఒకరోజు ఎలాగో... మరణించిన వాళ్లకి ఏడాదికి ఒక రోజన్నమాట! అప్పుడు ఏడాదికి ఒకసారి వాళ్ళని తల్చుకుని, వాళ్ల పేరు మీద నలుగురికి భోజనాలు పెట్టి, కాకులకి పెడితే వాళ్ళ ఆత్మలు సంతోషిస్తాయి! దాన్ని ఆబ్దికం అంటారు. పెద్దయ్యాక నీకు అర్థమౌతుందిలేమ్మా! ఇదంతా మనిషికి భూతదయ, పెట్టుడు గుణం ఉండాలని నేర్పడం తల్లీ!”

“తాతయ్యా. . మరి నాన్నమ్మని తలుచుకుని నాన్న ఎప్పుడూ ఆబ్దికం పెట్టలేదు కదా!”

తాతయ్య నివ్వెరపోయాడు శాలిని ప్రశ్నకి!

తాతయ్య కళ్ళజోడు... రాలుతున్న రెండు కన్నీటి చుక్కలని దాచేసింది మనవరాలికి కనపడకుండా!

★★★

జ్ఞానవాపిక బంధువులతో నిండిపోయింది.

వచ్చిన వాళ్ళందరూ, “మహానుభావుడు హాయిగా కొడుకు చేతిలో పోయాడు” అంటూ తాతయ్యని గుర్తు చేసుకోడం, తల్లిదండ్రులని కడదాకా చూసుకున్న సుందరయ్యనీ, సుగుణమ్మనీ మెచ్చుకోడమూను!

తాతయ్య పటం ముందు తడి బట్టలతో శాలిని నాన్న సుందరయ్య!

పంతులుగారు మంత్రాలు చదివినప్పుడల్లా సుందరయ్య జంధ్యం ఇటుదటు, అటుదిటు... మాటి మాటికీ మార్చేసుకోడమే. సవ్యం, అపసవ్యం, మళ్లీ సవ్యం, అపసవ్యం!

“ఎంతైనా మన సుందరానికి పెద్దలంటే గౌరవం, ప్రేమానూ!”

“సుగుణమ్మో! మరి తన మాటేవిటి? ఆఖరి రోజులవరకు అత్తమామలని తన తోటే అట్టేపెట్టుకుని, వాళ్ళ దినం తీర్చే కోడళ్ళు ఇప్పుడెవరర్రా! ఎంతయినా సుగుణ సార్థక నామధేయురాలే!”

“అయ్యా, పంతులుగారూ! మధ్యాహం అయిపోవచ్చేసింది. భోజనాలు సిద్ధం... మరి పిండం కాకులకి పెట్టేస్తే, బ్రహ్మలకి వడ్డించేద్దాం!” వంటవాళ్ళ హడావిడి.

శాలిని కళ్ళముందు జరుగుతున్న తంతు చూస్తోంది.

‘కాసేపట్లో నాన్న విస్తరిలో పిండం పెట్టుకుని చెట్టుకింద పెడతాడు. కాకులు వచ్చి తింటే తాతయ్య తిన్నట్టన్నమాట.’ శాలిని మనసులో ఇప్పుడు ఒకటే ఆలోచన... ‘కాకులు నాన్న పెట్టిన పిండం తినకూడదు! బతికుండగా నాన్న కానీ, అమ్మ కానీ, ఏనాడైనా తాతయ్య పక్కన కూర్చుని సంతోషంగా భోజనం చేసారా? అమ్మ ఒక్క రోజైనా ‘మామయ్యగారూ! మీకు ఏ కూర ఇష్టం, ఇవ్వాళ ఏం వండమంటారు?’ అని అడగలేదే!’ ఆ చిన్ని మనసులో చెప్పుకోలేని నిజాలు, భావనలు!

నాన్న వంటకాలన్నీ కలిపి ముద్దగా చేసి ఆకులో పెట్టి, చెట్టు కింద పెట్టాడు. కాకులు రావడం తరవాయి భోజనాలు కానిచ్చేయాలి.

శాలిని గుండె వేగంగా కొట్టుకుంటోంది. ‘తాతయ్యా... రాకు... నాన్న పెట్టిన ముద్ద ముట్టుకోకు... అందరి ముందు వేషాలేస్తున్నారు వీళ్ళు! ఇప్పుడు ఒక్క ముద్ద పెట్టేస్తాడు నాన్న. మళ్లీ నిన్ను తల్చుకోడు తాతయ్యా! నాన్నమ్మకిలాగే నీకూ ఆబ్దికాలు పెట్టడు... నీకు తెలుసుగా!’

“పంతులుగారూ! ఏమిటండి ఒక్క కాకి కూడా రావట్లేదు? అలా చోద్యం చూస్తూ, చెట్టు మీదే కూర్చున్నాయి. వీటిని కూడా బొట్టెట్టి పిలవాలి కాబోలు!” సుందరయ్య విసుక్కుంటూ తువ్వాలుతో అసహనంగా మొహం తుడుచుకున్నాడు.

ఒకటి... రెండు... మూడు... పది నిముషాలు దాటేసింది... ఒక్కటంటే ఒక్క కాకి దరిదాపులకి రాలేదు.

“మీ తండ్రిగారికి ఏదో కోరిక మిగిలిపోయినట్టుంది సుందరయ్యా!”

పంతులుగారి మాటలకి ఎవరి దగ్గర జవాబుంది?

శాలినికి అప్పుడు తట్టింది... ‘తాతయ్య ఆత్మకి ఆకలేస్తున్నా అన్నం దగ్గరకి రాలేదు!’

నెమ్మదిగా నాన్న దగ్గరకి వెళ్ళింది శాలిని... “పంతులుగారూ! తాతయ్యకు నేను పెట్టి చూస్తానండీ!”

పంతులుగారు ఆశ్చర్యపోయారు, ఇప్పటిదాకా ఆయన శాలినిలాంటి పిల్లని ఈ సందర్భంగా చూళ్ళేదు మరి. “తప్పమ్మా,

నువ్వు పెట్టకూడదు. కర్మ చేసిన వాళ్ళే పెట్టాలి!" అంటున్న పంతులుగారికి, ఆ అమ్మాయి కళ్ళలో ఏం కనిపించిందో మరి... "పోనీ నువ్వు వెళ్లి పిలిచి చూడు తల్లీ... కాకులు వస్తాయేమో!" అన్నారు.

అది చాలు శాలినికి! గబగబా చెట్టు కిందకు వెళ్లి, విస్తరికి అంత దూరాన కూర్చుంది.

"తాతయ్యా... రా తాతయ్యా... నీకు నేను దగ్గరుండి తినిపిస్తాను సరేనా! నాన్నలా వదిలెయ్యను... రా తాతయ్యా!" మనసు కొట్టుకుంటోంది.

ఆ కల్మషం లేని పిలుపుకి, దేవుడే వస్తాడు... తాతయ్య రాడా!

చూస్తుండగానే చెట్టు మీది కాకులు గబగబా విస్తరి ముందు వాలిపోయాయి. శాలినికి తాతయ్య ప్రసాదం తనే తిన్నంత ఆనందంగా అనిపించింది.

దూరంగా సుగుణమ్మ మూతివిరుపు ఎవరికీ కనపళ్లేదు. 'కాకి సావాసం యెక్కడికి పోతుందీ?'

# పెద్ద దిక్కు

దాసు శ్రీహవిష
✆ 8008706655

*"నేనూ అన్నయ్య స్కూల్‌లో చదువుతాను" అని ప్రణీత అడిగితే, "వాడంటే రేపు పెద్ద ఉద్యోగం చేయాలి, పెద్ద చదువులకి ఇంగ్లీషు రావాలి. నీకెందుకు కాన్వెంట్ చదువులు?" అంది మంగమ్మ.*
*"నేనూ ఉద్యోగం చేస్తా!" అంది ప్రణీత పౌరుషంగా.*
*"హా! చేస్తావు. మా డబ్బుతో చదివి, మా డబ్బుతో పెళ్ళి చేసుకొని, రేపు ఉద్యోగం చేసి, నీ మొగుడికి ఇస్తావు!" అంతే రోషంగా సమాధానం చెప్పింది బామ్మ.*

ఆ వార్త విన్న మంగమ్మగారి ఆనందానికి అవధులు లేవు. చిన్న వయసులోనే భర్త పోవడంతో అల్లారుముద్దుగా పెంచుకున్న ఒక్కగానొక్క కొడుకు సుందరంకి ఈ రోజు కొడుకు పుట్టాడు. కబురు అందుకున్నదే తడవుగా మహా హడావిడిపడుతూ బయల్దేరింది వియ్యాలవారింటికి! కోడలు పురిటికి వెళ్ళిన దగ్గర నుండి మంగమ్మ గారి ఎదురుచూపులు ఈ వార్త కోసమే.

తల్లి సంబరాన్ని చూసి సుందరం నవ్వుకుంటున్నాడు కాని, లోపల తనకూ అలానే ఉంది. మొదటిసారి తండ్రి అయ్యాడు, అందునా మగపిల్లాడు మరి. భార్యకి నెలలు నిండిన దగ్గర నుండి ఏ నిమిషాన ఏ వార్త వస్తుందో అని స్నేహితుడి దగ్గర కారు తెచ్చి పెట్టుకున్నాడు. కారులో గంట ప్రయాణం. అందుకే వెంటనే ప్రయాణం కట్టడం సాధ్యమైంది.

సుందరం అత్తారిల్లు వారి స్వగ్రామమైన రామాపురం. మంగమ్మ భర్త సుబ్బారావు, సుందరం మామగారు శంకరం చిన్ననాటి స్నేహితులు, దూరపు బంధువులు కూడా! సుబ్బారావు పోయేనాటికి సుందరం హైస్కూలు చదువుతున్నాడు. ఆయన పోయాక ఉన్న పంటపొలాల్ని శంకరానికి కౌలుకిచ్చి, పక్కనే టౌనులో తన తమ్ముడు ఏదో చిరు ఉద్యోగం చేస్తుండటంతో, పిల్లాడి పైచదువులకి వీలుగా ఉంటుందని అక్కడి వెళ్ళిపోయింది మంగమ్మ! ఆనాటి నుండి ప్రాణాలన్నీ కొడుకు మీదే పెట్టుకుంది. చదువు అయిపోతూనే చిన్నదే అయినా, ఊర్లు పట్టుకుని తిరిగే అవసరం లేని గవర్నమెంటు ఉద్యోగం దొరికింది. మంగమ్మ కాస్తో కూస్తో ఎవరినైనా నమ్మింది అంటే అది శంకరాన్నే. అందుకే తెలిసిన సంబంధమని ఆయన కూతురినే కోడలిని చేసుకుంది.

కారు దిగుతూనే, "ఏమే అమ్మాయి, ఎంత ప్రేమే ఈ అత్తగారి మీద! మా బంగారు తల్లే, ఏడీ... ఎక్కడా నా వంశాంకురం?" అంటూ కోడలిని గారాబం చేసి, మనవడిని ఎత్తుకొని తెగ మురిసిపోయింది.

మురిపెం తీరాక, తిరుగు ప్రయాణం అవుతూ, "రూపాయి కాసంత అగరు బొట్టు పెట్టి, సాయంత్రాలు రోజూ దిష్టి తీస్తూ ఉండండి ఒదినా నా మనవడికి!" అంటూ కారెక్కింది.

దారి పొడవునా పిల్లాడి పోలికల గురించి మాట్లాడుతుంటే, మనవడి మీద ఆవిడ ప్రేమ తెలుస్తోంది. అసలు కంటే వడ్డీ ముద్దు కదా మరి! పుట్టిన పిల్లాడి నక్షత్ర వివరాలు, ఆ నక్షత్రంలో పుట్టినవారు ఎలా ఉంటారు లాంటి గొప్పలన్నీ కొడుకుకి చెపుతూ ఉంది.

ఇంతలో సుందరం, “అమ్మా! నెలలోపే బాలసారె ఏదో కానిచ్చి పిల్లాడిని తెచ్చేసుకుందామా?” అని అడిగాడు సుందరం ఆవిడ ఆత్రాన్ని చూసి. “వద్దురా, పచ్చి బాలింత. మూడు నెలలు నిండే వరకు పిల్లాడికి, తల్లికి కూడా గాలి మార్పు, నీళ్ళ మార్పు మంచిది కాదు. కావాలంటే వేడుక చేసేసుకో, కాని మూడో నెలలోనే తీసుకొద్దాం!” అని తెగేసి చెప్పింది. సుందరానికి అమ్మ అంటే ప్రేమతో కూడుకున్న భయం. అమ్మని అడగకుండా ఏమీ చేయడు.

“ఇంతకీ ఏ పేరు పెడతావు? మా నాన్న పేరా? మీ నాన్నగారి పేరా?” మళ్ళీ అడిగాడు సుందరం.

“అంత మోటు పేరు పెడితే రేప్పొద్దున్న వాడు పెద్ద వాడయ్యాక ఆ పేరు పెట్టినందుకు నన్ను తిట్టుకోడూ! అలా ఏమీ వద్దు. నక్షత్ర నామమేదో బియ్యంలో రాసేసి, ఈ తరానికి తగ్గట్టు మంచి వ్యవహారిక నామం పెట్టరా! అయినా పెద్దవాళ్ళ పేర్లు పెట్టుకోనంత మాత్రాన వాళ్ళ దీవెనలు ఉండ వేంట్రా!” అంది.



“సరే అమ్మా, నీ ఇష్టం, నువ్వెలా అంటే అలా” అన్నాడు సుందరం.

పిల్లాడికి ‘ప్రదీప్’ అని పేరు పెట్టి ఘనంగా బాలసారె జరిపించి, మూడో నెల పడ్డాక, కోడలిని, పిల్లాడిని ఇంటికి తీసుకొచ్చిన నాటినుండి మంగమ్మగారికి మనవడే లోకం. చాలా గారాబం చేసేది.

మరో రెండేళ్ళకి కోడలు మళ్ళీ పురిటికని పుట్టింటికి వెళ్ళింది, కాని మొదటి కాన్పుకి చేసిన హడావిడి లేదు. పుట్టింది ఆడపిల్ల అవడంతో ఏ సంబరమూ లేదు. నెలలోపే భార్య గౌరిని తీసుకొచ్చాడు సుందరం. కారణం ఏంటీ అంటే మంగమ్మగారు మనవడిని విడిచి ఉండలేకపోతోందిట. బాలసారె కూడా ఇరవై ఒకటో రోజు పేరంటంతో పాటే చేసి ‘ప్రణీత’ అని పేరు పెట్టారు.

రెండో పిల్ల పుట్టాక అత్తగారిలో మార్పు త్వరగానే అర్థం చేసుకుంది గౌరి. పిల్లాడు, పిల్ల అని ఆడ, మగ అంటూ వ్యత్యాసం చూపించేది మంగమ్మగారు. గౌరి మాత్రం పసి మనసు నొచ్చుకోకుండా చూసుకునేది. మంగమ్మ గారి అతి గారాబం వల్ల పిల్లాడు కాస్త మొండిగా తయారవ్వడం గమనించినా, తల్లిగా ఏమి చేయలేకపోయేది. బామ్మా మనవళ్ళదే రాజ్యం. వారికి ఎవరూ ఎదురు చెప్పేవారు కాదు.

పిల్లల చదువు విషయంలో కూడా తేడా చూపించేది మంగమ్మ. మగపిల్లాడిని కాన్వెంటులో వేసి, ఆడపిల్లని మాత్రం గవర్నమెంటు వారి ఆడబడిలో వేయించింది. ఏమన్నా అంటే, "రేపు బోలెడు కట్నాలవీ ఇచ్చి పెళ్ళి చేయద్దూ, మరి ఖర్చు తగ్గించాలి కదా!" అనేది.

కాస్త ఊహ తెలిసాక,"నేనూ అన్నయ్య స్కూల్‌లో చదువుతాను"అని ప్రణిత అడిగితే, "వాడంటే రేపు పెద్ద ఉద్యోగం చేయాలి, పెద్ద చదువులకి ఇంగ్లీషు రావాలి. నీకెందుకు కాన్వెంట్ చదువులు?" అంది మంగమ్మ.

"నేనూ ఉద్యోగం చేస్తా!" అంది ప్రణిత పౌరుషంగా.

"హా! చేస్తావు. మా డబ్బుతో చదివి, మా డబ్బుతో పెళ్ళి చేసుకొని, రేపు ఉద్యోగం చేసి, నీ మొగుడికి ఇస్తావు!" అంతే రోషంగా సమాధానం చెప్పింది బామ్మ.

వారిద్దరూ వాదించుకుంటూ ఉంటే, "ఊరుకో అమ్మా, నువ్వు కూడా ఏంటి చిన్నపిల్లతో" అంటూ సుందరం కలగచేసుకుని, "గౌరీ! ప్రణితకి సర్ది చెప్పు, ఇంకోసారి ఇలా మాట్లాడొద్దని!" అరిచాడు.

గౌరికి ఎవరికి చెప్పాలో అర్థం కాలేదు. కాని జరుగుతున్నది నచ్చలేదు. తన పుట్టింట్లో ఏనాడు ఇలా ఆడ, మగ అన్న భేదం విని ఎరగదు. పిల్లకి ఎలా సర్ది చెప్పాలో తెలీక చాలా సతమతమయ్యేది. ఇలా పిల్లలిద్దరి మధ్య చాలా దూరం పెరిగింది, పెంపకంలో చాలా వ్యత్యాసం పెరుగుతూ వచ్చింది. అన్నాచెల్లెలు అన్న ప్రేమ లేదు. ప్రదీప్, ప్రణితని చాలా చిన్న చూపు చూసేవాడు. ప్రణిత అన్నయ్యని ఒక శత్రువులా చూసేది.

ప్రదీప్ పైచదువులకి చాలా ఖర్చు చేసి పట్నం పంపారు. ప్రణితని చదువు మాన్పించమని మంగమ్మగారి పోరు. 'కుదరదు చదివి తీరుతా' అని ప్రణిత. ఆమె పోరు పడలేక దూరవిద్యలో డిగ్రీ కట్టించాడు సుందరం. ఇంతలో 'పెళ్ళి చేస్తే దీని గోల తప్పుతుంది' అని మంగమ్మ సుందరానికి సలహా ఇచ్చింది. అది తెలుసుకొని గౌరి చాలా బాధ పడింది. కాని నోరు మెదిపి తన అభిప్రాయం చెప్పే ధైర్యం లేదు.

మంగమ్మ బయట సంబంధం అంటే కట్నాలు ఎక్కువ ఇచ్చుకోవాలని, ప్రణితను శంకరం మనవడికి మాట్లాడమంది. గౌరికి ఇది కాస్త ఊరట కలిగించింది. జబ్బు చేసి అమ్మ, వదిన వెంటవెంటనే పోతే, ఆ ఇంటి మగవాళ్ళే ఆడపని, మగపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇక్కడ ఉంటే పిల్లని ఇలానే బాధ పెడతారు అని ప్రణితకి నచ్చచెప్పే ప్రయత్నం చేసింది.

"అది పల్లెటూరని ఆలోచిస్తున్నావేమో, ఇక్కడ కన్నా నాగరికత చాలా ఎక్కువ అక్కడ. నా మాట విని పెళ్ళికి ఒప్పుకో. మా అన్నయ్యతో నేను మాట్లాడుతాను. ఇప్పుడేమీ అర్థం కాకపోయినా, పెళ్ళి తరవాత నీకు నేను చెప్పేవి అన్నీ అర్థం అవుతాయి!" అని పెళ్ళికి ఒప్పించింది.

గౌరి అన్నయ్య దివాకరానికి ఒక్కడే కొడుకు. పేరు దినేష్. ప్రదీప్ కంటే నాలుగేళ్ళు పెద్దవాడు. ఊళ్ళో తాత వ్యవసాయ భూములు చూసుకోవడం, టౌన్లో తండ్రి ఎరువుల దుకాణం చూసుకోవడంతో పాటు చక్కగా చదువుకొని బ్యాంక్ ఉద్యోగం చేస్తున్నాడు. అనుకున్నదే తడవుగా ప్రణిత, దినేష్‌ల పెళ్ళి జరిగిపోయింది.

కొత్త కాపురానికి వెళ్ళిన ప్రణితకి అత్తవారింట్లో అంతా కొత్తగా తోచింది. పెళ్ళైన ప్రతి అమ్మాయికి ఇది సహజమేమో కాని, ప్రణిత పరిస్థితి వేరు. చిన్నతనంలోనే తల్లిని పోగొట్టుకున్న దినేష్ కాని, వారి నాన్నగారు కాని, తాతగారు కాని మగ అహంకారమంటూ లేకుండా, ఆడ, మగ భేదము లేకుండా, ఇంటి పనంతా చేసుకునిపోతున్నారు. పదహారు రోజుల పండగ వరకూ ప్రణితని ఏ పనీ చేయనీయలేదు. ప్రణిత మరో కొత్త ప్రపంచంలో అడుగుపెట్టింది. ఈ ఇంటిలోకి తనని ఎంతో ప్రేమగా, మర్యాదతో ఆహ్వానించారు.

వరసకి మేనమామే అయినా, ఇరు కుటుంబాల మధ్య రాకపోకలు లేవు. దానికి కారణం కూడా ఇదే. మంగమ్మగారికి గౌరి పుట్టింటి పద్ధతి నచ్చేది కాదు. ఎక్కడ ఈ ఇంటి మగవారిని వారు అలా మార్చేస్తారో అని ఆవిడ భయం. దానితో రాకపోకలు లేకుండా చేసింది. అందుకేనేమో, మంగమ్మ తనని ఎప్పటికీ వంటింటికి అంకితం చేయాలని ఈ సంబంధం చేసింది అని అనుకుంది ప్రణిత. కాని జరిగింది వేరు. వారి ఆలోచన, జీవనశైలి వేరు.

నెలలోపే దినేష్, ప్రణితలు పట్నంలో కాపురం పెట్టారు. అదే ఊరిలో పెద్ద చదువులకని హాస్టల్‌లో ఉంటున్నాడు ప్రదీప్. పెద్దగా ప్రేమలు లేని కారణంగా, ఒకే ఊరిలో ఉన్నా కూడా వారిరువురికీ రాకపోకలు తక్కువే.

చదువు మధ్యలోనే పెళ్ళి చేసేసారనే కోపంతో ప్రణితకి పుట్టింటికి వెళ్ళాలనే కోరిక ఉండేది కాదు. వెళ్ళిన దగ్గర నుండి బామ్మ తీసే ఆరాలకి, సమాధానం చెప్పడం ఇష్టం లేక కూడా పండగలకి వెళ్ళినా ఒక పూటకి మించి ఉండేది కాదు.

ఒక రోజు దినేష్ ప్రణితని కాలేజ్ కి తీసుకెళ్ళి చేర్పించాడు. పెళ్ళికి ఒప్పించడానికి అమ్మ ఏదో చెప్పిందనుకున్న ప్రణితకి ఇది చాలా ఆశ్చర్యంగా అనిపించింది. “ఆఖరి సంవత్సరమైనా కాలేజికి వెళ్ళి చదువుకుంటే రేపు ఏ ఉద్యోగం కోసమైనా బయటకి వెళ్ళవలసి వస్తే, నీకు బయట ప్రపంచం అలవాటు అవుతుంది. ఇది నీకు చాలా అవసరం. ఇప్పటి దాకా నువ్వు చూసిన ప్రపంచం వేరు కదా” అని చెప్పాడు దినేష్.

తన భవిష్యత్తు గురించి ఏ ఒక్కరూ ఇంత చక్కగా ఆలోచించింది లేదు. భర్తలు ఇలా కూడా ఉంటారా అని ఆశ్చర్యపోయింది. డిగ్రీ పుస్తకాలతో పాటు దినేష్ పోటీ పరీక్షలకి అవసరమయ్యే అన్ని పుస్తకాలు ఇచ్చి చదివించేవాడు. వారి మధ్య చక్కని స్నేహంతో కూడుకున్న బంధం ఏర్పడింది.

ఒక రోజు దినేష్ ఇంటికి వస్తూ ప్రదీప్‌ని వెంటపెట్టుకొచ్చాడు. ప్రణిత ప్రదీప్‌ని అలా చూడటం మొదటిసారి. బాగా తాగేసి ఉన్నాడు. ఏమీ తెలియని స్థితిలో ఉన్నాడు. ప్రణితకి తన అన్న సంగతి కాస్త చూచాయగా తెలుసు. చదువు అంతంత మాత్రమే అని, ఖర్చు ఎక్కువ పెడతాడని. కాని ఇలా వ్యసనపరుడు అని తెలిసి చాలా బాధ పడింది. నాన్న వాడి చదువుకని ఉన్న పొలాలన్నీ అమ్మేసిన విషయం గుర్తొచ్చింది. ఇలా అడపాదడపా జరుగుతూనే ఉంది. ప్రదీప్‌ని మందలించే ధైర్యం ఇంట్లో ఎవరికి లేదు. అతి గారాబంతో వాళ్ళు పోగొట్టుకున్నది ఆస్తి మాత్రమే కాదు, వాడి మీద ప్రేమ కూడా. ఇంటిల్లిపాదీ వాడి మీద పెట్టుకున్న ఆశలు కళ్ళ ముందు కూలిపోతున్నట్టు తోచింది.

ప్రణిత మాత్రం దొరికిన ప్రతి అవకాశాన్ని వదులుకోకుండా అన్ని పోటీ పరీక్షలు రాస్తూ పోతోంది. ప్రథమ శ్రేణిలో, మంచి మార్కులతో డిగ్రీ పాసయ్యింది. ‘శుభవార్త’ అంటూ పుట్టింటికి వెళ్ళిన ప్రణిత దంపతులని మామ్మగారు, “చాలా సంతోషం, చక్కని మగబిడ్డ పుట్టాలి,” అంటూ దీవించింది.

"అయ్యో మామ్మగారూ, శుభవార్త అంటే అది కాదు, ప్రణిత డిగ్రీ పాసయ్యింది. గవర్నమెంటు ఉద్యోగాలకి పరీక్ష రాసింది. నేడో రేపో చక్కని ఉద్యోగం కూడా వస్తుంది." అని చెప్పాడు దినేష్.

"ఏంటబ్బాయ్? పిల్లని ఉద్యోగానికి పంపుతావా? దానికేం తెలుసని? దానికంటే మతి చెడింది, నీకేమైంది? ఊళ్ళో వయసైన తాతగారిని, మీ నాన్నగారిని చూసుకోనక్కరలేదా?" అంటూ చెప్పుకుంటూపోతుంటే మధ్యలో వారించి, "నాన్నగారు కాని, తాతయ్య కాని ఈ విధంగా ఆలోచించరండి. మాకు కొన్ని సంవత్సరాల నుండి అలవాటేగా! అంతగా అవసరం వచ్చిననాడు ఆలోచించవచ్చు. దాని కోసం ప్రణిత చదువు ఎందుకు వృధా పోవాలి?" అని సమాధానమిచ్చాడు. గౌరి లోలోపల చాలా ఆనందపడింది.

రెండు నెలల తరువాత, ఒక రోజు సుందరం గుండెపోటుతో మరణించాడన్న వార్త విని ప్రణిత గుండె పగిలిపోయింది. చూస్తుండగానే అన్ని కార్యక్రమాలు అయిపోయాయి. అసలు ఎలా జరిగింది అని అడిగిన ప్రణితతో గౌరి, "ఒక రోజు ఇంటి మీదకి కొందరు రౌడీలు వచ్చి గొడవ చేసారు. ప్రదీప్ వాళ్ళ దగ్గర పెద్ద మొత్తంలో డబ్బు అప్పు చేసాడట. తీర్చమంటే తప్పించుకుని తిరుగుతున్నాడు అని చెప్పారు. వాడి చదువు కోసం ఆస్తులన్నీ ఎప్పుడో కరిగిపోయాయి. ఊళ్ళో పరువుపోతుంది అని వాడిని వేడుకొని వాళ్ళ అప్పు కింద ఇల్లు రాసిచ్చారు. వాడు చేజారిపోయాడని, వ్యసనపరుడు అయ్యాడని తెలిసిన మీ నాన్నగారు ఆ దిగులుతో..." అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది.

"మమ్మల్ని ఏదో ఉద్ధరిస్తాడు అనుకుంటే నిలువ నీడ లేకుండా చేసాడు వీడు!" అని మంగమ్మ కూడా మొదటిసారి మనసులో బాధ పంచుకుంది.

దినేష్ ఆ కుటుంబ బాధ్యత తీసుకొని ఒక నిర్ణయానికి వచ్చాడు. బామ్మని, గౌరిని వాళ్ళ ఊరికి తీసుకెళ్ళాడు. ప్రణితకి పెద్ద బ్యాంక్‌లో ఉద్యోగం వచ్చింది. సంతోషంగా ఆ వార్త చెప్పిన ప్రణితని మెచ్చుకోలుగా చూస్తూ, "ఆడపిల్లకి చదువెందుకన్న నాకు, భగవంతుడు చక్కని గుణపాఠం చెప్పాడే పిల్లా. ఇప్పుడు నువ్వే మగదిక్కయ్యావు ఇంటికి" అని అంటున్న బామ్మగారిని వారించి, దినేష్ "మగదిక్కు కాదు మామ్మగారు, 'ఆడదిక్కు' ఇంకా చెప్పాలంటే 'పెద్దదిక్కు,'" అన్నాడు గర్వంగా ప్రణితని చూస్తూ!

చేసిన తప్పులని తెలుసుకొని పశ్చాత్తాపపడ్డ ప్రదీప్, వారి సహాయానికి కృతజ్ఞతలు చెప్పి, తన తప్పు దిద్దుకుంటానని బావగారు ఎలా చెప్తే అలా చేస్తానని మాట ఇచ్చాడు.

ఇంతలో మంగమ్మ "నేను కూడా ఒక నిర్ణయానికి వచ్చాను. గౌరి, నేను మీ ఊళ్ళో మీ ఇంటికి దగ్గర ఇల్లు తీసుకుని ఉంటాము. మీ అమ్మమ్మ, అత్తయ్య పోయాక ఏనాడూ నేను మీ అమ్మని తన పుట్టింటికి పంపింది లేదు. నేడు ఒకరి అవసరం ఒకరికి ఉంది. ఒకరికి ఒకరం సాయంగా ఉంటాము. మేమంతా ఒకే ఊరిలో ఉంటే, మీకు తీరినప్పుడు మీరే మా దగ్గరకి రావచ్చు. మాకు అదే సంతోషం!" అన్న మంగమ్మగారి మాటకి అందరు సరే అన్నారు.

# కీర్తి సువాసనల పరిమళం

నల్లబాటి రాఘవేంద్రరావు
✆ 9966212386

***మనం ఒక చెట్టు నాటడం ముఖ్యం కాదు. అలాగని.. దానికి నీళ్లు పోసి పెంచి పోషించడం అది కూడా ముఖ్యం కాదు! మనకుఆ పని చేయడానికి వీలు కానప్పుడు.. ఆచెట్టు పట్ల మనం నెరవేరుస్తున్న'బాధ్యత'ని ఆపకుండా, దీక్షతో నిర్వహించే వారసుడిని గానీ, వారసురాలిని గానీ నియమించడంముఖ్యం!***
***అదే అతి ముఖ్యం!***

సత్యకీర్తి గొప్ప సాహితీవేత్త!

ఎన్నో గ్రంథాలు రాసి ఎన్నో అవార్డులు, రివార్డులు, సత్కారాలు కూడా పొందిన దిట్ట. అతను రచించి ప్రచురించిన మహోన్నత గ్రంథాలు రమారమి రెండువందల వరకూ ఉంటాయి. అవన్నీ అతని ఇంటిలో తనకోసం కేటాయించుకున్న రెండు గదుల్లో, పాతకాలం నాటి టేకు బీరువాల్లో అమర్చుకున్నాడు. అలాగే తన పిల్లలు జయేంద్ర, లలితశ్రీ. వాళ్ళిద్దరికీ చెరో గది ప్రత్యేకంగా కేటాయించాడు. అయితే ఇంట్లో ఎవరిని, తన పుస్తకాలు భద్రపరచుకున్న గదుల్లోకి మాత్రం వెళ్లనివ్వడు. కుటుంబం కన్నా పుస్తకాలని అంతలా ప్రేమిస్తాడు అతను.

ఇప్పుడు అతను ఓ మహాగ్రంథం వ్రాస్తూ, తనకన్నా ఘనాపాటి గ్రంథకర్తల స్ఫూర్తి వాక్యాలు, అందులో పొందుపరిచి, ఆ గ్రంథాన్ని ముద్రించాలని అనుకున్నాడు. అందుకోసం తనకు దైవసమానులు, గురుతుల్యులువంటి వారిని కలిసి, కావలసిన విషయ సేకరణ పొందాడు.

తను హైస్కూల్ లో చదువుకునేటప్పటి తన తెలుగు మాస్టారు, విశిష్ట గ్రంధకర్త అయిన ప్రభాకరంగారంటే తనకు చాలా గౌరవంతో, ఆయన్ని కలవడానికి ఆయన ఉంటున్న చెల్లూరు గ్రామం బయలుదేరాడు.

ప్రభాకరం గారికి తొంబైఏళ్లు వయస్సు పైబడి ఉంటుంది. ఆయన సామాన్యమైన వ్యక్తి కాదు. దేశ విదేశాల్లో సైతం ఆయన సన్మానాలు, సత్కారాలు పొందారు. అన్ని దేశాలలోనూ ఈయనకు అభిమానులు ఉన్నారు. లెక్కకు మించిన బిరుదులు పొందారు.


తనొచ్చిన విషయం వివరంగా వివరించి ఆయనను ప్రసన్నం చేసుకున్నాడు సత్యకీర్తి.

తన శిష్యుడు చెప్పింది విని అతని మీద అభిమానంతో కాదనలేక, నీరసంగా అడుగులు వేసుకుంటూ లోపల కెళ్లి తను రచించిన కట్టలు కట్టబడి ఉన్న పాత, కొత్త గ్రంథాలన్నీ జాగ్రత్తగా ఏరిఏరి, దుమ్ము దులుపుతూ, చివరికి ఓ గ్రంథం చేతులతో పట్టుకుంటూ బయటకు వచ్చారు.

''సత్యకీర్తి! ఇది నేను రాసిన గ్రంథం నాయనా! ఇది ఎప్పుడో ఇరవై ఏళ్ల క్రిందట ప్రచురింపబడింది. నువ్వు కూడా చాలా గ్రంథాలు రాశావు కదా. నువ్వు సామాన్యుడివి కాదు. నీ గురించి నాకు తెలుసు. అయితే నువ్వే నా శిష్యుడు అని మాత్రం

ఇంతవరకూ తెలియదు. నా శిష్యుడు ఇంత గొప్పవాడు అయినందుకు నాకు చాలా గర్వంగా ఉంది నాయనా. చాలా సంతోషం!'' అంటూ, ఆయన చాలా పేజీలు తిరగేసి ' దొరికింది' అంటూ ఒకచోట ఆగారు.

''సత్యకీర్తీ! 'విజ్ఞానసాగరం' అని నేను రాసిన ఈ ఆధ్యాత్మిక గ్రంథములోని, ఈ రెండు పేజీల ముఖ్యమైన అంశాన్ని నీకు ఇస్తాను. అందులోని కొన్ని విషయాలు, నువ్వు ఇప్పుడు రాస్తున్న గ్రంథంలో ఎక్కడైనా అన్వయించుకోవడానికి బాగా ఉపయోగపడతాయి. దాంతో నీ గ్రంథానికి బలం వస్తుంది. నా శిష్యుడు అయిన నీకు సహాయపడ్డ తృప్తి నాకు కలుగుతుంది. నువ్వు వచ్చింది దీనికోసమే... నేను చదువుతాను. నువ్వు రాసుకో నాయనా!'' అంటూ చదవడం ఆరంభించారు మాస్టారు.



''చాలా ఆనందం మాస్టారు! ఈ మీ విజ్ఞానసాగరం గ్రంథంలో నాకు పనికి వచ్చే ఈ రెండు పేజీలు రోడ్డు అవతలకు వెళ్లి ఫోటోస్టాట్ తీయించుకుని.. పదినిమిషాలలో మీ గ్రంథం మీకు పట్టుకుని వచ్చి ఇస్తాను. మీకు చదివే శ్రమ ఇవ్వడం నాకు ఇష్టం లేదు... పైగా నాకు కూడా చాలా లేట్ అవుతుంది. ఆ గ్రంథం ఒకసారి ఇవ్వండి మాస్టారు...'' అంటూ వినయంగా అడిగాడు సత్యకీర్తి.

''పుస్తకం ఎవరికీ ఇవ్వను నాయనా! నీ సెల్ కెమెరాతో కాపీ వస్తుందేమో... ప్రయత్నించరాదూ.''

"అలారాదు మాస్టారు. నాది చిన్న సెల్. ఈ కెమెరాతో బాగా రావు!"

"ఏమీ అనుకోవద్దు నాయనా. ఇదిగో పేపరు, పెన్ను! వ్యాసం చదువుతాను రాసుకో..." అంటూ చదవడం ఆరంభించారు ప్రభాకరం గారు. సత్యకీర్తి రాసుకున్నాడు.

'వయసు పైబడినా, సాటిమనిషి మీద నమ్మకం లేని బ్రతుకు ఎందుకు?' అని మాస్టారుని ఒకపక్క మనసులో చీదరించుకుంటూ, మరోపక్క పుస్తకాల పట్ల ఆయనకున్న వాత్సల్యానికి పొగడకుండా ఉండలేకపోయాడు సత్యకీర్తి.

ఆయన పుస్తకాలను బీరువాల్లో, అలమరలలో చక్కగా పేర్చలేక, కట్టలుకట్టి పోగులుగా పడేశారు. కొన్నిబూజులు పట్టి ఉన్నాయి.. మరికొన్ని అట్టలు ఊడిపోయి ఉన్నాయి. ఏ పుస్తకం కావాలంటే ఆ పోగులో వెతుక్కోవాల్సి వస్తుంది. వందలాది మహత్తరమైన గ్రంథాల పట్ల ఎందుకు మాస్టారు సరైన శ్రద్ధ తీసుకోలేకపోయారు. వయసు భారమే అయ్యుండొచ్చు. పోనీ ఆయన కుటుంబ సభ్యులు... ఏమో వారి సమస్యలు ఏమిటో... కిటికీలోంచి పుస్తకాలు ఉన్న గదులను పరికిస్తూ బాధపడ్డాడు సత్యకీర్తి.

"ఈ నా విజ్ఞానసాగరం పుస్తకం ఇప్పుడు ఎక్కడ అమ్మటం లేదని తెలిసింది నాయనా! ఏ కారణం చేతనైనా ఈ పుస్తకం పోతే మళ్లీ నేనే కొనుక్కుందాం అనుకున్నా దొరకదు కదా... అందుకనే ఎవరికీ ఇవ్వటం లేదు! మిగిలిన అన్ని పుస్తకాలలోకి ఈ పుస్తకం నా ప్రాణం. మరో విషయం... నీకు వినిపించిన ఈ రెండు పేజీలలో, చివరన ఉన్న ఖాళీలో... ఈరోజు జరిగింది క్లుప్తంగా రాసి తారీకు కూడా వేసి సంతకం పెట్టుకుంటాను. ఇది నా అలవాటు! ఇంకోమాట... వయసు పైబడిన వాడిని కదా, నీ పుస్తకావిష్కరణకు రాలేను. నువ్వు నీ గ్రంథం ప్రింట్ చేశాక, వీలు పడితే ఓ పుస్తకం పోస్టులో పంపు!" అంటూ మాస్టారు ప్రభాకరంగారు తన పుస్తకాన్ని లోపలకు తీసుకెళ్ళి పోయి భద్రపరుచుకున్నారు.

మరో నెల రోజులలో సత్యకీర్తి... కొత్తగా వ్రాసిన పుస్తకం ఆవిష్కరణ జరిగింది. అందులో ప్రభాకరం గారి గ్రంథంలో నుంచి సేకరించిన విషయాలని, సందర్భానుసారంగా వాడుకుని, అందులో వారికి కృతజ్ఞతలు కూడా చేర్చాడు. పుస్తకావిష్కరణ జరిగిన తర్వాత. ప్రభాకరం గారు కోరినట్టు ఆయనకు కూడా ఒక పుస్తకం బుక్‌పోస్టులో పంపాడు.

మూడు నెలలు గడిచిపోయింది. తన పుస్తకం గురించి, ప్రభాకరంగారి నుంచి ఉత్తరం వస్తుందని ఆశించిన సత్యకీర్తి... రాకపోవడంతో ఆయన్ని కలవడానికి చెల్లూరు బయలుదేరాడు.

చెల్లూరు ఊర్లో దిగి, అక్కడే ఓ చిన్న బడ్డీకొట్టు దగ్గర ఆగాడు సత్యకీర్తి.

"ఓ రెండు మసాలా గారెలు ఇవ్వవోయి" అడిగాడు బడ్డీకొట్టు అతన్ని.

బడ్డీవాడు పక్కనున్న దళసరి బైండ్ పుస్తకం లోంచి రెండు పేజీలు చింపి, అందులో రెండు మసాలాగారెలు కొంచెం చెట్నీ వేసి, ఇచ్చాడు.

సత్యకీర్తి బడ్డీవాలా అందించిన మసాలాగారెలు తింటూ, ఆ కాగితాల మీద ఉన్న అక్షరాలు స్పష్టంగా కనబడటంతో చదవనారంభించాడు ఆత్రుతగా.

"ప్రతి మనిషి.... జాగ్రత్తగా విని, గుండె పుటల్లో చెక్కుకోవలసిన చివరిమాట ఒకటే! మనం ఒక చెట్టు నాటడం ముఖ్యం

కాదు. అలాగని... దానికి నీళ్లు పోసి పెంచి పోషించడం అది కూడా ముఖ్యం కాదు! మనకు ఆ పని చేయడానికి వీలు కానప్పుడు... ఆ చెట్టు పట్ల మనం నెరవేరుస్తున్న 'బాధ్యత'ని ఆపకుండా, దీక్షతో నిర్వహించే వారసుడిని గానీ, వారసురాలిని గానీ నియమించడం ముఖ్యం! అదే అతి ముఖ్యం!

కంటి కన్నా... కనురెప్పముఖ్యం! ఆ కనురెప్పకు కంటిని రక్షించే బాధ్యత, మనిషి అప్పచెప్పకపోతే కన్ను చీకటైపోతుంది!"

ఆ వాక్యాలు చదివి ఆశ్చర్యం నుంచి తేరుకోలేక పోయాడు సత్యకీర్తి.

చూస్తే... బడ్డీవాడి దగ్గర ఉన్న బల్లమీద తెలుగు మాస్టారి 'విజ్ఞానసాగరం' గ్రంథం జీర్ణావస్థలో ఉంది.

ఆ పుస్తకంలో నుంచి చాలా కాగితాలు చింపి అతను మసాలాగారెలు పొట్లాలు కడుతున్నాడు. ఇంకొన్ని పేజీలు మాత్రమే మిగిలి ఉన్నాయి.

విచిత్రం ఏమిటంటే... తను చేతిలో పెట్టుకు తింటున్నమసాలాగారెల పేపర్లో, బాగా దిగువన ప్రభాకరం గారి సంతకం కూడా ఉంది. ఇదివరలో తను ఆయన్ని కలిసినప్పుడు, ఆ రోజు తనతో జరిగిన సంఘటన... పేపరు దిగువ ఖాళీలో తన స్వహస్తాలతో ఆయన తారీఖుతో సహా సింపుల్‌గా రాసి... క్రింద పెట్టిన సంతకమే!

ఈ రెండు పేజీలలోని వాక్యాలే సత్యకీర్తి తన గ్రంథంలో పెట్టుకోవడం కూడా జరిగింది.

ఎంత చిత్రం? మాస్టారి ఇంట్లో నుండి బయటకు పట్టుకు వెళ్లడానికి తనకు ఓ ఐదు నిమిషాలు ఇవ్వడానికి నిరాకరించిన ఒరిజినల్ గ్రంథం పేపర్ కటింగ్లోనే తను మసాలాగారెలు తినటమా?

సత్యకీర్తి... వెంటనే మసాలాగారెలు కింద పడేసి పరుగులాంటి నడకతో ప్రభాకరం గారి ఇంటికి వెళ్ళాడు. ఆ ఇల్లు తాళం వేసి ఉండటంతో ఇరుగు పొరుగువారిని విచారించాడు.

తెలుగు మాస్టారు పద్మప్రభాకరంగారు నెలక్రితం చనిపోయారట! అతని కొడుకులు, కోడళ్ళు, కూతుళ్ళు, అల్లుళ్ళు ఇతర దేశాల్లో పెద్ద పెద్ద ఉద్యోగాల్లో వెలిగిపోతున్నారట!

ఆయన కాలం చేయడంతో కర్మకాండలు అయిన వెంటనే, ఆ ఇంటిని అమ్మేసి, కొడుకులతో పాటు ఆయన భార్య కూడా అమెరికా వెళ్ళిపోతూ, తమతో పాటు ప్రభాకరం గారి పుస్తకాలన్నీ తీసుకెళ్లలేక, కొడుకులు కూడా ఆ పుస్తకాలను చీదరించుకుని చిరాకుపడినట్టు కనబడటంతో... తూకానికి చిత్తుకాగితాల వాడికి ఆయన పుస్తకాలని అమ్మేసిందట!

అలా వచ్చిపడిందన్నమాట! మసాలా గారెల బడ్డీకొట్టులోకి ఆయన 'విజ్ఞానసాగరం' గ్రంథం!

ఈ విషయం గ్రహించిన సత్యకీర్తి, మరొక్కక్షణం అక్కడ ఉండలేక వెంటనే తన ఊరు వచ్చి, ఇంటికి వెళ్లి ఆత్రుతగా తన పిల్లలిద్దర్నీ పిలిచాడు.

"ఇన్నాళ్లు మీరిద్దరూ నా రూముల్లోకి వస్తుంటే .. 'వద్దు' అనే వాడిని! నా గ్రంథాలు మీరు చదువుతుంటే... 'మీ చదువు ఏదో మీరు చదువుకుంటూ గొప్పవాళ్ళుకండి. నా పుస్తకాల జోలికి రాకండి' అంటూ కసురుకునే వాడిని! నేను తప్పుచేశాను. నాకిప్పుడు జ్ఞానోదయమయింది. గతం గతః... ఇప్పుడు మీ ఇద్దరికీ చిన్న పరీక్ష పెడుతున్నానర్రా'' అన్నాడు, పిల్లలు ఇద్దరి వైపు చూస్తూ సత్యకీర్తి.

పిల్లలిద్దరికీ విషయం అర్థం కాలేదు.

సత్యకీర్తి తను రాసిన గ్రంథాలు ఉన్న చెరో రూమ్ లోకి ఆ ఇద్దరినీ విడివిడిగా పంపిస్తూ... ఒకరోజు గడపమన్నాడు. ఆ సమయంలో తను రచించిన పుస్తకాలు మాత్రమే చదవడానికి ప్రయత్నించమని అన్నాడు. 'ఎవరు ఎక్కువ పుస్తకాలు చదువుతారో దాన్నిబట్టి నేను ఒక నిర్ణయానికి కూడా వస్తాను' అంటూ చెప్పాడు.

ఒక్కసారిగా సత్యకీర్తి మనసు తేలికపడింది. ఎక్కువ పుస్తకాలు చదివిన వారికి పుస్తకాలమీద ప్రీతి ఎక్కువగా ఉన్నట్టు నిర్ణయించి, వారికి తన కీర్తిప్రతిష్టలకు సంబంధించిన పుస్తకాల ఆస్తి బాధ్యత అప్పచెప్పాలన్నది అతని ఉద్దేశ్యం.

తను ఇచ్చిన సమయం గడిచాక సత్యకీర్తి వాళ్లు ఉన్న రూముల్లోకి వెళ్ళాడు.

ఇంజనీర్ చదువుతున్న జయేంద్ర వెళ్ళిన రూమ్ లోని పుస్తకాలు... ఇదివరకటిలా సక్రమంగా కాకుండా చాలా చిందరవందరగా పడి ఉన్నాయి. అతడిని పిలిచి అడగగా... మూడు పుస్తకాలు చదివేసినట్టు గర్వంగా చెప్పుకున్నాడు... తక్కువ పేజీల పుస్తకాల గురించి వెతకటంతో, చిందరవందరగా పడున్న పుస్తకాల్ని మళ్లీ పేర్చడానికి సమయం సరిపోలేదని చెప్పాడు తండ్రితో!

ఇక... కూతురు లలితశ్రీ మెడిసన్. ఆమె ఒక పుస్తకం మాత్రమే చదివిందట. సత్యకీర్తి కోపంగా ఆమె గడిపిన గదిలోకి వెళ్లి అంతా పరికించాడు. అయితే. ఆమె చెప్పిన విషయం తెలుసుకొని ఆశ్చర్యపోయాడు.

లలితశ్రీ ముందుగా తనకు తండ్రి ఇచ్చిన రూమ్‌లో బీరువాలో, అలమరలో ఉన్న పుస్తకాలు సక్రమమైన పద్ధతిలో పెట్టింది. దుమ్ము దులిపి, రూమంతా శుభ్రం చేసింది. పుస్తకాలు చెదలు పట్టకుండా ఉపయోగించడానికి రూమంతా స్ప్రే చేసింది. కొన్ని పుస్తకాలు చిరుగు పడితే, జిగురు తీసి అంటించి ఆరబెట్టింది. ఇవన్నీ చేయడంలో తను కేవలం ఒక పుస్తకం మాత్రమే చదవగలిగానని, సమయం చాలలేదని, తనను క్షమించమని చేతులు కట్టుకు కోరింది తండ్రిని.

దాంతో ఒక నిర్ణయానికి వచ్చిన సత్యకీర్తి కుమార్తె లలితశ్రీని దగ్గరగా తీసుకొని నుదుటిపై ముద్దాడి

''అమ్మా... లలితశ్రీ మా తెలుగు మాస్టారు చనిపోయి నాకొక 'జీవిత రహస్యం' పాఠంలా నేర్పారు. తన ఆస్తులనే కాదు తన కీర్తి ప్రతిష్టలను కూడా వెనుక ఉన్నవారు నిలుపగలిగేలా రక్షించగలిగేలా ఎవరో ఒకరిని తయారు చేసుకోవడం ప్రతి మనిషికి చాలా ముఖ్యమన్నది... ఆయన నేర్పిన పాఠం తల్లీ! కవులకు, రచయితలకు, చిత్రకారులకు, వ్యాపారస్తులకు, ఇంకా... చాలామందికి ఇది వర్తిస్తుంది. ఇకపోతే నేను పెట్టిన పరీక్షలో, నా కీర్తిప్రతిష్టల వారసత్వం నిలబెట్టే వారసురాలివి నువ్వే అని... నీలో క్రమశిక్షణను బట్టి నేను నిర్ణయించుకున్నానమ్మా! నేను కష్టపడి రచించిన నా గ్రంథాలన్ని నా అనంతరం చెదపట్టకుండా, అగ్నికి ఆహుతి కాకుండా అనామకుల పరం కాకుండా తడిచి ముద్దవ్వకుండా... చివరికి చిత్తుకాగితాలవాడి తూకానికి బలికాకుండా చూడవలసిన రక్షణ బాధ్యత నీకు అప్పచెబుతున్నానమ్మా!'' అంటూ తన గ్రంథాలున్న రెండురూమ్‌ల తాళాలగుత్తి కూతురుకి అందించాడు.

తన తెలుగు మాస్టారి మహోన్నత గ్రంథంలోని వాక్యాలు మరొక్కసారి గుర్తు చేసుకున్నాడు సత్యకీర్తి!

# ఊతకర్రలు

**సుస్మితా రమణమూర్తి**
✆ 9703440214

> ***"ప్రభుత్వం వేల కోట్లు వెచ్చించి ఆసుపత్రులు నెలకొల్పింది. నాలాంటి ప్రభుత్వ విశ్రాంత జీవులకు ప్రత్యేకంగా ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. మనం మన హెల్త్ కార్డు ద్వారా వైద్య సేవలు పొందాలి. అవసరమైతే మన వైద్యులే మరింత మేలైన వైద్య సహాయం ప్రయివేటు ఆసుపత్రుల ద్వారా మనకు అందిస్తారు. ఆ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది!"***

"డాడీ... రాత్రిపూట మూడు రోజుల నుంచి విపరీతంగా దగ్గుతూ బాధ పడుతున్నారు. మీకే కాదు, ఎవరికీ నిద్ర పట్టడం లేదు. ఈరోజు మన కాంప్లెక్సు లోని డాక్టర్ దగ్గరకు వెళ్ళి చూపించుకోండి!"

కొడుకు మాటలు విని ఊరుకున్నారు తండ్రి.

వారేమీ అనకపోవడంతో తను మరల చెప్పాడు. "ఇక్కడి డాక్టర్ దగ్గరకు వెళ్ళడానికి ఇష్టం లేకుంటే చెప్పండి, దగ్గరలో మంచి వైద్య నిపుణులు ఉన్న ఆసుపత్రులు చాలా ఉన్నాయి. మీకు నచ్చిన ఆసుపత్రికి వెళ్ళి చూపించుకోండి. అపాయింట్మెంట్ తీసుకుంటాను. కేబ్ బుక్ చేస్తాను!"

అప్పటికీ వారు నోరు విప్పలేదు.

"చెప్పండి మావయ్య గారు... ఈరోజు ఎలాగైనా మీరు డాక్టర్‌గారి దగ్గరకు వెళ్ళి చూపించుకోవాలి. మీరలా దగ్గుతో విల విల లాడిపోతుంటే మాకు చాలా బాధగా ఉంది!" కోడలు ఆప్యాయతకు మందహాసం చేసారు వారు. మావయ్య గారి ధోరణికి ఆమె విసుక్కుంది.

"మా సలహా మీకు నచ్చకపోతే, హెల్త్ కార్డు తీసుకుని, మీ కంపెనీ ఆరోగ్య కేంద్రంకైనా వెళ్ళి, అక్కడి డాక్టరు గారికి చూపించుకోండి. మంచి మందులు, దగ్గు సిరపులు రాయించుకుని తెచ్చుకోండి!"

"నా ఆరోగ్యం గురించి ఇంతలా చెప్పాలా... మీ ఇద్దరూ ఆఫీసుకి వెళ్ళే సమయం అవుతోంది. వెళ్ళి రండి!"

"అలాగే డాడీ! మీరు మాత్రం మీ డాక్టరు గారి దగ్గరకైనా తప్పకుండా వెళ్ళి రండి!"

వారి నుంచి మరల చిరునవ్వే సమాధానం.


★★★

"మీ ధోరణి నాకు అర్థం కావటం లేదండీ! అబ్బాయి, కోడలు అంతిదిగా అడిగినా, వారికి సమాధానం చెప్పలేదేం!" అర్థాంగి మాటలు విన్నా, పేపర్లోంచి వారు తలెత్తలేదు. మరల ఆమె రెట్టించి అడిగినా, నోరు విప్పలేదు. అమె కోపంతో వారి చేతిలోని పేపరు లాగేసింది. "నాకైనా మీ మనసులో మాట చెప్పండి" భార్య కోపంకి వారు నవ్వుకుంటూ చెప్పారు.

"వయసులో ఉన్నప్పుడు ఎవరికీ, ఎవరి సహాయం అవసరం లేదు. వీలున్నంత వరకు తమ పనులు తామే చేసుకోగలరు!"

భర్త ఉపోద్ఘాతంకి ఆమె విస్మయంగా వారివేపు చూడసాగింది.

"విశ్రాంత జీవనంలో తల్లిదండ్రులకు పిల్లలే ఆప్యాయత, మమకారాలతో నిండిన ఊతకర్రలు అవాలని అందరూ కోరుకోవడం సహజం!"



భర్త మాటలు అర్థం కాక, ఆశ్చర్యంతో ఆమె కనుబొమలు ముడిబడ్డాయి.

"స్పెషలిస్ట్ డాక్టర్ల అపాయింట్మెంట్ ఆన్‌లైన్లో బుక్ చేసుకోవడం, కేబ్ బుకింగు నాకు తెలియని విషయాలా...?" భర్త ఆంతర్యపు లోతుల్లోకి తొంగి చూడలేకపోతోంది ఆమె.

"మాకు ఇది కావాలి. అది కావాలి.. అని పెద్దవారు నోరు విప్పి అడగలేరు. పెంచి పెద్ద చేసి, విద్యా బుద్ధులు గరపిన తల్లిదండ్రుల అవసరాలు పిల్లలే తెలుసుకోవాలి!"

"కాస్త అర్థం అయేట్లు చెప్పండి!"

అర్థాంగి మాటలకు వారు మరింత వివరంగా చెప్పారు.

"పిల్లలు కన్నవారి మనోభావాలు, అవసరాలు అర్థం చేసుకోగలగాలి. అడగకుండానే వారి అవసరాలు తీర్చే ప్రయత్నం చేయాలి. అప్పుడే వారికి తృప్తిగా ఉంటుంది. వారి మనసులు సంతోషంతో నిండుతాయి!"

"ఇటు తిప్పి, అటు తిప్పి చెప్పిందే చెబుతున్నారు!"

భార్య అమాయకత్వంకి జాలి కలిగింది వారికి. అర్థమయేట్లు చెప్పడానికి ప్రయత్నిస్తున్నారు.

"చిన్నప్పుడు పిల్లలు వారికి కావాల్సిన ప్రతి దానిని చేయి చాపి, సంకోచం లేకుండా తల్లిదండ్రులను అడుగుతారు. ఆ విధంగా మనం ఈ దశలో పిల్లల దగ్గర చేయి చాపలేం. ఎంతో జీవితాన్ని చూసినవారం కదా... అలా అడగడానికి ఆత్మాభిమానం అడ్డు వస్తుంది. పెద్దల అవసరాలు పిల్లలే ప్రేమాభిమానాలతో దగ్గరుండి చూసుకోవాలి. ఇలా చేయండి.

అలా చేస్తే మరింత బాగుంటుంది... అన్న నామమాత్రపు మాటలకు, సలహాలకు పెద్దల మనసులు సంతోషంతో నిండవు. అవసరాలు తీరవు!"

భర్త మాటల్లోని ఆవేదన ఆమెకు అర్థం కాసాగింది. పిల్లలు దగ్గరుండి తమను వైద్యులకు చూపిస్తే బాగుంటుందన్న భావం కలిగినా, భర్తలానే మౌనంగా ఉండిపోయింది.

"ఈరోజు చేతిలో నాలుగు పైసలు ఉన్నాయని, ప్రతి చిన్న ఇబ్బందికి ప్రయివేటు ఆసుపత్రులకు పరుగులు తీయకూడదు"

భర్త మాటలకు ఆమె తలూపింది.

"ప్రభుత్వం వేల కోట్లు వెచ్చించి ఆసుపత్రులు నెలకొల్పింది. నాలాంటి ప్రభుత్వ విశ్రాంత జీవులకు ప్రత్యేకంగా ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. మనం మన హెల్త్ కార్డు ద్వారా వైద్య సేవలు పొందాలి. అవసరమైతే మన వైద్యులే మరింత మేలైన వైద్య సహాయం ప్రయివేటు ఆసుపత్రుల ద్వారా మనకు అందిస్తారు. ఆ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది!"

"మీరన్నది అక్షరాల నిజమండీ! ఇంతకాలం మన పిల్లలు మనకు ఊతకర్రలన్నభ్రమలో కొట్టుకుపోయాం!"

"మన పిల్లలు, వారి పిల్లల బాధ్యతలతో, ఆఫీసు పనుల బాధ్యతలతో బిజీ, బిజీ అవడం మూలాన మనల్ని సరిగ్గా పట్టించుకోలేకపోతున్నారని అనిపిస్తోంది. కనుక వారిని మనం తప్పు పట్టలేం!"

భర్తకు పిల్లలపై ఉన్న ప్రేమాభిమానాలకు ఆమె కళ్ళు చెమ్మగిల్లాయి.

"పదండి! రేపు మీకు తోడుగా మన ఆసుపత్రికి వస్తాను" అందామె

'నీకు నేను, నాకు నీవు మాత్రమే ఊతకర్రలం!' స్వగతంలా అనుకుంటూ భార్య మాటలకు తలూపారు వారు.

# ఒడి

వల్లూరి శివప్రసాద్

*'ఏడు చేపల కథా', 'సింహం–కుందేలు' కథా; 'కాకి–జింక–నక్క' కథా; 'మొసలి–కోతి' కథా; 'నాన్నా పులి' కథా; 'నక్క బావ–కొంగ విందు' కథా; 'గాడిద–కుక్క' కథా... ఇలా తనకు బాగా నచ్చిన కథలు అడిగి మరీ చెప్పించుకొనేవాడు.*

*"చిట్టీ, కొత్త కథలు రోజూ ఎక్కడ్నుంచి తెచ్చి చెప్పగలన్రా?" అంటూ తాతయ్య ఒకరోజు వాపోయాడట.*

*"తాతా 'సింహం–కుందేలు' కథ ఉంది కదా; ఈ రోజు 'పులి–కుందేలు' కథ చెప్పు" అన్నాడట.*

కారు నగర వలయాన్ని ఛేదించుకొని స్టేట్ హైవే పైకి మళ్ళింది. ఆకుపచ్చని మాగాణి పంటపొలాల మధ్యగా సాగుతున్నకొద్దీ వాతావరణంలోని చల్లదనం శరీరాల్ని ఆహ్లాదపరుస్తూ, పైరగాలి కమ్మదనం ముక్కుపుటాల్ని చేరుతోంది. పచ్చగడ్డి మోపుల్ని నెత్తిన పెట్టుకొని, పశువుల్ని అదిలిస్తూ పల్లెబాట పట్టిన పంటకాపులు రోడ్డుకిరువైపులా కనిపిస్తున్నారు. రకరకాల పక్షులు మట్టిపురుగుల్ని పట్టి తినడానికి చేలమీద గిరికీలు కొడుతున్నాయి.

లావణ్య ఒడిలో కూర్చొని, ప్రకృతి దృశ్యాలను అబ్బురంగా చూస్తూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడు బుజ్జి. వెనకాల సీటులో, కనువిందు చేస్తున్న ప్రకృతి దృశ్యాలను తిలకిస్తూ గుసగుసలాడుతున్నారు సుందరం తల్లిదండ్రులు.

"అమ్మా ఎక్కడికి పోతున్నాం?" ఉన్నట్టుండి బుజ్జి ప్రశ్న.

"మనూరే" చెప్పాడు సుందరం.

"అక్కడ ఎవరున్నారు?" తిరిగి బుజ్జి ప్రశ్న.


ఆ ప్రశ్నకు సమాధానం ఎవరూ చెప్పలేదు. సుందరానికి వెంటనే జవాబు తోచలేదు. ఎవరున్నారు? పేరుకు స్వస్థలమనేగాని, కొద్దిమంది బంధువులూ స్నేహితులూ తప్ప మరెవరూ లేరు. తాతయ్యా నానమ్మా బతికున్న కాలంలో ఇల్లు, ఎకరం మెట్టపొలం ఉండేవి. వాళ్ళిద్దరూ గతించడంతో తండ్రి వాటిని అమ్మేసి, సిటీలోనే ఇల్లు ఏర్పాటు చేసుకున్నాడు.

సుందరం ఇప్పుడా ఊరు వెళ్తున్న కారణం ప్రత్యేకమైనది. చిన్న వయసులోనే రాష్ట్రవ్యాప్తంగా తనకింత గుర్తింపూ, గౌరవం వస్తాయని తనెప్పుడూ అనుకోలేదు. గ్రామస్థులంతా ప్రేమాభిమానాలతో ఏర్పాటుచేసిన సత్కారసభలో పాల్గొనడానికి కుటుంబసమేతంగా బయలుదేరాడు.

ఈనాడొక విజేతగా తను నిలబడడానికీ, కీర్తిశిఖరాలను అందుకోడానికీ కారకుడైన వ్యక్తి మనసులో మెదులుతుంటే చిన్ననాటి జ్ఞాపకాలలోకి ఒదిగిపోయాడు సుందరం. బాల్యంలో జరిగిన సంఘటనలు తనకు గుర్తున్నవీ, తల్లిదండ్రులు వివిధ సందర్భాల్లో గుర్తుచేసినవీ, దొంతర్లు దొంతర్లుగా తన జ్ఞాపకాల్లో పేరుకుపోయాయి.

నానమ్మన్నా, తాతయ్యన్నా ప్రాణం పెట్టేవాడు తను. ఐదేళ్ల వయసు వచ్చేవరకూ వాళ్ళ చేతుల్లోనే పెరిగాడు. తల్లిదండ్రులు

ఉద్యోగులవడంతో తన ఆలనాపాలనా చూసేందుకు, ఇల్లు బంధువులకు అప్పజెప్పి, ఉన్న కొద్దిపొలం కౌలుకిచ్చి పట్నం రావాల్సివచ్చింది. తన ఆలనా పాలనా అంతా వాళ్ళిద్దరే చూసేవారు. తాతయ్య భుజాల కెత్తుకొని వీధుల్లో తిప్పేవాడు. రాత్రుళ్లు తను నిద్రపోయేదాకా కథలు చెప్పేవాడు. రోజూ పాతకథలతో పాటు ఒక కొత్తకథ చెప్పాల్సిందే!



'ఏడు చేపల కథా', 'సింహం–కుందేలు' కథా; 'కాకి–జింక–నక్క' కథా; 'మొసలి–కోతి' కథా; 'నాన్నా పులి' కథా; 'నక్క బావ–కొంగ విందు' కథా; 'గాడిద–కుక్క' కథా... ఇలా తనకు బాగా నచ్చిన కథలు అడిగిమరీ చెప్పించుకొనేవాడు.

"చిట్టీ, కొత్త కథలు రోజూ ఎక్కడ్నుంచి తెచ్చి చెప్పగలన్రా?" అంటూ తాతయ్య ఒకరోజు వాపోయాడట.

"తాతా 'సింహం–కుందేలు' కథ ఉంది కదా; ఈ రోజు 'పులి–కుందేలు' కథ చెప్పు" అన్నాడట.

ఆరోజు కథలో సింహాన్ని మార్చి కథ చెప్పాడు తాతయ్య. ఇంకోరోజు డైనోసార్– కుందేలుతో చెప్పమన్నాడు. ఆ తర్వాత 'నాన్నా పులి' కథ ఎలుగుబంటితో, తోడేలుతో చెప్పమన్నాడు. అలాగే మార్చి మార్చి తాతయ్య చెప్పాల్సి వచ్చేది. 'కుక్క–మాంసం ముక్క' కథను తోడేలుతో, నక్కతో, పిల్లితో చెప్పించుకునేవాడు.

"ఒరే చూసేవట్రా నీ కొడుకు తెలివి? వీడు కథలు రాసే కవి అయ్యేట్టున్నాడ్రా" అంటూ తండ్రితో చెప్పి ముచ్చటపడిపోయేవాడట తాతయ్య.

"తాతయ్యా, మా స్కూల్ ఏనివర్సరీకి 'ఫేన్సీ డ్రెస్' పోటీలట. నాతో ఒక వేషం వెయ్యించవా? నాకు ప్రైజు రావాలంతే" అంటూ గొడవ పెట్టాడు.

"ఓ అలాగే! నాలాగే రైతు వేషం కట్టిస్తాన్రా" అంటూ భరోసా ఇచ్చాడు.

తాతయ్య టైలర్ దగ్గరకు వెళ్ళాడు. తన సైజుకి సరిపడా బుల్లిచొక్కా, పంచా కుట్టించుకొచ్చాడు. వెయ్యబోయే వేషం గురించి తల్లిదండ్రులకు ఊదరగొట్టేశాడు తను.

"మావయ్యా వాడికెందుకు ఇలాంటివన్నీ రేపెడతారు? వాడికేపిచ్చ బడితే ఆ పిచ్చ. చదువు మీద శ్రద్ధ పోతుంది" తల్లి సణుగుడు.

"దేనికైనా ఆటవిడుపులుండాలిలేమ్మా, ఎప్పుడూ ఒకే ధ్యాస పనికిరాదు. రకరకాల విద్యలు పిల్లలకు పట్టుబడాలి" అంటూ తనకు సపోర్టుగా నిలబడడం భలే సంతోషపెట్టింది.

తాతయ్య ఎక్కడ్నుంచి చెయ్యించుకొచ్చాడో బుల్లినాగలి కూడా చెయ్యించుకొచ్చాడు. స్కూల్ ఫంక్షనులో రైతు వేషం వేసి, భుజమ్మీద నాగలి పెట్టుకొని నడుస్తుంటే, హాలంతా కరతాళధ్వనులు. తనకు ఫస్ట్ ప్రైజ్ ప్రకటించినప్పుడూ అవే కరతాళధ్వనులు. ఒక సినిమా నటుడి చేతుల మీదుగా కప్ అందుకుంటుంటే మళ్ళీ చప్పట్లు. వేదిక దిగొచ్చిన తరవాత తాతయ్య ఎత్తుకొని ముద్దు పెట్టుకుంటుంటే అంతులేని ఆనందం. మర్నాడు పేపర్లో రైతు వేషంలో తనున్న ఫోటో చూసి, తాతయ్యా, నానమ్మలు ఎంత మురిసిపోయారో!

ఎప్పుడూ చదువులో రాంకులు చూసే తల్లిదండ్రులకు ఇవి అంతగా పడితే గదా!

ఇంట్లో ఏం జరిగిందో ఏమో, ఒకరోజు బడినుంచి ఇంటికొచ్చేసరికి తాతయ్యా, నానమ్మా కనిపించలేదు.

అడిగితే ఊరెళ్ళారని చెప్పారు. 'ఇదిగో వస్తారు, అదిగో వస్తారు' అంటూ చెప్పసాగారు. ఊహ తెలిసినప్పట్నుంచీ వాళ్ళ చేతుల్లో పెరిగాడు. వాళ్ళు లేకపోవడంతో దిగులుపడ్డాడు. రోజూ రాత్రుళ్లు నానమ్మా తాతయ్యా చెప్పే కథలూ కబుర్లూ లేకుండా పోయాయి. చదువుకో బుద్ధి పుట్టట్లేదు. పడుకొని నిద్రకోసం పొర్లగింతలు పెట్టేవాడు.

ఆ ఊరి పేరు తెలుసు. బస్సెక్కితే గంట ప్రయాణం. ఒకరోజు స్కూల్ నుండొచ్చాడు. అమ్మా, నాన్నా ఇంటికి రాలేదు. పుస్తకాలు ఇంట్లో పడేశాడు. పాకెట్ మనీగా ఇచ్చిన డబ్బులు ఇరవైరూపాయల దాకా ఉన్నాయి. పనిచేయడానికొచ్చిన ఆయమ్మతో ఆడుకోటానికని చెప్పి, స్టాపుకు వెళ్ళాడు.

చీకటి పడుతున్న వేళ, ఒంటరిగా ఇంట్లోకి అడుగుపెడుతున్న తనను చూసి, తాతయ్య నమ్మలేకపోయాడు. మంచంలో రోగాన పడిఉన్న నానమ్మ చేతులు పట్టుకొని ఏడ్చేసింది. ఇంట్లో చెప్పకుండా వచ్చేశానని చెప్పేసరికి ఇద్దరూ భయపడిపోయారు. నానమ్మకు పెద్ద జబ్బు చేసిందని తాతయ్య చెప్తే ఏడుపొచ్చింది.

రాత్రి పడుకునే వేళకు నాన్న కారేసుకొని వచ్చాడు. ఎవరో బస్సెక్కడం చూసి చెప్పారట. చెప్పా పెట్టకుండా వచ్చినందుకు కోప్పడుతూ, వెళ్దాం రమ్మన్నాడు. రాను పొమ్మన్నాడు. వాళ్ళతో పాటే ఉంటానని గోలుగోలున ఏడ్చాడు. రెండు రోజుల్లో తానే స్వయంగా తీసుకొచ్చి దిగబెడతానని చెప్పి తండ్రిని పంపేశాడు తాత. రకరకాలుగా బతిమాలి, చదువుసంధ్యలు

పాడైపోతాయనీ, నానమ్మకు బాగయ్యాక వచ్చి ఉంటామనీ నచ్చజెప్పి, తీసుకొచ్చి దిగవిడిచి వెళ్ళాడు.

వాళ్ళు రాలేదుగాని, నానమ్మ చావుకబురొచ్చింది. తల్లిదండ్రులతో కలిసి ఊరెళ్ళాడు. తాతయ్యతో పాటు తానూ ఏడ్చాడు. వారంరోజుల తరవాత, తాతయ్యను ఒంటరిగా వదిలేసి వచ్చేశారు. తాతయ్యకోసం రోజూ ఎదురు చూడడమే. కొద్ది నెలల తరవాత తాతయ్య వచ్చాడు.

"తాతయ్యా, మళ్ళీ ఊరెళ్ళ కూడదు. ఇక్కడే ఉండాలి" అంటూ తాతయ్యను వాటేసుకున్నాడు.

"అలాగే, నేను బతికున్నంత కాలం నీతోనే ఉంటాను రా" తాతయ్య హామీ ఇచ్చాడు.

నిద్రకు మంచం మీద చేరుతూనే రామాయణ, భారత, భాగవత కథలూ; తెనాలి రామలింగడి కథలూ, భేతాళకథలూ... ఇలా చెప్పే కథలకు అంతూ పొంతూ ఉండేది కాదు.

"తాతయ్యా ఇన్ని కథలు నీకెలా వచ్చు? నాలుగో క్లాసు వరకే చదువుకున్నానని చెప్పేవు కదా?" బోలెడంత ఆశ్చర్యంతో ఒకరోజు అడిగాడు.

"మా తాతలూ, సహవాసగాళ్ళూ, హరిదాసులూ చెప్పినవీ, నాటకాలూ, సినిమాలూ చూసి నేర్చుకున్నవే" అంటూ, 'చెల్లియో చెల్లకో' అంటూ, 'జెండాపై కపిరాజు' అంటూ నాటక పద్యాలు కూడా పాడుతుంటే నోరు వెళ్లబెట్టి వినేవాడు.

"తాతయ్య సొల్లుకబుర్లు వినేకంటే, నిద్ర వచ్చేవరకూ పాఠాలు చదువుకోవచ్చు కదా" తల్లి సతాయింపులు మొదలుబెట్టింది. తల్లి తండ్రికి ఫిర్యాదుచేసి, మందలించినా లెక్క చేసేవాడు కాదు. పెద్దాయన పిల్లాడ్ని చెడగొడుతున్నాడంటూ తల్లి వాపోతుండేది. తాతయ్య చెప్తున్న కథలూ కబుర్లూ వింటుంటే తనకెన్నో రకాల ఆలోచనలూ, ఊహలూ కలిగేవి.

హైస్కూల్లో 'కథ చెప్పండి' పోటీ పెడితే, తనకే మొదటి బహుమతి. వ్యాసరచన పోటీల్లో, వక్తృత్వ పోటీల్లో, ఏకపాత్రాభినయం పోటీల్లో... ఇలా ఎన్నెన్నో బహుమతులు. బహుమతిగా ఇచ్చిన పుస్తకాలను పదేపదే చదివేవాడు. ఏడో తరగతిలో ఉండగా ఒక కథ రాసి మాస్టారికి చూపించాడు. తానే రాశానంటే ఆయన ఆశ్చర్యపోయాడు. మాస్టారు ఒక పిల్లల పత్రికకు పంపితే అది ప్రచురించారు. ప్రేయర్లో హెడ్మాస్టారు ఆ విషయం చెప్పి, అందరిచేతా చప్పట్లు కొట్టించారు.

ఆ ఉత్సాహంతో మరో కథ రాయాలని నోట్సులో రాస్తుంటే చూసి, తల్లి కేకలు పెట్టింది. "చదువుసంధ్యలు లేకుండా కథలూ కాకరకాయలూ ఏంట్రా వెధవా" అంటూ తాతనూ, తననూ తిట్టిపోసింది. ఈసారి చెవి మెలేసి తండ్రి కూడా నాలుగు అంటించాడు. రాసిన కాయితాలు చింపి ముక్కలు చేశాడు.

తాతయ్య ఏదో చెప్పబోతే, "ఏం నాన్నా, నీకెటూ చదువు లేదు. మట్టీ, పేడా పిసుక్కుంటూ ఆ కాలంలో కాబట్టి బతకగలిగావు. మేం చదువుకోబట్టే ఈమాత్రమైనా సుఖంగా బతకగలుగుతున్నాం. వేళకో ముద్ద... పెట్టింది తిని ఓ మూల పడుండు" అంటూ రంకెలు వేశాడు. తాతయ్యేమీ మాట్లాడలేదు. అలా అంటున్నందుకు ఇద్దరి మీదా చచ్చేంత కోపం వచ్చింది.

తాతయ్యను అలా అరిచినందుకు ఉదయం ఏమీ తినలేదు. కేరేజీ ఇంటి దగ్గరే పడేసి స్కూలుకి వెళ్లిపోయాడు. ఆ తరవాత ఏం గొడవ జరిగిందో తెలీదు. తాతయ్య ఊరెళ్లిపోయాడు. అడిగితే ఇల్లు బాగు చెయ్యిస్తున్నాడనీ, పొలం పనులు చెయ్యిస్తున్నాడనీ, పనులు పూర్తయ్యాక వస్తాడనీ నమ్మబలికారు.

టెన్త్ పరీక్షలయ్యాయి. 'ఏ' గ్రేడ్ మార్కులతో స్కూల్ ఫస్ట్‌గా పాసయ్యాడు. సెలవల్లో 'సమ్మర్ కోచింగ్' అంటూ కట్టి పడేశారు. ఇంటర్లో చేరాడు.

ఒకరోజు పాము కరిచిందంటూ ఊరివాళ్లు తాతయ్యను ఆటోలో తీసుకొచ్చి, హాస్పిటల్లో చేర్పించారు. తాతయ్య బతకలేదు. ఊరికి తీసుకెళ్లి, చేయాల్సిన కార్యక్రమాలు అక్కడే చేశారు. తాతయ్యను తలచుకొని ఎన్నోరాత్రులు ఒంటరిగా ఏడ్చాడు. తాతయ్య చెప్పినట్టు తను కథలు రాయాలి. రచయితగా మంచి పేరు తెచ్చుకోవాలి. కనిపించిన ప్రతీ పుస్తకాన్నీ చదవడం మొదలు బెట్టాడు.

ఇంజనీరింగ్ మొదటి సంవత్సరంలో కలంపేరుతో కథ రాసి ఒక పత్రిక కథల పోటీకి పంపించాడు. మూడవ బహుమతితో పాటు, మంచి ప్రశంసలు కూడా వచ్చాయి. ఆ ఉత్సాహంతో నెలకు ఒకటి రెండు కథలు రాయడం మొదలుబెట్టాడు. మరి రెండు కథలకు పోటీలో మొదటి, రెండవ బహుమతులు వచ్చాయి. పాఠకలోకంలో యువ రచయితగా గుర్తింపు మొదలైంది.

ఇంజనీరింగ్ చివరి సంవత్సరంలో ఉండగానే ఒక ప్రముఖ కంపెనీ చేసిన కేంపస్ ఇంటర్వ్యూలో సెలక్టయ్యాడు. ఇంటర్వ్యూలో వాళ్ళడిగిన ప్రశ్నలకు ఎలాంటి తడబాటూ లేకుండా జవాబు చెప్పడానికీ, వివిధ అంశాలమీద అభిప్రాయాలను చాకచక్యంగా వ్యక్తీకరించడానికీ తాతయ్య ఇచ్చిన తర్ఫీదే కారణమనిపించింది.

ఉద్యోగంలో చేరినా, కొంత సమయాన్ని కేటాయించి, కథలతోపాటు మూడు నవలలు కూడా రాశాడు. కొద్దిపాటి భూమిని నమ్ముకున్న ఒక బక్కరైతు ప్రతికూల పరిస్థితులతో నిత్యం పోరాడుతూ, ఆత్మస్థైర్యంతో ఆ కొద్ది భూమినీ కాపాడుకుంటూ, పిల్లలకు చదువులు చెప్పించి, వాళ్ళ భవిష్యత్తును ఉన్నతంగా ఎలా తీర్చిదిద్దాడన్న ఇతివృత్తంతో రాసిన నవలకు పాఠకుల విశేష ఆదరణా, విమర్శకుల ప్రశంసలూ దక్కాయి. ఒక సాహిత్య సంస్థ పదిహేను కథలతో కథాసంపుటి వెలువరించింది.

రైతు నేపథ్యంగా రాసిన 'కష్టజీవి' నవలకు ఒక పత్రిక నిర్వహించిన పోటీలో మొదటి బహుమతి లభించింది. ఆ వార్త మరుగున పడిపోకముందే కేంద్ర సాహిత్య ఎకాడమీ 'యువ పురస్కారం' ప్రకటించడంతో కలంపేరుతో రాస్తున్న తను సాహితీ లోకానికి పరిచయం అవ్వక తప్పలేదు. పత్రికల్లో ఇంటర్వ్యూలూ, ప్రశంసలూ వెల్లువెత్తాయి.

"సందూ, వియ్ ఆర్ ప్రౌడాఫ్ యూ. ఈ ఎవార్డు మాకే వచ్చినట్టుగా బంధువులూ, స్నేహితులూ తెగ పొగిడేస్తున్నారు. నువ్వు ఎప్పట్నుండో రాస్తున్నట్టు ఒక్క మాట చెప్పలేదేరా?" అంటూ తల్లిదండ్రులు గర్వంతో మురిసిపోయారు.

"నాన్నా, నా చిన్నతనంలో నేను రాసిన కాయితాలను చింపి పారేసిన విషయం మీరు మరచిపోయారేమోగాని, నేనింకా మరచిపోలేదు. ఇలాంటివి మీకు నచ్చవుగా?" అన్న మాటకు సమాధానంగా వాళ్ళ గొంతు పెగల్లేదు.

చిన్నతాతయ్యగారి ఇంటిముందు కారు ఆగి, నలుగురూ పలకరించడంతో సుందరం ఆలోచనలకు అడ్డుకట్ట పడడం జరిగింది. అంతా ఇంట్లోకి నడిచారు. బంధువులతో, మిత్రులతో ఇల్లంతా కోలాహలంగా ఉంది.

"అబ్బాయ్, నీ దెబ్బకి పేపర్ల నిండా మన ఊరు పేరు మార్మోగిపోయిందిరా" అంటూ చిన్నతాతయ్యతో పాటు అందరూ పొగడ్తల వర్షం కురిపించేశారు. కొద్ది నిమిషాల తరవాత అందరూ పాఠశాలలో ఏర్పాటు చేసిన సభాప్రాంగణానికి చేరుకున్నారు.

ఆ నియోజకవర్గం ఎమ్మెల్యే, ఊరి సర్పంచు, మెంబర్లూ, టీచర్లు, పిల్లలు, పెద్దలతో సభాప్రాంగణం కిక్కిరిసిపోయింది.

సర్పంచి అధ్యక్షతన సభ ప్రారంభమై, స్థానికుల అభినందనలతో గంట పైగానే కొనసాగింది. ఏ ఇద్దరు ముగ్గురో తన తండ్రి పేరు తలచడమేగాని, సూరయ్యగారి మనవడంటూ పదేపదే గుర్తుచేసుకున్నారు. తరవాత ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం జరిగింది. సన్మాన స్వీకర్తగా తను స్పందించవలసి వచ్చింది. తనకు సన్మానం చేసిన గ్రామ ప్రజలందరికీ పేరుపేరునా ముందుగా కృతజ్ఞతలు తెల్పుకున్నాడు.

“సామాజిక అభ్యున్నతి కోరేవాడిగా ముందుముందు నేను చాలా రాయాల్సి ఉంది. ఈ సత్కారం కోసం నేనిక్కడికి రాలేదు. నేనింతటి గౌరవాన్ని పొందడానికి కారకుడైన వ్యక్తిని స్మరించుకోవడానికి వచ్చాను. ఆయన చిన్నతనంలో నాకు చెప్పిన రకరకాల నీతి కథలు, రామాయణ, భారత, భాగవతాది కథలూ నాలో ఉన్న సృజనాత్మకతకు పదునుపెట్టి, నాలోని రచనాశక్తిని వెలికి తీసి, నన్నో రచయితగా మీ ముందు నిలబెట్టాయి. ఆ తాతయ్య ‘ఒడే’ నాకు సాహిత్య పాఠాలు నేర్పిన బడి.” సభలో ఉవ్వెత్తున కరతాళ ధ్వనులు.

“నాకు పేరు తెచ్చిపెట్టిన ‘కష్టజీవి’ నవలకు తాతయ్య జీవితమే ప్రేరణ. ఆయన వ్యక్తిత్వమే ప్రధానపాత్రకు ఊపిరిపోసింది. ఆయన నాతో పంచుకున్న సంఘటనలే నవలకు జవజీవాలయ్యాయి. జీవిత వాస్తవికతకు అద్దం పట్టి, కష్టజీవుల పక్షాన నేను నిలబడేలా చేసింది. ఆ తాతయ్యమీద ప్రేమతో, గౌరవంతో ఆయన పేరు స్ఫురించేలా ‘సూరీడు’ అన్న కలంపేరుతోనే రచనలు చేశాను. అందుకే... నాకు చేసిన ఈ సత్కారం, నాకు దక్కిన ఈ గౌరవం తాతయ్యకే అంకితం” సుందరం చేతులు జోడించాడు, తాతయ్య జ్ఞాపకాల్లో చెమ్మగిల్లిన కళ్ళతో.

# సంతాప సభ

**పోతుకూచి సాంబశివ రావు**

***పంతులుగారు లేచారు మాట్లాడడానికి. ఆయన లేవగానే ఓ చిన్న జ్ఞాపకం వచ్చి నవ్వుకున్నారు – 'మీరు యిచ్చిన కందిపచ్చడి చాలా రుచిగా ఉందండీ' అన్న భార్యామణి మాట జ్ఞాపకం వచ్చి, మందహాసం చేసి, గబుక్కున సంతాపసభ ఇది అని గుర్తుకు వచ్చి విచారంగా ముఖం పెట్టి ఉపన్యాసం మొదలుపెట్టారు.***

మహాకవి పుల్లయ్యగారు మరణించిన వార్త ఊరిలో పొక్కింది.

కార్యదర్శి ఎల్లయ్యగారు మహా కంగారు పడిపోయాడు––ఆ వార్త ఎంతవరకు నిజమా అని.

మహా మహా గొప్పవాళ్లే చచ్చిపోతూంటే,మహాకవి పుల్లయ్య చావక ఏం చేస్తాడు అన్నాడు ఒక విరోధి శ్రోత.

'మరణం అనేది మహామహా ఆరోగ్యవంతులకే తప్పదు. ఈ పాటికి చనిపోయే ఉంటాడు' అన్నాడు మందిచ్చే వైద్యుడు. వైద్యుడి మాట విన్న కార్యదర్శి ఎల్లయ్యగారు తక్షణం సంతాపసభ ఏర్పాట్లు ప్రకటించారు. మర్నాడు సభ సమయం అరగంట ముందు –

**కార్యదర్శి**

మరణానికి, మంగళానికి కూడా ఒకే రీతిలో పంచరత్నాలు వ్రాయగల్గిన మహాకవి పుల్లయ్య పోవడం ఎంత లోపం ఈ ఊరికి. ఆ మధ్య రజకుల మహాసభల్లో వ్రాసిన పంచరత్నాలు ఎంత బాగున్నాయి! "ఉతుకు ఉతుకు మంచునెపుడు" అన్న పద్యం వహ్వా! మొన్న మంగలి సంఘం శత దినోత్సవాలు జరిగినపుడో 'క్షౌరమనగ కళ్యాణమే' అన్న పదము! బ్రహ్మాండంగా ఉంది. ఇంక ఈ ఊళ్లో పెద్దవాళ్లెవరైనా వస్తే పంచరత్నాలు వ్రాసే మొగాడే లేడు. ఆయన ఉండబట్టి ఎన్ని సభలు జరిపించాను. బారసాలకు, సత్యనారాయణ వ్రతానికి, పంచాయతీ ప్రారంభానికి, పంచముడి ఉద్ధరణకు, ఊళ్లో కరణంగారి ఆరోగ్యము చెడినపుడు, మునసబుగారి ఆరోగ్యం బాగుపడినపుడు – ఆయన వ్రాసిన కవితా ఖండికలు ఎలా ఉన్నా, ఆయన్ను అందరూ వాడుకున్నవారే! చివరకు శ్రీనాథుడిలా పరమపదించాడు. ఓరి! ఇంక అయిదు నిమిషాలే ఉంది. ఇదేమిటి ఇంకా ఎవరూ సభికులైనా రాలేదా? వీధిలో వాళ్ళను కొంచెం లోపలికి రమ్మని బంట్రోతు బలవంతయ్యను తోలిస్తే ... 'ఒరే పదిమందిని లోపలికి రమ్మను. సభ ప్రారంభిస్తున్నామని చెప్పు.' మునసబుగారు, పంతులుగారు, డాక్టరుగారు, వక్తలు సరైన కాలానికి ఎవరూ ఏ పనీ చెయ్యరనుకుంటా! మరి మనమంతా నిరంకుశులం! లేకపోతే వేదాంతులం! అదుగో అదుగో పంతులుగారు దయచేశారు.

**పంతులు**

ఈ ఎల్లయ్యగాడికి బుద్ధి లేదు. నిలుచుంటే సభ, కూర్చుంటే సభ అంటాడు. ఎవడైనా చస్తే సభ, పుడితే సభ. రామరామ... చస్తున్నా ఈ సభల్లో మాట్లాడలేక. అయినా అన్ని సభల్లో ఏమి క్రొత్తది మాట్లాడటం? అన్ని సభలకూ సరిపోయే ఒక

ఉపన్యాసం టేప్ రికార్డు చేయించుకు కూర్చుంటే బాగుంటుంది. ఒకవేళ నే రాలేకపోయినా, అద్దైనా పంపిచ్చవచ్చు సభకు. 'నమస్కారం! ఎల్లయ్య గారూ! మనమేనా ప్రథమం? ఇంకా ఎవరూ రాలేదే? పుల్లయ్యగారిని పుల్లలమీది కెక్కించి భస్మం చేయించడం అయిపోయిందట! అదృష్టవంతుడు. ఇంద్రసభలో ఆస్థానకవి అయ్యే యోగం పట్టింది ఆయనకు. అక్కడ ఇంద్రుని కళ్ళమీదనో లేక అప్సరసల అందం మీదనో పంచరత్నాలు వ్రాస్తే కాస్త కనకాభిషేకమైనా కురుస్తుంది.'

***బంట్రోతు బలవంతయ్య***

ఈ కార్యదర్శిగారి గోల, రామరామ ... భరించడం కష్టం. వీధిలో జనాన్ని లాక్కురమ్మంటాడేంటి! కనకయ్యగారిని పిలుస్తూంటే ఏదో పరధ్యానంగా మాట్లాడుతూ చుట్ట పీక తీసి తుపుక్కున మీద ఊశాడు. ఆ కోపిష్టి చెలమయ్య చెప్పుతీశాడు – 'పోవోయ్, నీ సభా నువ్వూ' అంటూ, పేకముక్కలు లెక్క పెట్టుకుంటూ, 'రాయే' అని మాయింటి పక్క లచ్చమ్మని పిలుస్తే 'నీ జిమ్మడా నీ కిదే పోయ్యే కాలంరా' అని అదే తిట్టు. తస్సాదియ్యా. ఎవరిని పిలుసుకొచ్చేది? ఇద్దరు ముష్టోళ్లను పిలుసుకొస్తే సరి – పైసలిత్తారు సభకాగనే రమ్మని. అదే స్టంటు చెయ్యాలి తస్సాదియ్యా

★★★



సభ ప్రారంభించే సమయానికి అర్థగంట గడిచినా పంతులు తప్ప అటు సభికులుగాని, ఇటు వక్తలుగాని ఎవరూ రాలేదు. వచ్చిన పంతులుకూడా ఒక పదిహేను నిమిషాలలో మళ్లీ వస్తానని బయటికి వెళ్ళాడు భార్య బయటఉందని, మధ్యలో ఆగిన కంది పచ్చడి రుబ్బు పూర్తిచేయటానికి తక్షణం ఇంటికి రమ్మని కబురు వస్తే. డాక్టరుగారు కబురు పెట్టారు "ఏదో ప్రమాదకరమైన ఆపరేషను చేస్తున్నా. వీలైనంత త్వరలో వస్తున్నా" నని. మునసబుగారన్నారు. "ఒక భూమి అమ్మకం తేల్చుతున్నా. ఈ లోపుగా సభ ప్రారంభించమని. మహా కార్యదర్శి ఎల్లయ్యగారు మహారుద్రుడైపోయాడు. ఏం చెయ్యలేక మహా చల్లబడిపోయాడు. ఏమీ తోచక మహా గందర గోళంలో పడిపోయాడు. మైక్ తెచ్చినవాడిపై అరిచాడు: 'కాస్త సినిమా పాటలైనా పెట్టరా. జనం వస్తా'రని. 'చల్ మోహనరంగా, నీకునాకూ జోడు కలిసెనూ గదరా' – పాట మొదలు పెట్టగానే కాస్సేపటికి చిన్నపిల్లల సైన్యం సభాప్రాంగణంలోకి జొరపడింది. 'పిల్లలూ అల్లరి చేయకండే' అన్నారు మహాకార్యదర్శి ఎల్లయ్యగారు.

'మరే తాపీగా కూర్చోండి. తర్వాత మిఠాయిలు...' అన్నాడు రహస్యంగా బంట్రోతు బలవంతయ్య కార్యదర్శిగారు వినకుండా.

రైతుభూమయ్య తొంగి చూచాడు లోపలికి – 'బాబూ ఇక్కడ సినిమా కాని అవుతూందా' అని. సభ అంటూ అరిచారు ఎల్లయ్యగారు.

గబుక్కున నాలిక్కరుచుకుని 'రావోయి ఇది సంతాపసభ అంటూ' పిలిచారు.

భూమయ్యవచ్చి ఒక పొగాకుకాడ విప్పి చుట్టుకుంటూ ఒక మూల కూర్చున్నాడు.

బంట్రోతు బలవంతయ్య సత్రవు అరుగు మీద కూర్చున్న ఇద్దరు సాధువులను లోపలికి తెచ్చాడు. రాగానే "జై సీతారాం" అన్నారు వారు. కార్యదర్శి ఎల్లయ్యగారు ఒక్క నిమిషం ఆశ్చర్యపోయినా ప్రాపంచిక చింతలేని పరమపవిత్రులు ఇద్దరు సభికుల జాబితాలో జేరడం కొంత శుభదాయకమే అనుకున్నాడు. 'కళ్యాణం నీకు' అని ఆశీర్వదించారు సాధువులు, 'కాదుస్వామి! ఈ సంతాప సభ త్వరగా పూర్తయ్యేలా ఆశీర్వదించు' అని లోపల అనుకున్నారు ఎల్లయ్యగారు.

సాధువుల ఆశీర్వచన బలం కాబోలు మరి ఇద్దరు కోపిష్టి చెలమయ్య, పాపిష్టి వెంకయ్య వచ్చారు సభకు. డాక్టరుగారు కంగారుగా మెడలో స్టెతస్కోపు తగిలించుకునే వచ్చేశారు. ఎటొచ్చీ మునసబుగారు రాలేదు ఇంకా.

### కార్యదర్శి

హమ్మయ్య. ఇప్పటికి సభలో జనం అందుకుంటున్నారు – చనిపోయే రోగికి నాడి అందుకుంటున్నట్లు. మరి మునసబుగారు రాలేదే? ఆయన రాజకీయ వేత్త. 'ఆలస్యంగా వస్తాలే' అంటే అసలు రానని అర్థమా! కావచ్చు. పంతులేడీ? వాళ్ళ ఆవిడ హిడింబి. ఇంట్లో పచ్చడి చెయ్యకపోతే పంతుల్నే పచ్చడి చెయ్యగలదు. ఇంక సభకేం రానిస్తుందీ? ఇప్పటికే గంట ఆలస్యమవుతూంది. ఉన్నవాళ్ళతో సభ కానిద్దాం. మధ్యలో వస్తారు జనం ఇక్కడ ఉపన్యాసాలు చూసి.

★★★

కోపిష్టి చలమయ్య హాలులోంచి కేక వేస్తున్నాడు. 'ఏమయ్యోయి కార్యదర్శీ! సభ మొదలుపెట్టు' అంటూ.

రైతు భూమయ్య చుట్ట ముట్టించాడు – 'పొగత్రాగరాదు' అన్న బోర్డు తాను చదవలేదు కనక. 'ఏమయ్యా శ్రావణ భాద్రపదాల్లా ఇద్దరే వచ్చారే ఈ సభకు' అన్నారు. కార్యవర్గంలోని ఒక కుర్రకారు సభ్యుడు ప్రక్కకు పిల్చి కార్యదర్శితో.

ఎల్లయ్య గారికి ఎక్కడలేని కోపం వచ్చి తక్షణం సభాప్రాంగణంలోకి దూరాడు – 'ఎలాగైనా ఈ వేళ సభ జరుగుతుందని, తక్షణం జరగాలని' అంటూ మైకు ముందు నిలుచున్నారు. ఇంకా 'చల్' మోహన అంటూ పాట నడుస్తూంది.

'మీరు పాడుతున్నారా సార్' అన్నాడు ఒక ప్రేక్షకుడు. పెదిమలు కోపంతో బిగించారు ఎల్లయ్యగారు. "మహాశయులారా" అన్నాడు.

'మహాచాపలారా అనకూడదూ?

ఇక్కడ జనం ఎవరూ లేందే' అన్నాడు కోపిష్టి చెలమయ్య.

'ఈనాడు ఈ సభకు శ్రీ' అని పేరు తెలియక 'ఆసాధువుగారిని అధ్యక్షత వహించవలసిందని కోరుతున్నా' అన్నారు ఎల్లయ్యగారు.

'జై సీతారాం' అంటూ ఆయన వచ్చి కుర్చీలో ఆసీనుడయ్యాడు.

'ఈ సభలో డాక్టరుగారు, చలమయ్య గారు, పంతులుగారు మాట్లాడుతారు. పంతులుగారింకా రాలేదు' అన్నాడు కార్యదర్శి.

'వచ్చానయ్యోయి' అంటూ గుమ్మంలోంచి కేకపెట్టాడు. పంతులు కాస్త కంది పచ్చడి దవడలో పెట్టుకుని లాలాజలం మ్రింగుతూ.

'అయితే ఇది ఏం సభ?' అన్నారు సాధువు గారు ఏమీ తెలియక పోవడం వల్ల.

'సంతాపసభ' అన్నారు కార్యదర్శి మర్యాదగా.

'ఏం సంతాపసభ' అన్నారు సాధువు చిదానందంగా.

'నా సంతాపసభ' అని కోపంగా అనబోయి సర్దుకుని 'మహాకవి పుల్లయ్యగారు మరణించారు. అందుకు' అన్నాడు కార్యదర్శి నవ్వుతూ.

సాధువుగారు మరణాల గురించి వేదాంత దోరణిలో గంభీరంగా తొలిపలుకులు ప్రవచిస్తున్నారు.

***1 వ ప్రేక్షకుడు***

దీనమ్మ కడుపుకాల. ఇంట్లో ఒకటే రంధి. రోజూ సణగడమే. ఆ వ్యాపారంలో ఒక వెయ్యి పోయిందే అనుకో, వడ్డాణం అమ్మి తెచ్చేనే అనుకో. ఆమాత్రం మొగుడనే గౌరవం ఉండొద్దా? ఊరంతా యాగీచేస్తుంది –వ్యాపారంలో నష్టం వచ్చిందని. దీన్ని ఒదిలేసి ఆ సాధువుగారిలా మారిపోయినా బాగుండేది. ఆహాహా! ఏం మాట్లాడుతున్నాడు! మరణమనేది మనందరికీ ఉంటుందట. ఏమి సత్యం, ఎంత చక్కగా చెప్పాడు. ఆ మరణమేదో దానికి వచ్చినా పోయె. పీడ విరగడమయ్యేది. ఏ కన్నెపడుచునో మళ్లీ పెళ్ళి చేసుక్కూర్చుంటే .... దానికి ఈ వ్యాపారం గొడువలు తెలియవుగా నోరు మూసుక్కూర్చునేది.

**చలమయ్య**

ఈ సాధువుగారి కాషాయరంగు మంచి పాకానబడిందే. ఎక్కడ దొరుకుతుందో అడగాలి ఈయన్ను సభ అయ్యాక. అయినా సాధువులు సాహిత్యవేత్తల గురించి మాట్లాడటమేమిటి? పుల్లయ్య గురించి ఒక్క ముక్క అయినా చెప్పడే! బదరీయాత్ర గురించి మాట్లాడుతాడు. అసలు పుల్లయ్య ఎవరో తెలిసేడుస్తేగా?

***2 వ ప్రేక్షకుడు***

జానకి కాషాయరంగు చీర కట్టుకుంటే ఎంత అందంగా ఉంటుందో! దాని శిరోజాలు సాధువు గారి గెడ్డం నలుపును మించి మిసమిసలాడుతున్నాయి. ఈయన ముఖంలో ప్రశాంతతే ఒక్కొక్కసారి ఆమెలోనూ కనిపిస్తుంది. ఈ సంక్రాంతి సెలవులవగానే, తక్షణం పట్నం వెళ్ళాక పెళ్ళి సంగతి తేల్చెయ్యాలి. జానకీ...! ఈ సాధువుగారిని చూస్తూంటే నువ్వే జ్ఞప్తికి వస్తున్నావు. ఇంక ఈ ఉపన్యాసం ఏం వినిపిస్తుంది నాకు....

**సభికులలో ఒక స్త్రీ**

అప్పుడే ఎనిమిది గంట అయిందే. ఇంటికి వారు వచ్చేస్తారు కాబోలు. తాళం చెవి ప్రక్కయింటావిడకు యిచ్చి వచ్చాను. అదొక దొంగ కిలాడీ. ఒక్క నిమిషంలో మనిషి ఎదురుగా ఉంటేనే తలలు మార్చేస్తుంది. ఇంకెవరూ లేకపోతే చెప్పాలా? ఆయనో బోళా శంకరుడు. పకపక నవ్వడం తప్పితే ఏమీ తెలియదు. నా ఖర్మ, ఆయనతో ఎంతకాలం కాపురం చెయ్యాలో కాని. ఏమిటీ ఈ సాధువు ఉపన్యాసం. ఊరికే సాగు తూంది?

**రైతు భూమయ్య**

ఏంటయ్యా ఏటి మాట్లాడుతున్నాడు ఆ సాధువు గారు? ఏదో వేదాంతం సెబుతాడేటి, ఏదైనా రెండు శోకాలు తీయక. అసలు ఏ ఊరోడు యీయన. దొంగకోళ్లు కొట్టే రకంలా ఉన్నాడే! అమ్మో వీళ్లను నమ్మడానికి వీల్లేదు. మనమరాలు బంగారు గాజులు ఆ మధ్య ఇలాంటి సాధువే దొంగిలించుకుపోయాడు. ఓరి ఈడి కేసి అదే పనిగా సూస్తో కూకుంటే యీ సుట్టారిపోయిందే.

**చలమయ్య**

ఏడిసిట్టుగానే ఉంది. అధ్యక్షుడి గారి సంతాప ఉపన్యాసం. పోయి కాస్త అరుగుమీద పేకాడితే నాలుగు డబ్బులు దొరికేవిగా! పైగా ఇక్కడ మాట్లాడాలిట. మాట్లాడతా. జన్మలో ఇటువంటి సభ ఇంక జరగకుండా మాట్లాడతా. ఈ చలమయ్య తడాఖా చూపుతా. ఆపడేం ఉపన్యాసం, ఈ సాధువుగారూ, 'ఏమండోయి కార్యదర్శి గారు, ఎంత టైమిచ్చారు అధ్యక్షుడి గారికి? కాస్త మేము కూడా మాట్లాడాలిగా. చెప్పండి ఆపమని.' 'నన్ను ఆగమనడం కాదయ్యా! ఆయన వాక్ప్రవాహం ఆపమను. ఊళ్లోవాళ్లంముందుమాట్లాడాలిగా? అదిపోయిఎవరో ఊరుకుసంబంధించనిమనిషిచేతముందుమాట్లాడించటమేమిటి!

★★★

సాధువు అధ్యక్షులు తమ ఉపన్యాసం ముగించారు. లావైన డాక్టరు గారు ఆయాసంగా సంతాపకరంగా లేచారు. 'ఈ గ్రామములో నా చేతి మీదుగా చనిపోయిన వారిలో పుల్లయ్య గారు 111వ వారు. సాధారణంగా నా వైద్యంతో ఎవరూ చావరు. చస్తే మరి బ్రతుకరు' .... ఆయన ఉపన్యాసం సాగుతూంది.

***1వ ప్రేక్షకుడు***

ఓరి! యీ సంగతి తెలియదే నాకు. ఇంతకాలం ఆ ఆయుర్వేదం భిషగ్రత్న గారి మందులు యిప్పిస్తున్నాను ఆవిడకు. నీ చేత మందిప్పిస్తే దాని నోటికి పక్షవాతమైనా వచ్చేదేమో సంతోషించేవాడిని....

**చలమయ్య**

చెప్పు నాయనా శ్రీరంగ నీతులు, ఎంతమంది దగ్గర డబ్బు దోచావో! రంగు నీళ్లకు రూపాయి – ఇంజెక్షనుకు అయిదు – ఆపరేషనుకు అరవై .... ఈ ఊరు డబ్బంతా నీ కడుపులోకే పోయింది. డబ్బివ్వలేని వాడిని చంపుతావు. డబ్బిచ్చేవాణ్ణి కొంతకాలం బ్రతికిస్తావు నీ ఫీజుకోసం. నువ్వు సభలదాకా వచ్చావూ! ఏల? పంచాయతీ ప్రెసిడెంటు అవాలని ఎత్తు వేస్తున్నావా నాయనా! నీ సంగతి చెబుతా మునసబుతో. నీకు ఎలక్షనులో ఉప్పునీళ్లు కూడా దొరక్కుండా చెయ్యకపోతే నా పేరు చలమయ్యే కాదు. కాసుకో.

### 2వ ప్రేక్షకుడు

జానకి తండ్రి ఇలాగే ఉంటాడేమో! ఇంత డబ్బున్నవాడయి, జానకి ఒకర్తే కూతురవుతే, చక్కగా ఇల్లరికమే ఉండచ్చు మనం. నన్ను తప్పక డాక్టరీ చదువమంటారు మామగారు. అప్పుడు మనమూ ఇలాగ సభల్లో... కాని సంతాపసభల్లో మాట్లాడకూడదు.

### సభికులలో ఒక స్త్రీ

ఈ డాక్టరుగారి భార్య ఉత్తి పీనాసట. ముష్టివాడికి అన్నం మెతుకులైనా విసరదట. ఈయన బాగా డబ్బు పోగు చెయ్యటం, ఆవిడ బ్యాంకులో వెయ్యటం, మొగుడంటే ఇలా ఉండాలి. మా ఆయన ఉన్నాడు తెచ్చిన డబ్బు ఏమయింది అండీ అంటే తెల్ల మొహం వేస్తాడు. దారిలో ఎవరు కనిపిస్తే వారికి దానమే. అందరికీ ఆ పువ్వుల పూజ లభించొద్దూ! అరేరే పోతా ఇంటికి. ఈ పాటికి ఆయన యింటికి వచ్చి ప్రక్కింటి ఆవిడతో సభచేసి కూర్చోగలరు.

### భూమయ్య

ఏటయ్యా ఈ డాక్టరు పేలుతాడు! మందేనా సరిగా యివ్వలేని యీడు మాటేం సెప్పగలడు? రంగునీళ్ల పేరుతో అంతా దొంగ సొమ్ము చేసుకుంటున్నాడు. ఆ స్టెతస్కోపు రబ్బరు తీసి నా సుట్టకు తోడుగా చేసుకొంటే బాగుంటుంది.

★★★

డాక్టరుగారు మాట్లాడి వీరసంగా వాలి జేబులోని ఒక మాత్ర మింగి, మంచివీళ్లు త్రాగి కూర్చున్నారు.

పంతులుగారు లేచారు మాట్లాడడానికి. ఆయన లేవగానే ఓ చిన్న జ్ఞాపకం వచ్చి నవ్వుకున్నారు — 'మీరు యిచ్చిన కందిపచ్చడి చాలా రుచిగా ఉందండీ' అన్న భార్యామణి మాట జ్ఞాపకం వచ్చి, మందహాసం చేసి, గబుక్కున సంతాపసభ ఇది అని గుర్తుకు వచ్చి విచారంగా ముఖం పెట్టి ఉపన్యాసం మొదలుపెట్టారు.

'పుల్లయ్యగారి మరణంతో ఈ సమాజం కందిపచ్చడిలేని భోజనంలా తయారయింది. ఆయన కవితలో కందిపచ్చడిలోని కమ్మదనం అంతా ఉంది. ఆయన ముఖవర్చస్సు కందిపచ్చడి వర్చస్సు. కాని, ఆయన జీవితంలో కష్టాలు చూస్తూంటే, కందిపప్పు రుబ్బుతున్నప్పుడు కలిగేటంత బాధ కలుగుతూంది.' అంటూంటే చలమయ్య గారు అరిచారు .... 'ఏమయ్యా నువ్వు కందిపచ్చడి తప్ప జీవితంలో ఇంకేమీ తినలేదూ!' అంటూ.

కార్యదర్శి 'నిశ్శబ్దం' అన్నారు – కొంచెం గర్వంగా, సభ సాగిపోతూందన్న సంతోషంతో.

### సాధువు

భగవాన్! ఈ సంతాపసభకు అధ్యక్షత వహించడం నీ ఇచ్ఛకదూ! సినీమా టిక్కెట్టు క్యూలో నిలుచున్న లావుపాటి ఆయన జేబు కాళీ చేసినప్పుడు – లైసెన్సు లేకుండా మత్తు పానీయాలు దేశంలో ప్రసారం చేసినప్పుడు – టాక్సీ డ్రైవ్ చేస్తూ మనిషి మీద పెట్టగా అతడు మరణించినపుడు లభించిన శ్రీకృష్ణజన్మస్థానం వదిలాక, ఇంటి దగ్గర గయ్యాళి భార్య గుర్తుపట్టకపోగా జీవితం మీద విరక్తిగలిగి యీ అవతారం దాల్చానే – ఎక్కడ ఎప్పుడు ఎన్నాళ్లు ఋణమో! ఈ కార్యదర్శి కాస్త కాఫీ నీళ్ళన్నా

పొయ్యడేం చెప్మా? సంతాప సభ పేరు చెప్పి విరాళాలు ఎంత వసూలు చేశాడో? అందులో అయిదవ వంతైనా నాకు విరాళమిచ్చితే రెండు రోజులు భోజనం హాయిగా గడిచేదిగా? నా తోటి సాధువు మూల జోగుతున్నాడే! పాపం ఆయాసం మత్తు కాదు, ఆకలి, నీరసం మీద మత్తు. పడుకోనా? తెల్లారిపోతూంది. పంతులు గారి కందిపచ్చడి మాట వింటూంటే, పది దినాల ఆకలి పెల్లుబికి వస్తూంది. జై సీతారాం! ఏమి ఇచ్చరా నీది!

**కార్యదర్శి**

పంతులుగారు ఏమి మాట్లాడినా పరిహాసంగానే ఉంటుంది. అసలు ఆయన స్వరూపమే అటువంటిది. కుంటికాలూ, బిళ్ల గోచి, నెత్తిమీద కోడిపుంజులా నిలుచునే రెండు వెంట్రుకలు. ఎటు చూశాడో తెలియని మెల్లకళ్లు – ఈ ఊళ్లో ఉండవలసిన వాడు. డాక్టరుగారు కుర్చీలో కూర్చోలేకపోతున్నారే. నల్లులు పట్టాయేమిటి చెప్మా! కావచ్చు, నన్నూ కుడుతున్నాయి. మరి ఈ హాలు కుర్చీలు తాతలనాటివి కదా! పవిత్రమైన వాటికి నల్లులు పట్టడం సహజం. అసలు ఈ సాధువు ఎవరో? వీడు డిటెక్టివ్ రహస్యంలా ఉన్నాడు. పలకరిస్తే ఏం గొడవో? సభ కాగానే మాట్లాడకుండా సాగనంపాలి. లేదా ఏదైనా సన్మానం చెయ్యమనగలడు. పంతులుగారి ఉపన్యాసం అయిపోయిందే! చలమయ్య గారు మాట్లాడుతారు. కానీ, వీడి సిగ తరగా. అలా కోపంతో చిందులు త్రొక్కుతాడెందుకూ? ఎవరిమీద ఈ ఆగ్రహం! అసలు యీ సంతాపసభలో కొంచెం కోపం తగ్గించుకోవద్దూ!

చలమయ్య అరిచాడు. ఉపన్యాసంలో:–

అసలు ఈ సన్యాసులు, సాధువులు సంతాప సభలకు అధ్యక్షత వహించడమేమిటి? అర్థం లేకుండా? ఈ కార్యదర్శికైనా బుద్ధి ఉండొద్దూ? సాధువు ఎగిరాడు కోపంతో 'అసలు సన్యాసులు అధ్యక్షత వహించినపుడు కోపిష్టి మనుష్యులు మీరు మాట్లాడం ఏమిటి? అర్థంలేదు. ఇక మీరు మీ ఉపన్యాసం ఆపండి' అన్నారు అధ్యక్షులు. 'నేను ఆపను. నువ్వేంచేస్తావు' – ఠీవిగా నిలుచున్నాడు చలమయ్య.

'నేను బెల్లు కొడతాను' అన్నాడు సాధువు అధ్యక్షుడు.

'కొట్టుకో. బంట్రోతు బలవంతయ్య వచ్చి నిన్ను గెంటేస్తాడు' సవాలు చేశాడు చలమయ్య.

'ఏమండోయి! కాస్సేపు శాంతి!' గోలగా అరిచాడు కార్యదర్శి.

'ఆయన్ను కొంచెం నోరు సంబాళించుకోమనండి' అన్నారు అధ్యక్షులు సాధువుగారు.

'ఓరి! నీకింత పొగరా? నన్ను అలా అంటావా?' అంటూ జేబులోని పేకముక్కలు బాణవర్షంలా కురిపించాడు సాధువుమీద చలమయ్య.

'నీ పని పడతా' – అంటూ సాధువు కోపంగా చేతిలోని కర్ర కమండలం చలమయ్య మీదకు విసిరాడు – ఆటం బాంబులా. 'అరెరే! ఫస్ట్ ఎయిడ్ బాక్సు తేలేదే' అనుకున్నారు డాక్టరుగారు.

పంతులుగారు బ్రతికుంటే బలుసాకుకూర కందిపచ్చడితో భోంచెయ్యవచ్చని ఆ గందరగోళం లోంచిజారుకున్నారు. సాధువు, చలమయ్య కలియబడ్డారు కచ్చాలు బిగించి.

'శాంతి, శాంతి' అని అరిచాడు కార్యదర్శి. మూడో సంగ్రామానికి విత్తులు చల్లబడుతున్నాయన్న భయంతో.

కార్యదర్శి కేకలకు ఆ వీధి పోలీసు ప్రత్యక్షమయ్యాడు. అసలు అధ్యక్షత వహించవలసిన మునసబుగారు భూమి అమ్మకం వ్యవహారం ముగించుకు వచ్చారు. పోతున్న ప్రేక్షకులనుద్దేశించి 'సభ అయిపోయిందా' అన్నారు. కార్యదర్శిని పిలిచారు కాని, ఆ కొట్లాటలో బాధపడుతున్న కార్యదర్శికి ఆమాటలు వినబడలేదు. చలమయ్య పేకముక్కలు చిరిగి ముక్కలయ్యాయి. సాధువు కర్ర కమండలం చెక్కలయి ఊరుకుంది. చలమయ్య గాయానికి కట్లు కడతానని డాక్టరుగారు తీసుకుపోయారు. తోడిసాధువు అధ్యక్ష సాధువును లాక్కుపోయాడు సత్రంలోకి.

మునసబుగారు ఒంటరిగా ఎదురుగా నిలుచున్న కార్యదర్శిని ప్రశ్నించారు. 'ఏమయింది సభలో' అని. సంతాపసూచకంగా కార్యదర్శి ఎల్లయ్యగారు కుర్చీలో కూలబడ్డారు చేతులు నెత్తిన పెట్టుకొని. నెత్తిమీద చెమట బిందువుల తడి తగిలింది కార్యదర్శిగారికి – కాని ఒక్క శిరోజంకూడా లేదని తట్టింది. అప్పటికే గుర్తించారు కార్యదర్శి – ఒక్కొక్క సభకు ఒక్కొక్క వెంట్రుక రాలిపోయింది కాబోలు అని. మునసబుగారు మూల్గుతూ వెళ్ళిపోయారు కార్యదర్శిని వదిలి, పనుందంటూ.

కార్యదర్శి ఎల్లయ్యగారు బంట్రోతు బలవంతయ్యను హాలు తలుపులు మూయమని సంతాపంతో సాగిపోయారు ఇంటికి. ఇంటికి రాగానే కార్యదర్శికి ఒక విచిత్రమైన వార్త అందింది – మహాకవి పుల్లయ్య గారి మహాకాయం శ్మశానందాకా వెళ్ళాక ఊపిరి పీల్చుకోసాగిందని; తిరిగి ఏడుకట్లు విప్పుకుని ఇంటికి వచ్చి కోలుకుంటున్నారని.

# చిన్నమాట

తెలుగు భాషకు, తెలుగు సంస్కృతికి తెలుగు రాష్ట్రాలలోనే ఆదరణ కరువైంది. మాతృభాష విలువ మాతృభూమిలో ఉన్నవారి కన్నా, దాని నుంచి దూరమైన వాళ్లకే తెలుస్తుందనిపిస్తోంది.

అమెరికా లాంటి దూరదేశాలలో ఉంటున్న తెలుగువారు ఈ మధ్య తెలుగుభాష, తెలుగు సంస్కృతి పట్ల బాగా మక్కువ చూపిస్తున్నారు. ఇది శుభ పరిణామమే.

అమెరికా తెలుగువారు తమ అస్తిత్వాన్ని నిలుపుకునేందుకు తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా తమ పిల్లలకు తెలుగుభాషను, తెలుగు సంస్కృతిని అలవర్చడానికి మిక్కిలి శ్రమిస్తున్నారు. అక్కడున్న తానా, నాటా, ఆటా వంటి పలు తెలుగు సంస్థలు తమ వంతు పాత్రను పోషిస్తున్నాయి. ముఖ్యంగా సిలికానాంధ్ర సంస్థ వారు 'మన బడి' అనే కార్యక్రమాన్ని చేపట్టి అక్కడి తెలుగు పిల్లలకు తెలుగుభాషను, సంస్కృతిని నేర్పడానికి విశేషమైన కృషిచేస్తున్నారు. వారికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారు తగిన సిలబస్‌ను రూపొందించి, పాఠ్య పుస్తకాలను ప్రచురించి తెలుగుభాషా బోధనకు తమ సహకారాన్ని అందిస్తున్నారు.

మాతృభూమిలో ఆదరణ కోల్పోయిన భాషకు పరాయి దేశాలలో పట్టం కట్టాలని ప్రయత్నిస్తున్న ప్రతివారిని అభినందించాల్సిన అవసరం మనందరిపైనా ఉంది.

బాలవికాసానికి, భాషావికాసానికి తోడ్పడే బాలల సాహిత్యాన్ని ప్రోత్సహించడానికి మేము సహితం అంటూ కథామంజరి నడుం కట్టడం కూడా హర్షణీయమే కదా.